www.navatelangana.com

అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

మంగళవారం 25-03-2025 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 11 | సంచిక : 33 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50

విద్యార్థులకు యూఎస్ షాక్



భారీగా ఎఫ్-1 వీసాల తిరస్కరణ

గత ఆర్థిక సంవత్సరంలో 41 శాతం అప్లికేషన్లు రిజెక్ట్

పదేండ్లలో ఇదే గరిష్టం

వివరాలు 11లో



స్టాండప్ కమెడియన్ షోపై

రేగిన వివాదం

హేబిటేట్ స్టూడియోను కూల్చివేసిన బీఎంసీ అధికారులు

కునాల్ కమ్రా క్షమాపణ చెప్పాలి : మహా సీఎం

కోర్టులు ఆదేశిస్తేనే చెప్తా : కమ్రా

మూక హింసే వారి మార్గం : సీపీఐ(ఎం) ఖండన

మూతబడిన స్టూడియో, కమ్రాపై ఎఫ్ఐఆర్

ముంబయి : మహారాష్ట్ర డిప్యూటీ ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిండేపై కమ్రా ఇటీవల చేసిన వ్యాఖ్యలతో రాజకీయ దుమారం చెలరేగిన తరుణంలో బృహన్‌ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) సిబ్బంది ముంబయిలోని కమ్రా షో ప్రదర్శించబడిన హేబిటేట్ స్టూడియోలో పలు భాగాలను కూల్చివేశారు. ఈ స్టూడియో నిబంధనలను ఉల్లంఘిస్తోందని అందుకే కూల్చివేశామని అధికారులు చెప్పారు. అయితే ఎలాంటి నిబంధనలు ఎలా ఉల్లంఘించబడ్డాయో సరైన సమాచారం లేదు. బీఎంసీ అధికారులు అధికారికంగా ఎలాంటి వివరాలనూ ఇవ్వలేదు. అయితే,ఖార్‌లోని యూనికాంటినెంటల్ హోటల్ లోపల గల వేదిక వద్దకు సుత్తులు పట్టుకుని పౌర అధికారులు ప్రవేశించడం కనిపించింది.

ఇదిలావుండగా, శిండేను ప్రస్తావిస్తూ 'గద్దార్ లేదా రాజద్రోహి' అని తాను చేసిన వ్యాఖ్యల గురించి తానేమీ చింతించడం లేదని కమ్రా ముంబయి పోలీసులకు తెలిపారు. న్యాయస్థానాలు ఆదేశిస్తేనే తాను క్షమాపణలు చెబుతానని కమ్రా ఇప్పటికే స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ అసెంబ్లీలో మాట్లాడుతూ, భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ పేరుతో తక్కువ స్థాయి కామెడీని, డిప్యూటీ ముఖ్యమంత్రిని అగౌరవపరచడాన్ని సమర్థించలేమని అన్నారు. కమ్రా తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే రెండు ...10లో

వడగండ్ల వాన ఊడ్చేసింది

రైతులను ఆదుకోండి : జీరో అవర్‌లో ఎమ్మెల్యేల విజ్ఞప్తి ..

రైతులకు పరిహారం అందజేస్తాం : మంత్రి తుమ్మల



నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

తమ తమ నియోజకవర్గాల్లో వడగండ్ల వాన పంటలను ఊడ్చేసిందనీ, చేతికందే దశలో పంట రాళ్లపాలు కావడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారని ఎమ్మెల్యేలు ఆందోళన వ్యక్తం చేశారు. స్పందించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. నష్టాన్ని అంచనా వేసేందుకు అధికారులకు ఆదేశాలిచ్చినట్టు తెలిపారు. అది పూర్తికాగానే పరిహారాన్ని అందజేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించినట్టు వివరించారు. సోమవారం శాసనసభ జీరో అవర్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం, సీపీఐ సభ్యులు తమ తమ నియోజకవర్గాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించారు. కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి, మాట్లాడుతూ తన నియోజకవర్గంలోని మాడ్గులలో వడగండ్ల వానకు నాలుగువేల ఎకరాల్లో పంట దెబ్బతిన్నదని వివరించారు. కరెంట్ స్తంభాలు కూలిపోయి ఆయా గ్రామాల్లో కరెంట్ లేకుండాపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పనులను వేగవంతం చేయాలని కోరారు. తలకొండపల్లి, పండగొని చెరువు కట్ట తెగిపోయాయనీ, వెంటనే మరమ్మతులు చేయాలని విజ్ఞప్తి చేశారు. దేవరకద్ర శాసనసభ్యులు జి మధుసుధన్‌రెడ్డి కూడా పంట నష్టపోయి రైతులను ఆదుకోవాలని కోరారు. బీజేపీ పక్ష నేత ఏలేటి మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ నిర్మల్‌లో ఇథనాల్ కంపెనీకి వ్యతిరేకంగా పోరాడి విజయం సాధించిన రైతులపై పెట్టిన కేసులు ఎత్తేయాలని డిమాండ్ చేశారు. రైతులు కోర్టుల చుట్టూ తిరగలేకపోతున్నారని తెలిపారు. నిజామాబాద్ రూరల్ శాసనసభ్యులు భూపతిరెడ్డి మాట్లాడుతూ పసుపు పంట కు మద్దతు ధర కోసం, ఎర్రజొన్న కొనుగోలు కోసం ...10లో

ఇంకెన్నాళ్లీ ఈ పిల్ల త్రోవలు గిరిజన ఎమ్మెల్యేల ఆవేదన

తమ నియోజకవర్గాల్లోని తండాలకు పిల్లతోవలు ఇంకెన్నాళ్లంటూ గిరిజన ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, కోవ లక్ష్మి, తెల్లం వెంకట్రావు, మురళీనాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని తండాలకు బైక్‌లు, ఆటోలు కూడా పోవని తెలిపారు. అత్యవసర సమయాల్లో ఆస్పత్రికి చేరుకోవాలంటే నరకం కనిపిస్తోందని వాపోయారు. వాగులపై బ్రిడ్జిలు లేకపోవడంతో వానాకాలంలో గిరిజనులు కష్టాలు పడాల్సి వస్తుందన్నారు. బోథ్ కేంద్రంలో డిగ్రీ కళాశాలలకు అనుమతి ఇవ్వాలని కోరారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో అండర్ గ్రౌండ్ డ్రయినేజీ ఏర్పాటు చేయాలన్నారు. వెంకటాపూర్, చర్లకు రహదారికి అనుమతి ఇవ్వాలని కోరారు.

పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలి

తెలంగాణ రైతు సంఘం డిమాండ్

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

అకాల వర్షాలు, వడగండ్ల వానలతో పంట నష్టపోయిన రైతులకు పూర్తి పరిహారం చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం డిమాండ్ చేసింది. పంటలు కోతకు వచ్చే తరుణంలో అవి దెబ్బతినటంలో నష్టపోయిన రైతులు ఆందోళనలో ఉన్నారని పేర్కొంది. మొక్కజొన్న, వరి, మామిడి, కూరగాయలు, చెరుకు తదితర పంటలు బాగా దెబ్బతిన్నాయని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోతినేని సుదర్శన్‌రావు, టి.సాగర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'పిడుగులు పడి ఇద్దరు మరణించారు. గొర్రెలు, మేకలు, పశువులను నష్టపోయారు. కొన్ని చోట్ల మార్కెట్‌కు తెచ్చిన ధాన్యం తడిసింది' అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వానాకాలంలో ఐదు లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బ తిన్నాయని తెలిపారు. ఎకరాకు రూ.10వేల పరిహారం ఇస్తామన్న ...10లో



జస్టిస్ వర్మ ఇంట్లో నోట్ల కట్టలపై చర్చకు

బీజేపీ అడ్డగింత

చర్చ జరపాల్సిందే : సీపీఐ(ఎం) ఎంపీ వి. శివదాసన్ డిమాండ్

డీకే శివకుమార్ వ్యాఖ్యలపై కమలం పార్టీ ఆందోళన

ఆయన వ్యాఖ్యలను వక్రీకరించారు : కాంగ్రెస్

స్తంభించిన పార్లమెంట్

నవతెలంగాణ–న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్ ఉభయసభలు స్తంభించాయి. ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి యశ్వంత్ వర్మ ఇంట్లో గుట్టలుగా.. నోట్లకట్టలు వెలుగులోకి రాగా.. ఈ అంశంపై కాంగ్రెస్ చర్చకు సిద్ధమైంది. దీనికి ప్రతిగా కర్నాటకలో ముస్లిం రిజర్వేషన్లకు సంబంధించిన ప్రకటనపై అధికార బీజేపీ పార్లమెంటును స్తంభింపజేసింది. కర్నాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ రిజర్వేషన్ల కోసం రాజ్యాంగాన్ని మార్చడానికి వెనుకాడబోనని చెప్పారని ఆరోపిస్తూ అధికార బీజేపీ సభ్యులు లోక్‌సభ, రాజ్యసభలో ఆందోళనలతో గందరగోళం సృష్టించారు. అవసరమైతే రాజ్యాంగంలో మార్పులు చేస్తానని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చేసిన ప్రకటన రాజ్యాంగ ఉల్లంఘన అని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు రాజ్యసభలో ఆరోపించారు. మత ఆధారిత రిజర్వేషన్ల కోసం రాజ్యాంగాన్ని మారుస్తామని చేసిన ఈ ప్రకటన చాలా తీవ్రమైన విషయమని, రాజ్యాంగ పదవిలో ఉన్న సీనియర్ నాయకుడు చేసిన వివాదాస్పద ప్రకటనపై కాంగ్రెస్ వివరణ ఇవ్వాలని రిజిజు డిమాండ్ చేశారు. రాజ్యసభ ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ బి.ఆర్ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగాన్ని ఎవరూ మార్చలేరని అన్నారు. రిజర్వేషన్లపై శివకుమార్ ప్రకటనను బీజేపీ వక్రీకరించిందని ఖర్గే ఆరోపించారు. బీజేపీ సభ్యులు ఆందోళనలో భాగంగా బిగ్గరగా నినాదాలు చేయడంతో రాజ్యసభ మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడింది. ఇంతలో, శివకుమార్ ప్రకటనపై అధికార ...11లో

ఎంపీల జీతాలు 24 శాతం పెంపు

2023 ఏప్రిల్ 1 నుంచి వర్తింపు 11లో..

సహాయక చర్యల్లో వేగం పెంచండి



ఎస్ఎల్‌బీసీ సమీక్షలో సీఎం రేవంత్

కేంద్రం నుంచి అనుమతులు తీసుకోండి

ప్రత్యేకాధికారిగా శివశంకర్ నియామకానికి ఆదేశం

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి–హైదరాబాద్

ఎస్ఎల్‌బీసీ ప్రమాదంలో చిక్కుకున్న కార్మికులను బయటకు తెచ్చేందుకు అవసరమైన సహాయక చర్యలను కొనసాగించాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. నిరంతరం దగ్గరుండి పర్యవేక్షించేందుకు ఐఏఎస్ అధికారి శివశంకర్ లోతేటిని ప్రత్యేకాధికారిగా నియమించాలని సీఎస్‌ను ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం అసెంబ్లీ కమిటీ హాల్‌లో ఎస్ఎల్‌బీసీ సొరంగంలో జరిగిన ప్రమాదానికి సంబంధించి కొనసాగుతున్న సహాయక చర్యల పురోగతిని ముఖ్యమంత్రి సమీక్షించారు. సీఎంతోపాటు మంత్రులు ఎన్ ఉత్తమ్ కుమార్‌రెడ్డి, జూపల్లి కష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నెల రోజులుగా ప్రమాదస్థలి లో కొనసాగుతున్న సహాయక చర్యల పురోగతిని విపత్తు నిర్వహణ విభాగం ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్, కల్నల్ పరీక్షిత్ మెహ్రా ముఖ్యమంత్రికి వివరించారు. కేంద్ర రాష్ట్రాలకు చెందిన వివిధ విభాగాలతో పాటు ప్రయివేటు సంస్థలన్నీ కలిపి 25 ఏజెన్సీలు సహాయక చర్యల్లో పాలుపంచుకుంటున్నాయని చెప్పారు. ఈ ఆపరేషన్‌లో మొత్తం 700 మంది సిబ్బంది నిమగ్నమైనట్టు చెప్పారు. సొరంగంలో కూలిన రాళ్ల, ఎన్జీఆర్ఐ శాస్త్రీయ అధ్యయనాల ప్రకారం అక్కడ రెస్క్యూ ఆపరేషన్ చేపట్టాల్సి ఉంటుందని అభిప్రాయపడ్డారు. ప్రమాదానికి గురైన కార్మికుల ఆచూకీ కనుక్కునేందుకు అత్యంత ప్రాధాన్యమివ్వాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఈ ఆపద సమయంలో చేపట్టాల్సిన అత్యవసర పనులకు కేంద్రం నుంచి అవసరమైన అన్ని అనుమతులు తీసుకోవాలని ఆదేశించారు. ఫిబ్రవరి 22వ తేదీన ఎస్ఎల్‌బీసీ సొరంగం వద్ద జరిగిన ప్రమాదంలో ఎనిమిది మంది కార్మికులు ఈ ప్రమాదంలో చిక్కుకున్నారు. వీరిలో గుర్ ప్రీత్ సింగ్ మతదేహం మార్చి తొమ్మిదవ తేదీన బయటికి తీసిన విషయం తెలిసిందే. కాగా మిగతా కార్మికులను గుర్తించేందుకు ఆపరేషన్ కొనసాగించాలనీ, అవసరమైన అన్ని ప్రత్యామ్నాయాలను అనుసరించాలని సీఎం అధికారులకు సూచించారు. ఎక్స్‌పర్ట్ కమిటీ సూచనల మేరకు పనులు కొనసాగించాలని అన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ, ఆంధ్రా సబ్ ఏరియా జనరల్ ఆఫీసర్ కమాండింగ్ అజయ్ మిశ్రా, ఇరిగేషన్ సలహాదారు ఆదిత్యనాథ్‌దాస్, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, ఎన్జీఆర్ఐ, జీఎస్ఐ, సింగరేణి, హైడ్రా, ఫైర్ సర్వీసెస్ ప్రతినిధులు, ఎస్ఎల్‌బీసీ పనులు చేపడుతున్న కాంట్రాక్టు కంపెనీ ఎండీ పంకజ్ గౌర్, నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్, ఎస్పీ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో మంత్రివర్గ విస్తరణ

నాలుగు పదవులకు హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ :

పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్

గంటన్నరకు పైగా ఖర్గే, రాహుల్, కేసీ వేణుగోపాల్‌తో

సీఎం రేవంత్‌రెడ్డి సహ టీ–కాంగ్రెస్ నేతల భేటీ 10లో..



చలో హైదరాబాద్ ఉద్రిక్తం

ఆరోగ్యశాఖ కమిషనరేట్ ముట్టడికి ఆశా వర్కర్ల యత్నం

అరెస్టు చేసిన పోలీసులు..

లాగి వ్యాన్లలో పడేసిన వైనం

నేడు రాష్ట్ర వ్యాప్త నిరసనలకు పిలుపు : అరెస్టైన వారిని


పరామర్శించిన సీపీఐ(ఎం) బృందం

నవతెలంగాణ –సుల్తాన్ బజార్

ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు ఇవ్వాలని కోరుతూ తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమం ఉద్రిక్తతకు దారి తీసింది. సోమవారం వివిధ జిల్లాల నుంచి ఆశా వర్కర్లు వేలాదిగా కోఠిలోని ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయానికి చేరుకుని ముట్టడికి ప్రయత్నించారు. ఈ క్రమంలో డీఎంహెచ్ఎస్ పరిసర ప్రాంతాల్లో పోలీసులు భారీగా మోహరించి ఆశాలను అడ్డగించారు. దీంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. జిల్లాల్లోనూ ఎక్కడికక్కడ అరెస్టులు చేశారు. డీఎంహెచ్ఎస్ ప్రధాన ద్వారం ...11లో

ఆశా వర్కర్ల అక్రమ అరెస్టులను ఖండిస్తున్నాం

వారికి ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలివ్వాలి : సీఐటీయూ 11లో..



హైదరాబాద్ స్థానిక సంస్థల కోటా

ఎమ్మెల్సీ ఎన్నిక షెడ్యూల్ విడుదల

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

హైదరాబాద్ స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నికకు షెడ్యూల్ విడుదలైంది. ఈ మేరకు భారత ఎన్నికల కమిషన్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ నెల 28న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. నామినేషన్లకు గడువు ఏప్రిల్ 4 వరకు ఉండగా, 7న నామినేషన్ల స్క్రూటినీ చేపడతారు. అభ్యర్థులు నామినేషన్లను ఉపసంహరించుకునేందుకు గడువు ఏప్రిల్ 9 వరకు ఉంటుంది. ఏప్రిల్ 23న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. ఏప్రిల్ 25న ఓట్లను లెక్కిస్తారు. 29తో ఎన్నికల ప్రక్రియను ముగిస్తారు. మే 1తో ఎమ్మెల్సీ ప్రభాకర్ పదవీ కాలం ముగియనున్న సంగతి తెలిసిందే.

ఎన్నికల్లో మనీ గేమ్

ఎన్నికలలో విజయం సాధించడానికి రాజకీయ పార్టీలు విచ్చలవిడిగా డబ్బు ఖర్చు చేస్తున్న సంగతి తెలిసిందే. ఎన్నికలు ఏవైనా వ్యయం మాత్రం కొండలా పెరిగిపోతూనే ఉంది. గత సంవత్సరం దేశంలో ఐదు ఎన్నికలు జరిగాయి. వీటికి అయిన ఖర్చు ఎంతో తెలుసా? అక్షరాలా రూ.3,861 కోట్లు. ఒక్క లోక్‌సభ ఎన్నికలకే రూ.1.35 లక్షల కోట్లు ఖర్చు చేశారని సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ సంస్థ నిర్వహించిన అధ్యయనం తెలిపింది. అయితే ఇది అనధికారిక అంచనా. మరి లోక్‌సభ ఎన్నికలతో పాటు ఆంధ్రప్రదేశ్, ఒడిశా, అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం రాష్ట్రాల శాసనసభలకు జరిగిన ఎన్నికల కోసం రాజకీయ పార్టీలు చేసిన ఖర్చుపై ఎన్నికల కమిషన్ వెల్లడించిన అధికారిక లెక్కలు ఎలా ఉన్నాయి?

2024లో పార్టీల ఖర్చు	అనధికారిక లెక్క	ఆదాయ, వ్యయాల్లో
రూ. 3,861 కోట్లు	లక్ష కోట్లపైనే	బీజేపీయే టాప్



ఎన్నికల కమిషన్ ఏం చేస్తోంది?

న్యూఢిల్లీ : రాజకీయ పార్టీలు తమ ఆదాయాన్ని, వ్యయాన్ని తెలియజేస్తూ ఎన్నికల కమిషన్‌కు నివేదికలు అందిస్తుంటాయి. అయితే అందులో పూర్తి వివరాలుండవు. కొన్ని జమా ఖర్చు లను రహస్యంగా ఉంచుతాయి. వివిధ రాజకీయ పార్టీలు ఎన్నికల కమిషన్‌కు సమర్పించిన వివరాల ఆధారంగా కామన్వెల్త్ హ్యూమన్ రైట్స్ ఇనిషి యేటివ్ (సీహెచ్ఆర్ఐ) అనే సంస్థ ఇటీవల ఓ అధ్యయనం జరిపింది. అధికారం కోసం రాజకీయ పార్టీలు ఎన్నికలలో ఏ ...11లో

మంచినీళ్ల మాదిరిగా ఖర్చు...

'దిగ్భ్రాంతి కలిగిస్తున్న ఈ లెక్కల్ని చూస్తుంటే ఒక విషయం స్పష్టమవుతోంది. దేశంలో ఎన్నికలు ఇంకెంతో కాలం ప్రజాస్వామ్యం గురించి జరగబోవు. అవి ధనాన్ని విచ్చలవిడిగా వెదజల్లే యుద్ధ క్షేత్రాలుగా మారుతాయి. రాజకీయ పార్టీలు ఈ విధంగా డబ్బును మంచినీళ్ల మాదిరిగా ఖర్చు చేస్తుంటే సామాన్య మానవుడి మనసులో ఓ ప్రశ్న మెదులుతుంది. ఈ డబ్బంతా ఎక్కడి నుంచి వస్తోంది? చివరికి ప్రయోజనం పొందేది ఎవరు?. ఏదేమైనా ఎన్నికలలో ఓట్లు కాదు... డబ్బే నిర్ణయాత్మక పాత్ర పోషించబోతోంది. భారత రాజకీయ భవితవ్యాన్ని నిర్ణయించబోయేది డబ్బే. ఈ ధన ప్రవాహాన్ని ఎన్నికల కమిషన్ అడ్డుకోగలదా? లేదా ధనబలం, గోప్యత ఇలా కొనసాగుతాయా? అనేదే తేలాల్సి ఉంది' అని వెంకటేష్ నాయక్ చెప్పారు.



అలహాబాద్ హైకోర్టుకే

యశ్వంత్ వర్మ

ఆయన ట్రాన్స్‌ఫర్‌ను నిర్ధారించిన సుప్రీంకోర్టు కొలీజియం

కేంద్రం ఆమోదం తర్వాతే అమలులోకి

ఛీ! ఆ చెత్త మాకొద్దు ! బార్ అసోసియేషన్

న్యూఢిల్లీ : తన అధికారిక నివాసంలో భారీ ఎత్తున నోట్ల కట్టలు బయటపడిన వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ బదిలీని సుప్రీంకోర్టు కొలీజియం నిర్ధారించింది. ఆయనను అలహాబాద్ హైకోర్టుకు ట్రాన్స్‌ఫర్ చేయటాన్ని ధ్రువీకరించింది. అగ్నిప్రమాద ఘటన సందర్భంగా ఆయన అధికారిక నివాసంలో కాలిన నోట్ల కట్టలు భారీగా లభ్యం కావటం తీవ్ర కలకలం సృష్టించిన విషయం విదితమే. ఈ ఘటన తర్వాత ఆయనను అలహాబాద్ హైకోర్టుకు ...11లో

తపాస్‌పల్లి రిజర్వాయర్ నింపడంలో కాంగ్రెస్ నిర్లక్ష్యం

పంటలకు నీళ్లందించడంలో విఫలమైన ప్రభుత్వం

ఎండిపోతున్న పంటలకు ప్రభుత్వం బాధ్యత వహించాలి ఎకరాకు రూ. 50వేల నష్టపరిహారం చెల్లించాలి : సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి

రైతులకు మద్దతుగా రాస్తారోకో, నిలిచిన వాహనాలు



నవతెలంగాణ-చేర్యాల

తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను నింపడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి విమర్శించారు. రిజర్వాయర్‌తో చెరువులు, కుంటలను నింపి పంటలను కాపాడాలని, ఎండిపోయిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా చేర్యాల మండల కేంద్రంలోని పాత బస్‌స్టాండ్ వద్ద రైతులకు మద్దతుగా రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. ఎండిపోతున్న రైతుల పంటలకు ఎకరాకు రూ. 50 వేల చొప్పున నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. దేవాదుల నీటితో రిజర్వాయర్‌ను నింపి చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, దూల్మిట్ట మండలాల రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. ఈ నాలుగు మండలాలు భౌగోళికంగా సముద్ర మట్టానికి 500 అడుగుల ఎత్తున ఉన్నందున ప్రతేడాది వర్షాభావ పరిస్థితుల వల్ల రైతుల పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. గత ప్రభుత్వాలు ముందుచూపుతో దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను నిర్మించి కాలువల ద్వారా నాలుగు మండలాల్లోని చెరువులు, కుంటలను నింపేందుకు ప్రణాళికా బద్ధమైన ఏర్పాట్లు చేశారన్నారు. కానీ ఈ సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం రైతుల పట్ల ముందు చూపు లేకుండా నీళ్లను నింపకుండా నిర్లక్ష్యం వహించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే కరువును గుర్తుచేస్తూ సీపీఐ(ఎం) గత రెండు నెలల నుంచి అధికారులకు వినతి పత్రాలు, పత్రికా ప్రకటనలు, ఎండిపోతున్న పంటలను సందర్శించడం వంటి కార్యక్రమాలు చేసినప్పటికీ కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని అన్నారు. భూగర్భ జలాలు అడుగంటిపోయి బోర్లలో నీళ్లు తగ్గడంతో కొత్తగా రైతులు బోరు బావులను తవ్వుకున్నా నీళ్లు రాక రైతుల పొలాలు పూర్తిగా ఎండిపోతున్నాయని తెలిపారు. రాబోయే రోజుల్లో చేర్యాల ప్రాంతంలో పశువులకు నీళ్లు తాగేందుకు కూడా కరువు వచ్చే పరిస్థితులు ఉన్నాయన్నారు. కాబట్టి ఇప్పటికైనా రిజర్వాయర్‌ను దేవాదుల నీళ్లతో నింపి ఈ ప్రాంత చెరువులు, కుంటలను నింపాలని తెలిపారు. లేని పక్షంలో చేర్యాల ప్రాంత రైతులంతా ఏకమై పోరాటం నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శెట్టిపల్లి సత్తిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు కొంగరి వెంకట మావో, బద్దిపడగ కృష్ణారెడ్డి, అలేటి యాదగిరి, ఆయా మండలాల కార్యదర్శులు బండకింది అరుణ్ కుమార్, తాడూరి రవీందర్, ఎండీ షఫీ, చేర్యాల పట్టణ కార్యదర్శి రాళ్లబండి నాగరాజు, మద్దూరు మండల, పట్టణ కమిటీ సభ్యులు ఆముదాల నర్సిరెడ్డి, పోలోజు శ్రీహరి, ముస్త్యాల ప్రభాకర్, బోయిని మల్లేశం,రాళ్లబండి భాస్కర్, రాళ్లబండి చందు, ఎర్రబోస్ అశోక్, మోకు దేవేందర్ రెడ్డి, గొర్రె శ్రీనివాస్, గందాల బాలు,నాగపురి కనకయ్య, బుట్టి చందు తదితరులు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను కట్టలేదని అటవీశాఖ కార్యాలయానికి తాళం

మున్సిపల్ అధికారులు నోటీసు జారీ



నవతెలంగాణ-జైపూర్

చెన్నూర్ పట్టణంలోని ఆటవీ శాఖ నుంచి ఆస్తిపన్ను కట్టలేదని మున్సిపల్ అధికారులు కార్యాలయానికి తాళం వేశారు. ఎనిమిదేండ్లుగా పన్ను చెల్లించకపోవడంతో మున్సిపల్ అధికారులు సోమవారం స్థానిక అటవీ శాఖ డివిజన్ కార్యాలయానికి తాళం వేశారు. ఆర్థిక సంవత్సరం ముగుస్తుండటంతో ఇంటి పన్ను వసూళ్లపై దృష్టి సారించిన అధికారులు పెండింగ్ బకాయిలపై కఠినంగా వ్యవహరిస్తున్నారు. బకాయిలు చెల్లించాలని పలుమార్లు నోటీసులు జారీ చేసినా అటవీ అధికారులు స్పందించకపోవడంతో కార్యాలయానికి తాళం వేసి పెండింగ్ బకాయిలు చెల్లించాలని హెచ్చరించారు.

19 బెట్టింగ్ యాప్‌లకు నోటీసులు

మియాపూర్ పోలీసుల దర్యాప్తు ముమ్మరం

కోర్టులో మెమో దాఖలు

నవతెలంగాణ-మియాపూర్

బెట్టింగ్ యాప్‌లపై మియాపూర్ పోలీసులు కొరడా ఝుళిపిస్తూ యాప్‌లను నడిపిస్తున్న యజమానులకు సోమవారం నోటీసులు పంపించారు. కోర్టులో మెమో దాఖలు చేశారు. బెట్టింగ్ యాప్‌లపై సీరియస్‌గా ఉన్న పోలీసులు ఇప్పటికే పలువురు సినీ హీరోలు, హీరోయిన్లు, సోషల్ మీడియాపై కేసులు నమోదు చేశారు. పంజాగుట్ట పోలీసుస్టేషన్‌లో 11 మందిపై కేసులు నమోదు కాగా, ఈ నెల 19న మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో హీరో రానా, విజయ్ దేవరకొండ, ప్రకాష్‌రాజ్‌తో సహా మొత్తం 25 మందిపై కేసులు నమోదైన విషయం తెలిసిందే. తాజాగా ఈ కేసులో సోమవారం కీలక ముందడుగు పడింది. మియాపూర్ పోలీ సులు 19 బెట్టింగ్ యాప్‌ల యజమానులను కూడా నిందితుల జాబితాలో చేర్చారు. ఏ 23, జిగిల్ రమ్మీ డాట్ కామ్, యోలో 247, ఫెయిర్ ప్లే,జీత్ విన్, వి బుక్, తాజ్ 77, ధని బుక్ 365, 247, 3 365, 25 365, 3 365 జెట్ ఎక్స్, ప్యారీ మ్యాచ్, తాజ్ 777 బుక్, ఆంధ్రా 365 యాప్‌ల నిర్వాహకులను కూడా నిందితుల జాబితాలో చేర్చారు. కోర్టులో మెమో సైతం దాఖలు చేశారు. ఈ క్రమంలో ఇప్పటికే కొంతమంది సెలబ్రెటీలు సోషల్ మీడియా వేదికగా తాము యాడ్ ప్రమోషన్ గతంలోనే ఆపేశామని వివరణ ఇచ్చుకుంటున్నారు. ఏది ఏమైనా బెట్టింగ్ యాప్‌లపై ప్రభుత్వం సీరియస్‌గా ఉండటంతో దర్యాప్తు వేగవంతంగా కొనసాగుతోంది. త్వరలోనే యాప్ యాజమానులకు కూడా విచారించున్నట్టు తెలుస్తోంది.

బైక్‌ను ఢీ కొట్టిన ట్రావెల్స్ బస్సు

- రాపిడో బైక్ డ్రైవర్ మృతి
- జీనోమ్ వ్యాలీలో ఘటన



నవతెలంగాణ -శామీర్ పేట

బైక్‌ను ఓ ప్రయివేటు ట్రావెల్స్ బస్సు ఢీకొట్టడంతో ర్యాపిడో బైక్ డ్రైవర్ మృతిచెందాడు. ఈ విషాద ఘటన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జీనోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శామీర్‌పేట మండలం తుర్కపల్లి గ్రామానికి చెందిన షాదుల్లా(27) ర్యాపిడో బైక్ నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. సోమవారం ఉదయం 8:30 గంటల సమయంలో అతను యాక్టివాపై కొల్తూరు వైపు నుంచి తుర్కపల్లి లోని తన ఇంటికి వెళు _న్నాడు. ఈ క్రమంలో భారత్ బయోటెక్ సమీపంలో ఆర్‌కే ట్రావెల్స్‌కు చెందిన బస్సు ఎదురుగా వస్తున్న యాక్టివాను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ర్యాపిడో డ్రైవర్ తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. జీనోమ్ వ్యాలీ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హెచ్‌సీయూ భూముల అమ్మకాన్ని ఆపాలి

రాహుల్‌గాంధీకి విద్యార్థి, టీచింగ్, నాన్ టీచింగ్ ఐక్య కార్యాచరణ కమిటీల ఆధ్వర్యంలో బహిరంగ లేఖ

నవతెలంగాణ-మియాపూర్

రంగారెడ్డి జిల్లా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల వేలం నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందని, దీన్ని వెంటనే ఆపాలని కోరుతూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి పలువురు బహిరంగ లేఖ రాశారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి, టీచింగ్, నాన్ టీచింగ్ ఐక్య కార్యాచరణ కమిటీల ఆధ్వర్యంలో రాహుల్‌కి బహిరంగ లేఖ రాస్తూ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ 400 ఎకరాల భూములను వేలం వేయడానికి ఏర్పాట్లు పూర్తి చేసిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న భూముల అమ్మకాల నిర్ణయంపై స్పందించి భూముల వేలాన్ని నిలుపుదల చేయాలని కోరారు. యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూములు అమ్మడం ద్వారా యూనివర్సిటీ స్వరూపాన్ని పూర్తిగా కోల్పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో అనేక జీవ వైవిధ్యాలు, చారిత్రాత్మక ఆనవాళ్లు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ నిర్ణయంతో యూని వర్సిటీ స్వరూపం కోల్పోవడమే కాక చారిత్రాత్మక ఆధారాలు సైతం కనుమరు గవుతాయని పేర్కొన్నారు. వెంటనే రాహుల్ గాంధీ స్పందించి, ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకునేలా చొరవ చూపాలని లేఖలో విజ్ఞప్తి చేశారు.



కేసీఆర్‌కు బండి సంజయ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలి

పోలీస్‌స్టేషన్‌లో బీఆర్‌ఎస్ నాయకుల ఫిర్యాదు

నవతెలంగాణ-జైపూర్

బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుపై అనుచిత వాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ భేషరతుగా క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ చెన్నూర్ నియోజకవర్గం ఇన్‌చార్జి డాక్టర్ రాజా రమేష్ సోమవారం జైపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చెన్నూర్, కోటపటపల్లి, మందమర్రి పోలీస్టేషన్‌లలో కూడా ఫిర్యాదులు చేవారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి నిధులు విడుదల చేయించడంలో ధైర్యం చేయని బండి సంజయ్.. రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ పట్ల ఇష్టానుసారంగా మాట్లాడటం అవివేకమని అన్నారు. కేంద్రంలో మంత్రి పదవి చేపట్టిన ఆయన రాష్ట్రానికి అధిక నిధులు తెచ్చి అభివృద్ధికి సహకరించాల్సిందిపోయి.. అసత్య ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. మరోసారి నోరు జారితే తెలంగాణ ప్రజలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బలమూరి అరవింద్‌రావు, మేడి తిరుపతి, బడుగు రవి, బడికెల సంపత్, మల్లేష్, శేఖర్, సురేష్, తన్వీర్, చెన్నూర్‌లో సాదనబోయిన కృష్ణ, బడికెల సంపత్, మెకానిక్ మల్లేష్, నవాజ్ షరీఫ్, మంత్రి బాపు, మోతె తిరుపతి, రేవెల్లి మహేష్, సురేష్‌రెడ్డి, జోడు శంకర్, నాయిని సతీష్, శ్రీను, జలీల్, నయాబ్, ప్రశాంత్, అశోక్, భారతి, సురేష్, శేఖర్, మణి పాల్గొన్నారు.

ఆశాల అరెస్టు అక్రమం

కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆశా వర్కర్లను అరెస్టు చేయటం అన్యాయమని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సైలాబ్‌బాబు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని వారు చేపట్టిన ఆందోళనపై పోలీసులు ఓవరాక్షన్ చేయటమేంటని ప్రశ్నించారు. వారి ప్రవర్తన వల్ల అనేక మంది మహిళలు సొమ్మసిల్లి పడిపోయారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధంతో ఆశ వర్కర్ల ఉద్యమాన్ని అణిచివేయాలనుకుంటే సాధ్యం కాదని గుర్తు చేశారు. ఎన్నికలకు ముందు ఆశ వర్కర్లకు ఇచ్చిన వాగ్దానాలను చిత్తశుద్ధితో అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది ఆశాలు హైదరాబాద్‌లోని కోఠిలోగల కమిషనర్ కార్యాలయంవద్దకు చేరుకోగా ప్రభుత్వం తీవ్ర నిర్బంధకాండను ప్రయోగించిందని గుర్తు చేశారు. ముందస్తుగానే వారిని అరెస్టులు చేయటం ప్రజాస్వామ్యమా? అని ప్రశ్నించారు. మహిళలని కూడా చూడకుండా మగ పోలీసులు ఆశాలను కొట్టి, గాయపరచి బలవంతంగా వ్యానుల్లో కుక్కారని తెలిపారు. ఈ సందర్భంగా జయమ్మ అనే ఆశా వర్కర్ స్పృహ తప్పి పడిపోయినా పోలీసులు కనికరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతో మంది కాళ్ళు, చేతులకు గాయాలయ్యాయని తెలిపారు. సీఐటీయూ రాష్ట్ర నాయకులపై కూడా పోలీసులు దౌర్జన్యం చేశారని తెలిపారు. వారిని వెంటనే విడుదల చేయాలనీ, ఆశ వర్కర్ల న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఓయూ విద్యార్థులు మృతి

అర్ధరాత్రి అడిక్‌మెట్ ఫ్లైఓవర్‌పై ఘటన





నవతెలంగాణ-ఓయూ

ఆ సమయంలో ఎందుకు బయటకు వెళ్లారో తెలియదు.. కానీ ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థులు అర్ధరాత్రి ఓయూ హాస్టల్ నుంచి బైక్‌పై బయటకు వెళ్లి ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. ఈ ఘటన హైదరాబాద్ అడిక్‌మెట్ ఫ్లై ఓవర్‌పై జరిగింది. ఓయూ ఎస్‌ఐ ఎం.ఎ.వహీద్ తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా గోదావరిఖనిలోని సప్తగిరి కాలనీకి చెందిన అటికేటి సిద్దార్థ్(20) ఓయూలో మైనింగ్ ఇంజినీరింగ్ సెకండియర్ చదువుతు న్నాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, దమ్మెగూడ సున్నంపట్టి గ్రామానికి చెందిన బంటు రాజ్ కుమార్(19) మైనింగ్ ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. న్యూ కిన్నెర హాస్టల్లో ఉంటున్న వీరిద్దరూ కలిసి సోమవారం అర్ధరాత్రి 1:30 సమయంలో మరో స్నేహితుడి కేటియం బైక్ తీసుకొని ఓయూ నుంచి అడిక్‌మెట్ వైపు వెళ్లారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు బైక్ స్కిడ్ అయ్యి ఫుట్‌పాత్ మీద పడటంతో ఇద్దరి తలలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. స్థానికులు గమనించి 108కి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దగ్గరుండి ఏర్పాట్లు చేసిన ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్

ప్రమాదం సమాచారం తెలుసుకున్న ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ ప్రొ.మంగు, విభాగం హెడ్ ప్రొ.చంద్రశేఖర్ సోమవారం ఉదయం నుంచి గాంధీ ఆస్పత్రి మార్చురీ వద్ద ఉండి బాధిత కుటుంబాలకు సహకారంగా అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశారు. ఇంజినీరింగ్ కళాశాల తరపున ఇరువురు విద్యార్థుల అంత్యక్రియల ఖర్చుల కోసం కుటుంబ సభ్యులకు రూ.30 వేల చొప్పున అందజేశారు. ఓయూ రిజిస్ట్రార్ ప్రొ.నరేష్ రెడ్డి, ఓఎస్డీ ప్రొ.జితేందర్ నాయక్, చీఫ్ వార్డెన్ డా.శ్రీనివాస్, స్టూడెంట్స్ డీన్ ప్రొ.రాజేందర్ నాయక్, ప్రొఫెసర్లు విద్యాసాగర్, సతీష్ గాంధీ ఆస్పత్రిలో విద్యార్థుల మృతదేహాలకు నివాళులర్పించి, తల్లిదండ్రులను పరామర్శించారు. మైనింగ్ ఇంజినీరింగ్ విభాగంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

బండి సంజయ్ మానసిక స్థితి సరిగా లేదు

బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తన మానసిక పరిస్థితి బాగో లేక కేసీఆర్‌పై బండి సంజయ్ ఏది బడితే అదే మాట్లాడుతున్నారనీ,బాధ్యత గల పదవిలో ఉండి ఆయన అడ్డగోలుగా మాట్లాడటం తగదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద హెచ్చరించారు. సోమవారం అసెంబ్లీలోని మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ కేసీఆర్‌ను ఉద్దేశించి బండి మాట్లాడిని మాటలు అభ్యంతర కరమన్నారు. తన పదవినీ, దేశ గౌరవాన్ని దిగజార్చే విధంగా ఆయన మాటలున్నాయని విమర్శించారు. రాష్ట్రానికి నిధులు, ప్రాజెక్టులు తేవటం చేతకాదు కానీ..గాలి మాటలు, రెచ్చగొటే ప్రసంగాలు చేయటం మాత్రం ఆయనకు అలవాటుగా మారిందని ఎద్దేవా చేశారు. ఇలాంటి నాయకులను బర్తరఫ్ చేయాలని ప్రధాని మోడిని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్‌కుమార్ మాట్లాడుతూ రెండుసార్లు కరీంనగర్ ప్రజలు ఎంపీగా గెలిపిస్తే ఆ జిల్లాను ఏ మేరకు అభివృద్ధి చేశారో చెప్పాలని నిలదీశారు. కరీంనగర్‌కు, రాష్ట్రానికి కావాల్సిన నిధులేమైనా తెచ్చారా? అని ప్రశ్నించారు. చిల్లర రాజకీయాలు మాని విద్యా, వైద్యం, ఉపాధి గురించి మాట్లాడాలని సూచించారు.

విజిలెన్స్, ఎన్‌డీఎస్‌ఏ నివేదికలివ్వండి

ప్రభుత్వానికి కాళేశ్వరం కమిషన్ లేఖ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో లోపాలపై విజిలెన్స్ విచారణ, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎస్‌ఏ)లు సమర్పించిన నివేదికలను అందజేయాలంటూ ప్రభుత్వాన్ని కాళేశ్వరం కమిషన్ ఆదేశించింది. ఈ మేరకు ప్రభుత్వానికి తాజాగా లేఖ రాసింది. విచారణ కోసం జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో కాళేశ్వరం న్యాయ విచారణ కమిషన్ ఏర్పాటైన సంగతి తెలిసిందే. ఆ కమిషన్ ఇప్పటికే విచారణను పూర్తి చేసినట్టు తెలిసింది. సాగునీటి పారుదల శాఖకు చెందిన అన్ని విభాగాల ఇంజినీర్లు, నిర్మాణ సంస్థలు, ఇతర శాఖల అధికారులను విచారించింది. ఆయా అంశాలను క్రోడీకరిస్తూ ప్రస్తుతం నివేదికను రూపొందిస్తున్నట్టు సమాచారం. అయితే ఈ క్రమంలో విజిలెన్స్, ఎన్‌డీఎస్‌ఏ నివేదికలను సైతం ఇవ్వాలని ప్రభుత్వానికి లేఖ రాసింది. మూడు బ్యారేజీలకు సంబంధించి ప్రభుత్వం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌తో విచారణ జరిపించగా, ఇప్పటికే తుదినివేదిక ప్రభుత్వానికి చేరింది. ఇక కేంద్ర ప్రభుత్వం సైతం ఎన్‌డీఎస్‌ఏ ఆధ్వర్యంలో ప్రత్యేక నిపుణుల కమిటీని నియమించగా, ఆ కమిటీ సైతం నివేదికను కేంద్ర జలశక్తి శాఖకు అందజేసింది. కేంద్రం సైతం రాష్ట్ర ప్రభుత్వానికి పంపినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో రెండు నివేదికల ను సైతం తమకు అందజేయాలని ప్రభుత్వానికి కమిషన్ సూచించింది. వాటన్నింటినీ పరిశీలించి, నివేదికను సిద్ధం చేసేందుకు కమిషన్ సిద్ధమవుతున్నది. ఈ క్రమంలో అవసరమైన ఇతర విధానపర నిర్ణయాలు తీసుకునే అవకాశముందనీ, రాజకీయనేతలను విచారణకు పిలవాలా ? వద్దా ? అనేది అప్పుడే చెప్పాలని కమిషన్ భావిస్తున్నట్టు సమాచారం.

సర్క్యులర్‌తో ఉద్యమాలు ఆపలేరు


సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

ఓయూలో విద్యార్థి సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం



నవతెలంగాణ-ఓయూ

ఓయూలో సర్క్యులర్‌తో ఉద్యమాలను ఆపలేరని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. ప్రజాస్వామ్య గొంతుక ఓయూలో ఆంక్షలు ఎత్తేయాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో సోమవారం పొలిటికల్ సైన్స్ డిపార్ట్‌మెంట్ సెమినార్ హాల్లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులు, రైతులు, కార్మికులు, మహిళలకు అనేక హామీలిచ్చి మోసం చేయడమే కాకుండా వారిని అణచివేసేందుకు పూనుకుందని విమర్శించారు. బడ్జెట్‌లో విద్యారంగానికి అతి తక్కువ నిధులు కేటాయించి అన్యాయం చేశారని వాపోయారు. ఓయూలో ఆందోళనలు, నిరసనలు తెలపొద్దంటూ వీసీ జారీ చేసిన సర్క్యులర్‌కు వ్యతిరేకంగా విద్యార్థి సంఘాలు చేస్తున్న ఉద్యమానికి సీపీఐ(ఎం) తరపున సంఘీభావం ప్రకటించారు. ప్రొ.హరగోపాల్ మాట్లాడుతూ.. యూనివర్సిటీ యాజమాన్యం విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించకుండా నిరోధిస్తూ సర్క్యులర్ జారీ చేసి ఆంక్షలు విధించడమంటే సమాజాభి వృద్ధిని అడ్డుకోవడమేనని అన్నారు. యూనివర్సి టీలలో ప్రొఫెసర్లు, విద్యార్థులు తమ న్యాయ మైన ఆకాంక్షలను చెప్పుకోవడానికి ఒక ప్రజాస్వామ్య వేదిక ఉండాలని ఆకాం క్షించారు. అలాంటప్పుడే యూనివర్సిటీలు సమాజాభి వృద్ధికి మార్గదర్శకం అవుతాయని, ఆ వైపు కృషి చేయాల్సిన అవసరం పాలకవర్గాలపై ఉన్నదని అన్నారు. పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రొ.గడ్డం లక్ష్మణ్ మాట్లాడుతూ.. న్యాయబద్ధంగా పోరాడుతున్న విద్యార్థి సంఘాలను, వారి కార్యకలాపాలను అడ్డుకోవడమంటే ప్రజా స్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనన్నారు. ఇటీవల యూనివర్సిటీలో నెలకొన్న పరిస్థితులపై నిజనిర్ధారణ జరిపి ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. ఆర్ట్స్ కళాశాల ప్రొఫెసర్ కాసిం మాట్లాడుతూ.. యూనివర్సి టీలోని కళాశాలల ప్రిన్సిపాళ్లను, వివిధ శాఖల అధిపతులను సంప్రదించకుండా ఓయూ వీసీ ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు గోవర్ధన్ మాట్లాడుతూ.. ఉద్యమాలకు యూనివర్సిటీలు దిక్సూచిగా ఉన్నాయని, ఆ యూనివర్సిటీలను నిర్వీర్యం చేయడం తగదన్నారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు కాంపల్లి శ్రీనివాస్, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు పద్మ, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.ఎల్.మూర్తి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, ఎస్‌యూసీఐ రాష్ట్ర నాయకులు మురహరి, సీఎల్సీ నాయకులు నారాయణ రావు, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి అనిల్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొడపంగి నాగరాజు, పీడీఎస్‌యూ విజృంభన అల్లూరి విజయ్, పీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి ఆనంద్ రావు, ఓయూ ఏఐఎస్ఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు లెనిన్ నెల్లిసత్య, ఎస్ఎఫ్ఐ ఓయూ అధ్యక్షులు ఉదయ్, పీడీఎస్‌యూ నాయకులు మంద నవీన్ రాకేష్ శ్రీను ఆసిఫ్ పాల్గొన్నారు.



మహిళా సంక్షేమం జరగాలంటే ఎక్సైజ్ ఆదాయం తగ్గాలి

- అసెంబ్లీలో బీజేపీ సభ్యులు పాయల్ శంకర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో మహిళా సంక్షేమం జరగాలంటే ఎక్సైజ్ ఆదాయం తగ్గాలని బీజేపీ సభ్యులు పాయల్ శంకర్ సూచించారు. సోమవారం అసెంబ్లీలో పురపాలన, పట్టణాభివృద్ధి, సాంఘిక సంక్షేమం, గిరిజన సంక్షేమం, అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమం, సమాచార, ఐటీ, పరిశ్రమలు, వాణిజ్య శాసన వ్యవహారాలు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమం, రవాణా, వెనుకబడిన తరగతుల సంక్షేమ రంగాల పద్దులపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భర్తలు మద్యానికి బానిసలై చనిపోతున్నారనీ, దీంతో 30 ఏండ్లలోపు మహిళలు వితంతువులుగా మారుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వారికి వితంతు పెన్షన్ ఇవ్వడం సరైందా?, బెల్టుషాపులు లేకుండా చేయడం సరైందా?అన్నది ప్రభుత్వం ఆలోచించాలని సూచించారు. 42 శాతం రిజర్వేషన్ బీసీలకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇతరులను అందులో చేర్చడం సరైంది కాదన్నారు. స్థానిక సంస్థలు, మున్సిపాల్టీలకు అధికారాలివ్వాలని చెప్పారు. చిన్నచిన్న మరమ్మతులు, బల్బులు వంటి పనులకూ హైదరాబాద్‌లో నిర్ణయం తీసుకోవడం సరైంది కాదన్నారు. మున్సిపాల్టీలకు స్వేచ్ఛనివ్వాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో ఉన్నపుడు ప్రజలకు ఉపాధి హామీ పనులు దొరికేవని చెప్పారు. మున్సిపాల్టీల్లో విలీనం అయ్యాక అభివృద్ధి ఏమోగానీ ఉపాధి దొరకడం లేదనీ, దీనిపై ప్రభుత్వం ఆలోచించాలని సూచించారు. రాష్ట్రంలో మార్చిలోనే ఇంత కరువు ఎప్పుడూ చూడలేదన్నారు. నీటి ఎద్దడి తీవ్రంగా ఉందని చెప్పారు. ఫసల్ బీమా యోజనను అమలు చేయాలనీ, పంటల బీమాను తేవాలని కోరారు. ఆదిలాబాద్‌కు పరిశ్రమలు రావాలంటే ఎయిర్‌పోర్టు రావాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాస్తే ఇవ్వడానికి సిద్ధంగా ఉందన్నారు. వెనుకబడిన జిల్లా అభివృద్ధి అవుతుందని అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ కల్పించుకుని 11 ఏండ్లకుపైగా కేంద్రంలో మోడీ ప్రభుత్వం ఉందన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధుల విడుదలలో వివక్ష జరుగుతున్నదని చెప్పారు. విభజన హామీలను అమలు చేయడం లేదన్నారు. దీనిపై బీజేపీ సభ్యులు మాట్లాడాలని కోరారు. పాయల్ శంకర్ మాట్లాడుతూ కేంద్రం నుంచి రాష్ట్రానికి రూ.11 లక్షల కోట్ల నిధులు వచ్చాయని చెప్పారు. దీనిపై ప్రత్యేక చర్చకు సిద్ధమన్నారు. ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను ఖర్చు చేయని అధికారులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కులం పేరుతో దూషించడమే కాకుండా నిధులను ఖర్చు చేయకపోవడం కూడా అట్రాసిటీ కిందికే వస్తుందన్నారు. 11 శాతం వడ్డీకి అప్పులు తేవొద్దనీ, ప్రజలపై భారాలు వేయొద్దని కోరారు. రాష్ట్ర ప్రభుత్వానికి నాలుగు, ఐదు శాతానికే అప్పు వస్తుందని చెప్పారు.

కేసీఆర్ శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలి

సీఎం రేవంత్ రెడ్డికి వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అసెంబ్లీకి హాజరుకాని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ శాసనసభా సభ్యత్వాన్ని రద్దు చేయాలని గజ్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కోరారు. కాంగ్రెస్ నేత నర్సారెడ్డి ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో సిద్దిపేట నుంచి పాదయాత్రగా బయలుదేరిన పార్టీ శ్రేణులు సోమవారం హైదరాబాద్ చేరుకున్నాయి. అనంతరం సీఎం రేవంత్ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించాయి. రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్ కు వినతిపత్రం అందించనున్నట్టు తెలిపాయి. కాగా సోమవారం జూబ్లీహిల్స్‌లోని నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉత్తర అమెరికా తెలుగు సంఘం ప్రతినిధులు కలిశారు. 24వ తానా కాన్ఫరెన్స్‌కు రావాలని సీఎంను ఆహ్వానించారు.

సంగారెడ్డిలో డంపింగ్ యార్డ్ రద్దుకు హైదరాబాద్‌కు కదిలొచ్చిన జనం

- ధర్నాచౌక్ వద్ద ధర్నాకు భారీగా వచ్చిన బాధిత గ్రామాల ప్రజలు
- ప్రజలకు, ప్రకృతికి ప్రమాదకరం డంపింగ్ యార్డ్
- విరమించుకోవాలని ప్రజాసంఘాల పోరాట వేదిక నేతల హెచ్చరిక
- రైతులపై అక్రమ కేసులు ఎత్తేయాలని విజ్ఞప్తి



నవతెలంగాణ -ముషీరాబాద్/గుమ్మడిదల

సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం నల్లవల్లి ప్యారానగర్ లో ఏర్పాటు చేస్తున్న డంపింగ్ యార్డు నిర్మాణం పనులను నిలిపివేయాలని కోరుతూ సోమవారం హైదరాబాద్(ఇందిరాపార్క్)లోని ధర్నాచౌక్ వద్ద జేఏసీ, ప్రజాసంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. డంపింగ్‌యార్డు ప్రజలకు, ప్రకృతికి ప్రమాదకరమని తెలిపారు. ఈ ధర్నాకు ప్రజాసంఘాల పోరాట వేదిక రాష్ట్ర కన్వీనర్ వీరయ్య, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చుక్క రాములు, పాలడుగు భాస్కర్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆర్.వెంకట్రాములు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పర్యావరణానికి ముప్పు కలిగించే డంపింగ్ యార్డ్ నిర్మాణాలను వెంటనే రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజలకు నష్టం కలిగించే ఆలోచనలను విరమించుకోవాలన్నారు. డంపింగ్ యార్డు నిర్మాణం జరుగుతున్న క్రమంలో గ్రామాన్ని ఎమ్మెల్యేలు, ఎంపీలు, కలెక్టర్, అధికారులు గ్రామాలను సందర్శించి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాల్సి ఉన్నా అలాంటివి చేయకుండానే డంపింగ్ యార్డు నిర్మాణం పనులు ఏవిధంగా చేస్తారని ప్రశ్నించారు. ఇంత జరుగుతున్నా ఎన్నికైన ప్రజాప్రతినిధుల నుండి ఎలాంటి స్పందన లేదని అన్నారు. డంపు యార్డు నిర్మాణం జరుగుతున్న క్రమంలో రైతులపై కేసులు పెట్టి నిర్బంధాలకు రాష్ట్ర ప్రభుత్వం గురి చేస్తున్నదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల పట్ల విధిస్తున్న నిర్బంధ ఖండను తక్షణమే నిలిపివేయాలన్నారు. ప్రజల కష్టాలను తీర్చాలిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం మీద ఉందన్నారు. డంపు యార్డు నిర్మాణం జరుగుతుంటే జిల్లా మంత్రి ఏం చేస్తున్నారన్నారు. గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు డంప్ యార్డ్ నిర్మాణం చేస్తూ ఆ ప్రాంత ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్నాయని అన్నారు. జనావాసాలకు దూరంగా పర్యావరణానికి నష్టం కలగకుండా డంపింగ్ యార్డు నిర్మాణం చేయాలన్నారు. నల్లవల్లి ప్యారా నగర్‌ను మరో జవహర్ నగర్‌గా మార్చాలని చూస్తే ఊరుకోబోమని, ఆందోళనను మరింత తీవ్రతరం చేస్తామని నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా పోరాట వేదిక నాయకులు జి.జయరాజ్, కె.రాజయ్య, ఏ.మాణిక్యం, గుమ్మడిదల మండల జేఏసీ నాయకులు చిమ్ముల జైపాల్ రెడ్డి, చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి కుమార్ గౌడ్, సంగారెడ్డి జిల్లా ప్రజా సంఘాల పోరాట వేదిక నాయకులు ఎం నర్సింలు, బి.నాగేశ్వరరావు, అశోక్, కె.రాజయ్య, నల్లవల్లి ప్యారానగర్ జెఏసి నాయకులు రామకృష్ణ, అంజనేయులు సురేష్, రాజు, మల్లేశం గౌడ్, జేఏసీ నాయకులు ప్రభాకర్ రెడ్డి, కుమార్ గౌడ, నల్లవల్లి, ప్యారానగర్ గ్రామాల మహిళలు పెద్దఎత్తున ధర్నాలో పాల్గొన్నారు.



బీఆర్ఎస్ కబ్జా భూములను స్వాధీనం చేసుకోవాలి

- జీరో అవర్‌లో నాయిని రాజేందర్ రెడ్డి వినతి
- తమ నియోజకవర్గాల్లో సమస్యలను పరిష్కరించాలని కోరిన పలువురు సభ్యులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పార్టీ కార్యాలయాల పేరుతో బీఆర్ఎస్ కబ్జా చేసిన భూములను స్వాధీనం చేసుకోవాలని వరంగల్ (పశ్చిమ) నియోజకవర్గం కాంగ్రెస్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కోరారు. సోమవారం శాసనసభలో జీరో అవర్ సందర్భంగా ఆయన మాట్లాడారు. కన్జ్యూమర్ నేమ్ బీఆర్ఎస్, ఫాదర్ నేమ్ బీఆర్ఎస్ అన్నట్టు ఇష్టానుసారంగా భూములను కబ్జా పెట్టారని ఆయన ఆరోపించారు. తాను సమాచార హక్కు చట్టం కింద సేకరించిన వివరాలను అందజేసేందుకు సిద్ధమని తెలిపారు. ఆ కబ్జాలు నిజమనీ, ఉమ్మడి వరంగల్ తో పాటు రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ కబ్జా భూములను విడిపిస్తే రాష్ట్రానికి ఆర్థికంగా ఇబ్బందులు తప్పుతాయని అభిప్రాయపడ్డారు. తాను ఆరోపించిన కబ్జాలు ముమ్మాటికీ నిజమనీ, తప్పని నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. ఇందుకు బీఆర్ఎస్ సిద్ధమా? అని ప్రశ్నించారు. సిర్పూర్ కాగజ్ నగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్ బాబు మాట్లాడుతూ గతంలో అభివద్ధికి నక్సలైట్లు అడ్డుపడితే, ప్రస్తుతం అటవీశాఖ అధికారులు అడ్డుపడుతున్నారని ఆరోపించారు. సీనియర్ ఫారెస్ట్ అధికారులు హైదరాబాద్ లో ఉంటూ పర్యవేక్షణ మరిచిపోయారని చెప్పారు. కలప అక్రమ రవాణా చేసే స్మగ్లర్లపై చర్యలు తీసుకోవడం లేదని తెలిపారు. చర్యలు తీసుకోవాలని కోరారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ మాట్లాడుతూ గణపతి సముద్రం చెరువులో కేవలం 1.30 లక్షల చేపపిల్లలు వేసి 8 లక్షల చేపల పిల్లలను వేసినట్టు కాంట్రాక్టర్ మోసం చేశారని తెలిపారు. సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. జనగామ నియోజకవర్గం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ జనగామ ఆస్పత్రిలో సీటీ స్కాన్ ఏర్పాటు చేయాలనీ, మందుల కొరత లేకుండా చూడాలన్నారు. మలక్‌పేట్ ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాలా మాట్లాడుతూ మూసారాం బాగ్ వద్ద వంతెన నిర్మాణం కోసం మూసీ నీటిని ఆపుతుండటంతో దోమలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణం మూసీ నీటిని వదలాలని సూచించారు. మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో వివిధ రకాల భూముల కబ్జా యధేచ్ఛగా కొనసాగుతుందని తెలిపారు. హైడ్రా అధికారులకు, కలెక్టర్ కు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ మౌలిక వసతుల కల్పనకు రక్షణశాఖతో తక్షణం భూబదలాయింపును చేపట్టాలని కోరారు. సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి మాట్లాడుతూ నియోజకవర్గంలో అవసరమైన కాలువలను తవ్వాలని కోరారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ కమలాపూర్ మండలంలో బస్టాండ్ ను పూర్తి చేయాలని కోరారు. అండర్-19 క్రికెట్‌లో ఎంపికైన ఇద్దరు మహిళల్లో ఒకరికే ప్రోత్సాహకం రూ.ఒక కోటి ఇచ్చారనీ, మరొకరికి కూడా ఇవ్వాలన్నారు.

గజ్వేల్‌పై.. సీఎంకు కుట్రబంధం

- 26న మల్లన్న సాగర్‌పై అసెంబ్లీలో చర్చిస్తాం..
- రద్దు చేసిన రూ. 182 కోట్ల నిధులు మంజూరు చేయాలి : మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు



నవతెలంగాణ-గజ్వేల్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గజ్వేల్‌పై కుట్రబంధం ఎంచుకున్నారని, కేసీఆర్ మాత్రం పేగు బంధం పెంచుకున్నారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు అన్నారు. సోమవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిపాలన చేతకాక రేవంత్ రెడ్డి దుష్ట పాలన సాగిస్తున్నారని విమర్శించారు. గజ్వేల్ నియోజకవర్గం 2014 ముందు ఎలా ఉందో.. ఆ తర్వాత ఎలా ఉందో సీఎం తెలుసుకోవాలని సూచించారు. మొదటి నుంచి గజ్వేల్ నియోజకవర్గం అంటే రేవంత్ రెడ్డికి పడదని, తాము ఎన్నికలకు ముందు గజ్వేల్ అభివృద్ధికి రూ.182 కోట్ల నిధులను మంజూరు చేయగా వాటిని కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రద్దు చేసిందని తెలిపారు. దేశ ప్రధానిని గజ్వేల్‌కు తీసుకొచ్చి దేశంలోనే గుర్తింపు తెచ్చిన ఘనత కేసీఆర్‌కు ఉందన్నారు. మిషన్ భగీరథ పథకాన్ని గజ్వేల్ నుంచి ప్రారంభించి ఇంటింటికీ తాగునీరు ఇచ్చారన్నారు. సాగు, తాగునీటిలో గజ్వేల్ ప్రాంతానికి కాంగ్రెస్ ప్రభుత్వం కోత పెట్టడంతో పంటలు ఎండిపోయాయని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో కోటి రూపాయలకు ఎకరం చొప్పున ఉంటే.. ఇప్పుడు జీరోకు వచ్చిందన్నారు.

26న మల్లన్న సాగర్‌పై చర్చిస్తాం

గజ్వేల్ పట్టణంలో మల్లన్న సాగర్ నిర్వాసితుల సమస్యలపై చర్చించేందుకు కట్‌మోషన్ అనుమతి తీసుకున్నామని హరీశ్ రావు అన్నారు. ఈ నెల 26న అసెంబ్లీలో నిర్వాసితుల సమస్యలపై చర్చిస్తానని, సీఎం రేవంత్ రెడ్డిని నిలదీస్తానన్నారు. తాము రూ.1260 కోట్లు మల్లన్న సాగర్ నిర్వాసితులకు కేటాయించామని, 95శాతం పనులు పూర్తయినట్టు, ఇంకో ఐదు శాతం నిధులు కేటాయిస్తే సమస్య పరిష్కారం అవుతుందని, కానీ రాష్ట్ర ప్రభుత్వం ఆ దశగా స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. కేసీఆర్ నియోజకవర్గం కావడం వల్ల రేవంత్ రెడ్డి మల్లన్న సాగర్ నిర్వాసితుల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీలు డాక్టర్ యాదవ రెడ్డి, దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ ఫారుక్ ఉషన్, ఎఫ్డీసీ మాజీ చైర్మెన్ ప్రతాప్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మెన్ రాజమౌళి, నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ మాదాసు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్ఎస్ నిరసన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రెండు లక్షల రూపాయల రుణమాఫీని పూర్తిగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ శాసనసభ సభ్యులు, మాజీ మంత్రి హరీశ్ రావు నేతృత్వంలో సోమవారం ఆ పార్టీ ఎమ్మెల్యేలు నల్లబ్యాడ్జీలతో అసెంబ్లీ సమావేశాలకు హాజరై నిరసన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన రుణమాఫీ హామీని అమలు చేయకుండా మాట తప్పిం దని సభలో నినాదాలు చేశారు. "రుణమాఫీ బూటకం, కాంగ్రెస్ నాటకం!" "రెండు లక్షల రుణమాఫీ అరకొర, కాంగ్రెస్ కొరకొర!" "రెండు లక్షల రుణమాఫీపై మాట తప్పిన కాంగ్రెస్ డౌన్ డౌన్!" అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పెద్దపెట్టున నినదించారు. ఇచ్చిన మాట ప్రకారం రైతులకు న్యాయం చేయాలనీ, రుణమాఫీని వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

బీజేపీ నిరసన

రాష్ట్రంలో ఫసల్ బీమా యోజన పథకాన్ని అమలు చేయాలని బీజేపీ సభ్యులు శాసనసభలో నినాదాలు చేశారు. అకాల వర్షాలతో రాష్ట్రంలో పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30 వేలు ఇవ్వాలని నినదించారు.

మైనార్టీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి

హామీల అమలు కోసం నిరసన కార్యక్రమాలు : కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మైనార్టీ డిక్లరేషన్ ను వెంటనే అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ మైనార్టీలకు ఇచ్చిన హామీల అమలు కోసం నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్టు ఆయన తెలిపారు. మైనార్టీలకు మంత్రివర్గంలో ప్రాతినిథ్యం ఇవ్వని తొలి కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉందని ఎద్దేవా చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జరిగిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొని ముస్లిం సోదరులందరికీ శుభాకాంక్షలు తెలిపి, ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "మతాలక తీతంగా మనుషులందరినీ మనుషులుగా చూసిన గొప్ప పాలకుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్. ఆయన నాయకత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం మతాలకతీ తంగా అన్ని పండగలకు ప్రభుత్వ కానుకలు అందించింది. గంగా-జమునా తహజీబ్ సంస్కృతిని కొనసాగిస్తూ, సమాజంలో శాంతిని పెంపొందించే సంస్కృతిని నెలకొల్పాం. మైనార్టీ బాలబాలికలకు అత్యుత్తమ విద్య కోసం గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేశాం. విదేశీ విద్యావకాశాలను కల్పించేందుకు ప్రత్యేక విదేశీ విద్యా పథకాన్ని అమలు చేశాం. అమెరికా, బ్రిటన్ వంటి దేశాల్లో ఉన్నత విద్యకు అవకాశం కల్పించాం. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మైనార్టీ సంక్షేమ కార్యక్రమాలన్నింటికీ మంగళం పాడుతోంది...." అని కేటీఆర్ విమర్శించారు. "దేశంలో ఎక్కడైనా కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు మైనార్టీలకు మంత్రివర్గంలో ప్రాతినిధ్యం ఉంటుంది. కానీ, తెలంగాణ చరిత్రలో తొలిసారిగా మైనార్టీలకు ప్రాతినిధ్యం లేని కాంగ్రెస్ ప్రభుత్వం ఇక్కడ ఉంది. ఇది కాంగ్రెస్ తీసుకొచ్చిన కొత్త కల్చర్. కాంగ్రెస్ ప్రభుత్వం తమ మైనార్టీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలన్నింటినీ, పథకాలను వెంటనే అమలు చేయాలి. మైనార్టీ కార్పొరేషన్‌ను బలోపేతం చేస్తామన్న హామీతో పాటు అన్ని హామీలను నెరవేర్చాలి. అప్పటి వరకు మైనార్టీల తరఫున రాష్ట్ర ప్రభుత్వంపై, కాంగ్రెస్ పార్టీపై ఒత్తిడి తీసుకొస్తాం..." అని కేటీఆర్ స్పష్టం చేశారు.



31లోపు రైతుభరోసా చెల్లిస్తాం

అసెంబ్లీలో మంత్రి తుమ్మల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఈనెల 31లోపు రైతు భరోసా నిధులను పూర్తిగా చెల్లిస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు స్పష్టం చేశారు. సోమవారం అసెంబ్లీలో బీజేపీ సభ్యులు పాయల్ శంకర్ మాట్లాడుతూ రూ.49,500 కోట్లు రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. కానీ ఇప్పటి వరకు రూ.20 వేల కోట్లు మాఫీ చేశారని వివరించారు. మిగిలిన రైతులు ఆందోళనలో ఉన్నారని చెప్పారు. రైతుల బాధను అర్థం చేసుకుని రుణమాఫీ చేయాలని కోరారు. దీనిపై మంత్రి తుమ్మల స్పందిస్తూ రుణమాఫీకి సంబంధించి ఏడాదిలో రూ.20 వేల కోట్లు మాఫీ చేశామన్నారు. పదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.11 వేల కోట్లు రుణమాఫీ చేసిందని వివరించారు. పంటరుణాలు, దీర్ఘకాల రుణాలు, తాత్కాలిక రుణాలు వేర్వేరని అన్నారు. కుటుంబానికి రూ.రెండు లక్షల్లోపు రుణమాఫీ చేశామని చెప్పారు. రైతు భరోసా నిధులను ఈనెల 31లోపు రైతుల ఖాతాల్లో జమ చేస్తామన్నారు.

ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటీకరిస్తోన్న కేంద్రం

- అసెంబ్లీలో మంత్రి శ్రీధర్‌బాబు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశంలో ప్రభుత్వరంగ సంస్థలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రయివేటుపరం చేస్తున్నదని పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి డి శ్రీధర్‌బాబు విమర్శించారు. సోమవారం అసెంబ్లీలో బీజేపీ సభ్యులు పాయల్ శంకర్ మాట్లాడుతూ భూములను అమ్మేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవు తున్నదని అన్నారు. భూములను అమ్మేందుకు ప్రభుత్వం ఎందుకు?, రియల్ ఎస్టేట్ బ్రోకర్లు సరిపోతారని ఎద్దేవా చేశారు. దీనిపై మంత్రి శ్రీధర్‌బాబు స్పందిస్తూ ప్రభుత్వరంగ సంస్థలను కేంద్రం ప్రయివేటుపరం చేస్తున్నదని విమర్శించారు. చివరి రక్షణరంగాన్ని కూడా ప్రయివేటీకరణ చేస్తున్నదని అన్నారు. ఎల్ఐసీ ఆస్తులను అమ్ముతున్నదని వివరించారు. నిధుల సమీకరణ కోసం కేంద్ర ప్రభుత్వం పలు రంగాలను ప్రయివేటీకరిస్తున్నదని చెప్పారు. కానీ బీజేపీ సభ్యులు కేంద్రానికి మద్దతు ఇస్తున్నారని అన్నారు. కేంద్రం చేస్తే ఒప్పు, రాష్ట్రం చేస్తే తప్పు ఎలా అవుతుందని ప్రశ్నించారు.

సంపాదకీయం

దక్షిణాపథం...



లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన సరికొత్త ఆందోళనలకు దారితీస్తున్నది. డీలిమిటేషన్ ప్రక్రియ కేవలం పార్లమెంటులో ప్రాతినిధ్యానికి సంబంధించిన అంశం మాత్రమే కాదు. నిధులు కేంద్రీకృతం...ఆర్థిక నియంతృత్వానికి దారితీస్తుంది. అదే జరిగితే దక్షిణాది భవిష్యత్తు అగమ్యగోచరమే. కొన్ని రాష్ట్రాలు జనాభా నియంత్రణను పాటిస్తే... కొన్ని రాష్ట్రాలు విఫలమయ్యాయి. అదే నేడు బీజేపీకి కలిసివచ్చే అంశమైంది. అది దక్షిణాపథానికి శాపమై కూర్చుంది. ఇది దేశాన్ని వెనుకబాటుకు గురిచేసిన వారికి రివార్డివ్వడం లాంటిది. పరిపాలనలో, ఆర్థికాభివృద్ధిలో దక్షిణాది రాష్ట్రాలు దేశానికే ఆదర్శంగా ఉన్నప్పటికీ, తీవ్రమైన నష్టాన్ని ఎదుర్కొంటుంది వాస్తవం. జనాభాను నియంత్రించిన రాష్ట్రాలను శిక్షించి.. ఆ పనిని చేయని రాష్ట్రాలకు సీట్ల నజరానా ప్రకటించడం వైచిత్రి. ఈ వివక్షతపైనే దక్షిణాది రాష్ట్రాల నేతలు మండి పడుతున్నారు. శనివారం చెన్నయ్‌లో తమిళనాడు సీఎం స్టాలిన్ అధ్యక్షతన మొదటి జాయింట్ యాక్షన్ కమిటీ 'ఫెయిర్ డీలిమిటేషన్'ను డిమాండ్ చేసింది.

దేశంలో ఒక రాష్ట్రం మరో రాష్ట్రం మీద ఆధిపత్యం చెలాయించే పరిస్థితి ఉండకూడదు. అదే సిసలైన ప్రజాస్వామ్య స్ఫూర్తి. ఇది కేవలం ఉత్తర దక్షిణ రాష్ట్రాల వ్యవహారం కాదు. అభివృద్ధి చెందిన రాష్ట్రాలు, ప్రాంతాలకు నష్టం చేకూర్చే అంశం. కేవలం జనాభా ఆధారంగా సీట్లు పెరిగితే సమాఖ్య స్ఫూర్తికి తీవ్ర విఘాతం కలిగే ప్రమాదం ఉంది. మనమంతా భారతీయులం. అయితే మనందరికీ ఆయా ప్రాంతాల అస్తిత్వం ఉంది. విభిన్న భాషలు, సాంస్కృతిక అస్తిత్వాలతో కూడిన ఒక సమైక్య దేశమే భారతదేశం అన్న విషయాన్ని మనం మర్చిపోకూడదు.

లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను మరో పాతికేండ్లు వాయిదా వేయాలని కోరుతూ తమిళనాడులో అఖిలపక్ష సమావేశం ఒక తీర్మానాన్ని ఆమోదించింది. ఇదేదో రాష్ట్రానికో, ఒక ప్రాంతానికో ప్రయోజనం కలిగించేది కాదు. జాతీయ సమైక్యతను మరింత పటిష్టం చేసేందుకు ఉద్దేశించిన తీర్మానమది. భారత గణతంత్ర రాజ్య సంస్థాపనలో అంతర్ గర్భితంగా ఉన్న 'సమాఖ్య ఒప్పందం'ను గౌరవించేందుకు ఉత్తమ మార్గం లోక్‌సభా సీట్ల ప్రస్తుత కేటాయింపును ఎటువంటి మార్పు లేకుండా యధాతథంగా కొనసాగించడమే. ప్రస్తుత డీలిమిటేషన్ విధానంతో దేశానికి 36శాతం జీడీపీలో భాగస్వామ్యం ఉన్న దక్షిణాది రాష్ట్రాలకు జనాభా ప్రాతిపదికగా మాత్రమే డీలిమిటేషన్ జరిగితే కేంద్రం చూపేది మాత్రం తెడ్డే.

భిన్న అస్తిత్వాలు, సంస్కృతులు కలిగిన ఒక సమాఖ్య ప్రజాస్వామిక దేశం మనదన్న విషయాన్ని కేంద్రం ప్రతిసారి విస్మరిస్తూనే ఉంది. అందుకే రాజ్యాంగ బద్ధంగా జరగాల్సిన ఈ పునర్విభజన రాజకీయ విభజనగా మార్చడం ద్వారా లబ్దిపొందే మోడీ హిడెన్ ఎజెండా దాగి ఉందన్నది బహిరంగ రహస్యమే. దేశ భవిష్యత్తుకూ రాజకీయ గమనానికి సంబంధించిన కీలకాంశాలపై కూడా పారదర్శకంగా, సమగ్రంగా చర్చ లేకుండా ఒంటెత్తు పోకడలతో వ్యవహరించడం కేంద్ర ప్రభుత్వానికి రివాజు. ప్రతి అడుగులోనూ స్వప్రయోజనాల కోసం ప్రజాస్వామిక పద్ధతులకు తిలోదకాలిచ్చి అంతా తన గుప్పిట్లో పెట్టుకోవడం బీజేపీ సర్కారు విధానం. రాష్ట్రాల హక్కులపై దాడి చేయడం, అంతకంతకూ అధ్యక్షతరహా పాలనను తలపించే విధంగా కేంద్రీకృత పెత్తనానికి దారితీయడం దీని లక్షణంగా ఉంది. అదే సమయంలో అంతా రాజ్యాంగబద్ధంగా పద్ధతి ప్రకారమే జరుగుతున్నట్టు నమ్మించడానికి జరుగుతున్న కుటిల ప్రయత్నాలకు అంతే లేదు.

తాజాగా నియోజకవర్గాల పునర్విభజన కూడా ఈ వలయంలో చిక్కి సరికొత్త సవాళ్లకు దారితీస్తున్నది. దక్షిణాది రాష్ట్రాల స్థానాల సంఖ్య తగ్గిపోతుందనీ, ఒకవేళ పెంచినా వాటి వాటాగా రావాల్సిన పెరుగుదల రాదనీ ఈ ముఖ్యమంత్రుల విమర్శ. యూపీ, బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో ఎంపీ సీట్ల సంఖ్య ప్రస్తుతం ఉన్న 174 నుంచి 284కు పెరుగుతుందని అంచనా. అదే సమయంలో దక్షిణాదిన కొన్ని రాష్ట్రాలకు ఉన్న సీట్లే పోయే ప్రమాదం ఉంది. ఫలితంగా దేశ రాజకీయాల్లో, విధానపరమైన నిర్ణయాలను ప్రభావితం చేయడంలో.. దక్షిణాది మాటకు విలువ లేకుండా పోయే ముప్పుంది. కేంద్రం నుంచి రావాల్సిన నిధులు కూడా తగ్గిపోయే ప్రమాదం లేకపోలేదు. ఇప్పటికే అన్యాయానికి గురైన దక్షిణాది రాష్ట్రాలకు ఇది పుండు మీద కారం చల్లడమే అవుతుంది.

దేశంలో ఒక రాష్ట్రం మరో రాష్ట్రంమీద ఆధిపత్యం చెలాయించే పరిస్థితి ఉండకూడదు. అదే సిసలైన ప్రజాస్వామ్య స్ఫూర్తి. ఇది కేవలం ఉత్తర దక్షిణ రాష్ట్రాల వ్యవహారం కాదు. అభివృద్ధి చెందిన రాష్ట్రాలు, ప్రాంతాలకు నష్టం చేకూర్చే అంశం. కేవలం జనాభా ఆధారంగా సీట్లు పెరిగితే సమాఖ్య స్ఫూర్తికి తీవ్ర విఘాతం కలిగే ప్రమాదం ఉంది. మనమంతా భారతీయులం. అయితే మనందరికీ ఆయా ప్రాంతాల అస్తిత్వం ఉంది. విభిన్న భాషలు, సాంస్కృతిక అస్తిత్వాలతో కూడిన ఒక సమైక్య దేశమే భారతదేశం అన్న విషయాన్ని మనం మర్చిపోకూడదు. బీజేపీ అంటకాగుతున్న చంద్రబాబు, పవన్‌లు కానీ, విపక్షపార్టీ అధినేత జగన్ కానీ తమిళనాడు సమావేశానికి వెళ్లకుండా కేంద్రం ముందు ఆ రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టుపెట్టారు. "దక్షిణాదిలోని అన్ని రాష్ట్రాలు, రాజకీయ పార్టీలు విభేదాలను వీడి, పునర్విభజనలో మన వాటా దక్కించుకునేందుకు ఐక్యంగా పోరాడాలి. తమతమ శాసనసభల్లో దీనిపై తీర్మానం చేయాలి" అన్న తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి మిగతా రాష్ట్రాలు పరిగణలోకి తీసుకోవాలి. దక్షిణ భారత గళాన్ని బలంగా, ఐక్యంగా యావత్ దేశానికి మరింత గట్టిగా వినిపించాల్సిన అవసరం ఉంది.

'ఉస్మానియా' గొంతుపై సర్క్యులర్ కత్తి!

ఉస్మానియా విశ్వవిద్యాలయం వందేళ్లను పూర్తిచేసుకుని మరో ఎనిమిదేండ్లతో తన నూతన శకాన్ని ప్రారంభించింది. ఇది చరిత్రలో ఎన్నో ఘట్టాలను, అనేక మైలురాళ్లను అధిగమించి విద్యారంగాన్ని విస్తృతస్థాయిలో అభివృద్ధిపరచటంలో ముఖ్యమైన పాత్ర పోషించింది. దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన విశ్వవిద్యాలయాల్లో ఒకటిగా పేరుగాంచింది. ఎంతోమందిని అత్యుత్తమ మేధావులుగా తీర్చిదిద్దింది. అలాంటి వర్సిటీలో మార్చి పదమూడున రిజిస్ట్రార్ పేరు మీద ఒక విచిత్రమైన సర్క్యులర్ జారీ అయింది. వర్సిటీలో ధర్నాలు, రాస్తారోకోలు చేయకూడదని, నినాదాలివ్వకూడదని ఆ సర్క్యులర్ సారాంశం. ఇది యూనివర్సిటీలో భావప్రకటన స్వేచ్ఛకు గొడ్డలిపెట్టు. 'ప్రజాపాలన' అంటే ఉద్యమాలకు పుట్టినిల్లయిన ఉస్మానియా గొంతు నొక్కడమా? వర్సిటీ అంటనే భిన్నభిప్రాయలను పంచుకునే కేంద్రం. ఇక్కడ జరిగే ప్రతి చర్య, లేదా కార్యక్రమం, విద్యతో సహా అందరిలో ఆలోచన శక్తిని పెంచేదే. అలాంటప్పుడు ఇలాంటి సర్క్యులర్‌ను అమలు చేయడం సరైందేనా? ఇప్పటికే ఈ సర్క్యులర్‌ని వెనక్కి తీసుకోవాలని పదిరోజులుగా విద్యార్థులు ఉద్యమిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొట్టమొదటగా వివక్షకు గురైంది యూనివర్సిటీ విద్యనే. గత ప్రభుత్వ పదేళ్ల పాలనలో యూనివర్సిటీల మీద వివక్ష చూపి ఫ్యాకల్టీ రిక్రూట్మెంట్ చేయలేదు, సరిపడా నిధులు కూడా ఇవ్వలేదు. రాష్ట్రంలో 1880కి పైగా ప్రొఫెసర్, అసోసియేటెడ్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. తమది ప్రజాపాలనగా చెప్పుకునే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ



హయాంలో కూడా ఉస్మానియా ప్రతిష్టను దెబ్బతీసే ప్రయత్నం జరుగుతున్నది. అదే రీతిలో వర్సిటీ పట్ల వివక్ష కొనసాగుతున్నది.అయితే ఇక్కడ పరిష్కరించాల్సిన అంశాలు అసంఖ్యాకంగా ఉన్నాయి. వాటిని పరిష్కరించడటానికి బదులు వాటిని ఉద్దేశపూర్వకంగానే పెడదారిన పెట్టి ఉన్నత విద్యను రోజు రోజుకు బలహీనపరుస్తున్నది. తెలంగాణలో అన్ని యూనివర్సిటీలో అరకొర వసతులతో నడుస్తున్నప్పటికీ, అవి అందించే విద్యానాణ్యత పెద్ద సవాలుగా మారింది.యూనివర్సిటీల్లో విద్యా ప్రమాణాలను కొనసాగించడానికి నిరంతరం పోరాటం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆ ఉద్యమాల్ని అణిచేసేందుకు సర్క్యులర్ అనే వాదన కూడా జరుగుతున్నది.

వాస్తవానికి ఓయూ ఒక విపత్కర పరిస్థితులను ఎదుర్కొంటున్నది. ఒక క్లాసురూమ్ ఫంక్షన్ జరగడానికి సరిపడా నాలెడ్జ్ రిసోర్సెస్ లేక దాదాపు దశాబ్దం దాటింది. మొత్తం కాంట్రాక్టు ఫాకల్టీతో యూనివర్సిటీ నడుస్తున్నది. క్లాసురూమ్ ఫంక్షన్ ఆగిపోయి చాలా కాలమవుతున్నది. ప్రస్తుతం యూనివర్సిటీకి వస్తున్న విద్యార్థుల్లో మెజార్టీ విద్యార్థులు చక్కటి ఆంగ్లభాష పరిజ్ఞానంతో వస్తున్నారు. గతంతో పోలిస్తే ప్రస్తుత విద్యార్థులు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంలో ముందున్నారు. వారు అసంతృప్తితో తరగతి మొఖం చూడటానికి ఇష్టపడటం లేదు.కరోనా కాలంలో కోల్పోయిన రెండేళ్ల కాలాన్ని రీసెర్చ్ చేసుకోవడానికి అన్ని యూనివర్సిటీలు రెండేళ్ల సమయాన్ని ఇచ్చినప్పటికీ, ఓయూ మాత్రం ఇవ్వడం లేదు. పీహెచ్‌డీ పరిశోధనలకు డెడ్‌లైన్ పేరుతో అధికారులు ఆటంకపరుస్తున్నారు. సబ్మిషన్ చేసుకోవడానికి కూడా అవకాశం కల్పించటం లేదు. ఇది యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నిబంధనలకు పూర్తి విరుద్ధం. యూనివర్సిటీ విద్య అనేది విద్యార్థి భవిష్యత్తులో విలువైన ఘట్టం. వారు ఎంచుకున్న రంగంలో అధునాతన జ్ఞానం, నైపుణ్యాలను అందిపుచ్చుకోవడానికి, అలాగే ఏదైనా వృత్తిలో విజయం సాధించడానికి అవసరమైన విమర్శనాత్మక ఆలోచన, జ్ఞానాన్ని సామాజిక నైపుణ్యాలను పెంపొందించుకోవడంలో విశ్వవిద్యాలయ విద్య సహాయపడుతుంది.

యూనివర్సిటీ వ్యవహారాల్లో రాజకీయ జోక్యం మితిమీరింది. ఇది చాలా సమస్యాత్మకమైనది. ఎందుకంటే ఇది ఉన్నత విద్య స్వయం ప్రతిపత్తిని, విద్యా సమగ్రతను పారదర్శకత లేకుండా చేస్తున్నది. వివిధ సమీకరణల పేరుతో అర్హతలేని వ్యక్తులను వీసీలుగా నియ మిస్తున్నది. వారి చేత యూనివర్సిటీల్లో వివిధ అకాడమిక్ స్థానాల్లో నియమించబడిన వారు సైతం విద్యార్థి వ్యతిరేకవిధానాలను అమలు పరుస్తున్నారు. దీనివల్ల యూనివర్సిటీ విద్య ప్రమాణాలు దారుణంగా దిగజారడమే కాకుండా యూనివర్సిటీలు స్వయం ప్రతిపత్తి కోల్పోతున్నాయి.ఈ సంక్షోభం అధిగమించలేనిది కాదు. విశ్వవిద్యాలయాలు తాత్విక సంప్రదాయాన్ని నూతన ఆవిష్కరణలతో సమతుల్యం చేసుకోవాలి. యూనివర్సిటీ అభివృధిలో విద్యార్థులను భాగస్వామ్యం చేసుకోవాలి. వైస్ ఛాన్సలర్ విద్యార్థులకు అందుబాటులో ఉండాలి. వ్యవస్థ రగిలిస్తున్న ఉద్యమాలపై విద్యార్థులు స్పందించి ఉద్యమిస్తున్నప్పుడు వారి ఆవేదనను అర్థం చేసుకోవాలి. ఓయూ అనేది ఒక నిరంతర సంఘర్షణ కేంద్రం. ఇది సామాజిక, అస్తిత్వ, రాజకీపరమైన చర్చలకు నెలవు. కాలానుగుణంగా వస్తున్న మార్పులతో ఇక్కడి విద్యార్థి సంఘాల మధ్య ఉద్యమించే స్వభావాలు మారాయి కావచ్చు. కానీ అణచివేత, అన్యాయాల పట్ల ఒకే పద్ధతిలో ఉద్యమిస్తున్నాయి. కనుక భావప్రకటన స్వేచ్ఛకు విరుద్ధమైన సర్క్యులర్‌ని వెంటనే వెనక్కి తీసుకోవాలి.

- సునీల్ నీరడి, 9493021021

సుంకాల యుద్ధం - బలహీన పడుతున్న అమెరికా ఆధిపత్యం



సాత్యకి రాయ్

ప్రపంచం మీద పెత్తనం చెలాయిస్తున్న శక్తులు తమ ప్రచార దిశను మార్చుకున్నట్టుంది. నిన్నటిదాకా అంతర్జాతీయ వాణిజ్యం మీద ఏ దేశమూ ఎటువంటి ఆంక్షలూ విధించకూడదని, ఆంక్షలు లేని వాణిజ్యం భాగస్వా ములందరికీ ప్రయోజనకరంగా ఉంటుందని చెప్పారు. ఇప్పుడు తమ తమ దేశాల ప్రయోజనాలను రక్షించు కోవడమే ప్రధానంగా మారినట్టు కనిపిస్తోంది. దానితోబాటు పాతకాలపు వలసాధిపత్య భావాలను కూడా మళ్లీ ప్రకటిస్తున్నారు. ఈ ప్రపంచాన్ని శాసించే హక్కు తమకే ఉందన్నట్టు ప్రవర్తిస్తున్నారు. అమెరికా వివిధ దేశాలతో జరిపే వాణిజ్యంలో ఆ దేశాల నుండి దిగుమతి చేసుకునే సరుకులే ఎక్కువ. అమెరికా నుండి ఆ దేశాలకు జరిగే ఎగుమతులు తక్కువ. ఇప్పుడు ట్రంప్ అటువంటి దేశాల నుండి వచ్చే దిగుమతులపూ అధిక సుంకాలను విధిస్తున్నాడు. ఈ చర్యల్లో ఆర్థిక హేతుబద్ధత కన్నా ప్రజలను ఆకట్టుకోవడమే ప్రధానంగా కనిపిస్తోంది. గతంలో అమెరికా చాలా ఉదారంగా ఇతర దేశాల ఎడల వ్యవహరించినట్టు, దానివలన ఆ దేశాలన్నీ ప్రయోజనాలు పొందినట్టు, ఇప్పుడు అమెరికా తన స్వంత దేశపు పరిశ్రమల రక్షణకు, తన స్వంత కార్మికుల ప్రయోజనాలకు అధిక ప్రాధాన్యతను ఇవ్వడానికి సుంకాల పెంపు తప్పదన్నట్టు ఈ నాటకం నడుస్తోంది.

పెట్టుబడి ఎప్పుడూ రంగులు మారుస్తూనే వుంటుంది. నయా ఉదారవాద శకం ప్రపంచం మీద తన విధానాలను రుద్దడానికి ఐఎంఎఫ్, ప్రపంచబ్యాంక్ వంటి సంస్థలను సాధనాలుగా వాడుకోవడంతో ఆవిష్కరించ బడింది. ప్రపంచంలో ఎక్కడెక్కడ చౌకగా కార్మికుల శ్రమను కొల్లగొట్టవచ్చో, అక్కడికల్లా ప్రపంచ పెట్టుబడి తరలిపోయింది. ఎక్కడ సహజ వనరులు చౌకగా దొరుకుతాయో అక్కడ వాటిని చేజిక్కించుకుంది. ఒకదాని వెంట మరొకటిగా దేశాలు ఈ నయా ఉదారవాద పెత్తనానికి లొంగిపోయాయి. పోటీ ప్రపంచం అనే పేరుతో తమ తమ దేశాల ఆర్థిక వ్యవస్థల మీద తమకున్న నియంత్రణను విడిచిపెట్టి, తమ పాలనా విధానాలను తామే రూపొందిం చుకునే హక్కును సైతం గాలికొదిలేశాయి. దిగుమతుల మీద ఆంక్షలు ఎప్పుడైతే సడలించడం జరిగిందో అప్పుడు ఆ యా దేశాల్లోకి పెద్దపెట్టున సరుకులు వచ్చి పడడం మొదలైంది. దాని వలన దేశీయ పరిశ్రమలు దెబ్బతిన్నాయి. ఈ విధానాలకు లోబడి వ్యవహరించడానికి నిరాకరించిన చైనా వ్యూహాత్మకంగా తన స్వంత శక్తి సామర్థ్యాలను పెంచు కోవడం మీద కేంద్రీకరించింది. ప్రపంచ మార్కెట్‌లో పోటీ పడగల సామర్థ్యాన్ని పెంచుకుంది.


ప్రస్తుతం ఇండియా నుండి అమెరికాకు ఎగుమతి అయే వ్యవసాయోత్పత్తుల మీద అక్కడ 5.3 శాతం సుంకం పడుతోంది. అదే అమెరికా నుండి ఇండియాకు వచ్చే వ్యవసాయోత్పత్తుల మీద 37.7 శాతం సుంకం విధిస్తున్నాం. ఇప్పుడు గనుక అమెరికా కోరిన విధంగా అక్కడి నుండి వచ్చే దిగుమతుల మీద సుంకాన్ని 5.3 శాతానికి తగ్గిస్తే అది మన భారతీయ రైతుల పాలిట వినాశకరంగా మారుతుంది. అమెరికా తన వ్యవసాయ రంగానికి భారీగా సబ్సిడీలు ఇస్తోంది. అక్కడి అగ్రో-ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలోని గుత్తాధిపతులు ఆ సబ్సి డీలను ఉపయోగించుకుని భారతీయ మార్కెట్లను తేలికగా ఆక్రమిస్తారు. దాని ఫలితంగా ఇక్కడ ఉన్న చిన్న చిన్న రైతులు, చిన్న ఉత్పత్తిదారులు చితికిపోతారు.

చాలామంది ఆర్థిక వ్యాఖ్యాతలు చైనా బలమైన ఆర్థిక శక్తిగా ఎదిగిందన్న వాస్తవాన్ని గుర్తిస్తున్నారు కాని అలా ఎదగడానికి కారణం చైనా నయా ఉదారవాద విధానాల చట్రంలో ఇమిడేందుకు తిరస్కరించి తన స్వంత విధా నాలను అమలు చేయడమేనన్న వాస్తవాన్ని మాత్రం గుర్తించరు. ప్రస్తుతం జి-7దేశాలు నమోదు చేస్తున్న ఆర్థిక వృద్ధిరేటు కన్నా ఎక్కువ వృద్ధిరేటుతో ఉన్న దేశాలు బ్రిక్స్ కూటమిలో భాగస్వాములుగా ఉన్నాయి. అమెరికా అగ్ర స్థానం క్రమంగా చేజారుతోంది. అందుకే దిక్కు తోచని స్థితిలో పడి గతంలో తాను ప్రవేశపెట్టిన స్వేచ్ఛా వాణిజ్య సూ త్రాలను ఇప్పుడు తానే ఉల్లంఘిస్తోంది. అంతర్జాతీయ పెట్టుబడి ప్రయోజనాల గురించి మాట్లాడుతూ వచ్చిన అమెరికా ఇప్పుడు 'జాతీయ ప్రయోజనాల' గురించి మాట్లాడుతోంది. ఎంత గొప్పగా జాతీయ ప్రయోజనాల గురించి మాట్లాడినా, అదనంగా విధించిన సుంకాల వలన అమెరికాకు దిగుమతి అయే సరుకుల ధరలు పెరుగుతాయి. దాని వలన అమెరికన్ పౌరులు ఎక్కువ సొమ్ము వెచ్చించాల్సి వస్తుంది. ఇంకో పక్క ఈ కొత్త సుంకాలపై అంతర్జాతీయ పెట్టుబడి ఏ విధంగా ప్రతిస్పందిస్తుందో, ఆయా దేశాలు అమెరికాతో తమ వాణిజ్య సంబంధాలను ఏ విధంగా మార్చుకుంటారో చూడాలి. దీని పర్యవసానాలను అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఏ విధంగా స్వీకరిస్తుందో అదీ చూడాలి. వాణిజ్య సంబంధాల్లో పెరుగుతున్న అనిశ్చిత పరిస్థితులు ప్రపంచవ్యాప్తంగా విస్తరించిన ఉత్పత్తి, సరఫరా చెయిన్లను ఏ విధంగా దెబ్బతీస్తాయో అది కూడా పరిశీలించాలి. ప్రస్తుతం అమెరికా, భారత్‌ల మధ్య జరుగుతున్న వాణిజ్యచర్చలు రానున్నకాలంలో ఇరు దేశాల వాణిజ్య సంబంధాలపై ఏవిధమైన ప్రభావాన్ని చూపుతాయో చూడాలి.

ప్రతీకార సుంకాలు

భారతదేశానికి, అమెరికాకు నడుమ 125 బిలియన్ల డాలర్ల (12,500 కోట్ల డాలర్లు లేదా రూ. 10, 79,500 కోట్లు) వాణిజ్యం సాగుతోంది. అమెరికాకు భారతదేశం ఎగుమతి చేసే సరుకులపై విధించే సగటు సుం కం ఇప్పుడు 2.8 శాతం ఉంది. అదే అమెరికా భారతదేశానికి ఎగుమతి చేసే సరుకుల మీద సగటు సుంకం 7.7 శాతం ఉంది. ఇప్పుడు అమెరికా కూడా భారతదేశం నుండి ఎగుమతి అయే సరుకుల మీద 7.7 శాతానికి సుంకాన్ని పెంచనుంది. దీని వలన వివిధ రంగాల్లో వివిధ రకాలుగా ప్రభావం పడుతుంది. ట్రంప్ కోరుతున్నట్టు అమెరికా నుండి మనకు దిగుమతి చేసుకునే సరుకులపై మనం సుంకాన్ని గనుక తగ్గిస్తే అప్పుడు అక్కడి నుండి ఎక్కువగా దిగుమతి అయే వ్యవసాయ ఉత్పత్తులు భారతీయ మార్కెట్‌లో చౌకగా లభిస్తాయి. మన స్వదేశీ వ్యవసాయ ఉత్పత్తులకు రేట్లు ఇంకా తగ్గిపోతాయి. అదే మనదేశం నుండి ఎగుమతి అయే సరుకులపై అమెరికా ఎక్కువ సుంకాన్ని విధిస్తే ఇక్కడి నుండి మనం పంపే ఆటో విడిభాగాలు, మాంసం తదితర ప్రాసెస్డ్ ఆహార ఉత్పత్తులు, వజ్రాలు, బం గారు ఆభరణాలు, రసాయనాలు, ఔషధాలు వంటివి మరింత ఖరీదౌతాయి. అప్పుడు వాటికి అమెరికాలో డిమాండ్ తగ్గుతుంది. ఒక తాజా అధ్యయనం ప్రకారం మన దేశం నుండి ఎగుమతి చేసే ప్రాసెస్డ్ ఫుడ్ మీద సుంకం 32.37 శాతం పెరుగుతుంది. అదే విధంగా ఆటో విడిభాగాల మీద 23.10 శాతం, వజ్రాలు, ఆభరణాల మీద 13.32 శాతం, రసాయనాలు, ఔషధాల మీద 8.63 శాతం పెరుగుతుంది. ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ వస్తువుల మీద, లెదర్, పేపర్, గ్లాస్, ప్లాస్టిక్ వస్తువుల మీద, జౌళి, దుస్తుల మీద, యంత్రాల మీద, కంప్యూటర్ తయారీలో ఉపయోగించే ఖనిజాల మీద, వివిధ రకాల లోహాల మీద సుంకాలు పెరుగుతాయి.

సుంకాలు పెరిగితే మనం ఎగుమతి చేసే సరుకుల ధరలు పెరుగుతాయి. దాని ఫలితంగా మన ఎగు మతులు తగ్గవచ్చు. మరోపక్క అమెరికా తాను భారతదేశానికి ఎగుమతి చేసే వ్యవసాయోత్పత్తుల మీద విధిస్తున్న సుంకాన్ని తగ్గించాలని పట్టుబడుతోంది. ప్రస్తుతం ఇండియా నుండి అమెరికాకు ఎగుమతి అయే వ్యవసాయోత్పత్తుల మీద అక్కడ 5.3 శాతం సుంకం పడుతోంది. అదే అమెరికా నుండి ఇండియాకు వచ్చే వ్యవసాయోత్పత్తుల మీద 37.7 శాతం సుంకం విధిస్తున్నాం. ఇప్పుడు గనుక అమెరికా కోరిన విధంగా అక్కడి నుండి వచ్చే దిగుమతుల మీద సుంకాన్ని 5.3 శాతానికి తగ్గిస్తే అది మన భారతీయ రైతుల పాలిట వినాశకరంగా మారుతుంది. అమెరికా తన వ్యవసాయ రంగానికి భారీగా సబ్సిడీలు ఇస్తోంది. అక్కడి అగ్రో-ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలోని గుత్తాధిపతులు ఆ సబ్సి డీలను ఉపయోగించుకుని భారతీయ మార్కెట్లను తేలికగా ఆక్రమిస్తారు. దాని ఫలితంగా ఇక్కడ ఉన్న చిన్న చిన్న రైతులు, చిన్న ఉత్పత్తిదారులు చితికిపోతారు. ఇప్పటికే వినిమయ సరుకుల ఉత్పత్తి రంగంలో దిగుమతుల దాడి ఫలి తంగా దేశీయ పరిశ్రమలు దారుణంగా దెబ్బ తినిపోయాయి. ఇకపైన రైతుల పరిస్థితీ అలాగే అవుతుంది. ఏ దేశానికి ఆ దేశం తన జాతీయ



అవసరాల రీత్యా, ప్రత్యేకతల రీత్యా సుంకాలను విధిస్తుంది. దానికి భిన్నంగా అగ్రరాజ్యం ప్రయోజనాల కోసం సుంకాల విధానాన్ని మార్చితే దాని ప్రతికూల ప్రభావం దేశంలోని ప్రజల మీద తీవ్రంగా పడుతుంది.

అమెరికాలో సంక్షోభం

ప్రతీకార చర్యలుగా సుంకాలను విధించడం, అనుమతులు లేని కార్మికులను వెనక్కి పంపివేయడం, కెనడా, గ్రీన్‌లాండ్, పనామా, గాజా భూభాగాలను స్వాధీనం చేసుకుంటామని ప్రకటించడం, పరిశోధనల మీద ఖర్చులకు కోత పెట్టడం వంటి ట్రంప్ చర్యలకు మీడియా బాగా ప్రచారం ఇస్తోంది. ఇవన్నీ తాత్కాలిక స్వభావం కలిగిన చర్యలే. వీటి వెనుక అమెరికా ఎదుర్కొంటున్న సంక్షోభపు తీవ్రతను కప్పిపుచ్చుతున్నారు. అమెరికా ఆర్థిక వ్యవస్థ నిజానికి తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయివుంది. రాబోయే రెండేళ్లలో దాని ఆర్థిక మందగమనం మరింత ఎక్కువ కానుంది. ఇప్పుడు మూడవ ప్రపంచ దేశాలతో జరుగుతున్న చర్చల పర్యవసానంగా అమెరికా వాణిజ్యం ఎంత మేరకు పుంజు కోగలదో వేచిచూడాలి. కాని ఇప్పుడు అమెరికన్ మార్కెట్‌లో నెలకొన్న మాంద్యం, దేశీయ వనరుల, పెట్టుబడుల వృద్ధి బాగా దెబ్బ తినడం చూస్తే అమెరికన్ పెత్తనానికి చివరి రోజులు దగ్గరపడ్డాయని అనిపిస్తుంది.

ప్రతీకార చర్యలుగా సుంకాలను విధించడం, అనుమతులు లేని కార్మికులను వెనక్కి పంపివేయడం, కెనడా, గ్రీన్‌లాండ్, పనామా, గాజా భూభాగాలను స్వాధీనం చేసుకుంటామని ప్రకటించడం, పరిశోధనల మీద ఖర్చులకు కోత పెట్టడం వంటి ట్రంప్ చర్యలకు మీడియా బాగా ప్రచారం ఇస్తోంది. ఇవన్నీ తాత్కాలిక స్వభావం కలిగిన చర్యలే. వీటి వెనుక అమెరికా ఎదుర్కొంటున్న సంక్షోభపు తీవ్రతను కప్పిపుచ్చుతున్నారు. అమెరికా ఆర్థిక వ్యవస్థ నిజానికి తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయివుంది. రాబోయే రెండేళ్లలో దాని ఆర్థిక మందగమనం మరింత ఎక్కువ కానుంది. ఇప్పుడు మూడవ ప్రపంచ దేశాలతో జరుగుతున్న చర్చల పర్యవసానంగా అమెరికా వాణిజ్యం ఎంత మేరకు పుంజు కోగలదో వేచిచూడాలి. కాని ఇప్పుడు అమెరికన్ మార్కెట్‌లో నెలకొన్న మాంద్యం, దేశీయ వనరుల, పెట్టుబడుల వృద్ధి బాగా దెబ్బ తినడం చూస్తే అమెరికన్ పెత్తనానికి చివరి రోజులు దగ్గరపడ్డాయని అనిపిస్తుంది.

అమెరికాలో కార్మికవర్గం నిజ వేతనాలు బాగా దెబ్బ తినిపోవడం, మరోవైపు కార్పొరేట్లు సూపర్ లాభాలకు పడగలెత్తడం వల్లే డెమోక్రాట్లు ఎన్నికల్లో ఓడిపోయారు. నిజానికి వాళ్ల దగ్గర రిపబ్లికన్లు ప్రతిపాదించిన మితవాద ఎజెండాకు ప్రత్యామ్నాయమైన ఎజెండా అంటూ ఏదీ లేదు. ఈ రెండు పార్టీల నడుమ ఉన్న విధానపరమైన తేడా దాదాపు శూన్యం. నిస్సహాయులమై పోయామని భావిస్తున్న అమెరికన్ పౌరులకు ట్రంప్ ప్రకటించిన రక్షణాత్మక విధానాలు ఒకింత ఆశను కల్పించాయి. ఆ ఆశను నిలబెట్టుకోడానికే ట్రంప్ ఇప్పుడు తాను అమెరికన్ పరిశ్రమలను, అమెరికన్ కార్మికుల ఉద్యోగాలను కాపాడేందుకు పాటు పడుతున్నట్టు నమ్మించడానికి ప్రయత్నిస్తున్నాడు.

రెండవ ప్రపంచ యుద్ధకాలంలో న్యూడీల్ పేరిట కీన్షియన్ విధానాలు అమలైన కాలంలో అమెరికన్ కార్మికులు పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులు, సదుపాయాలు గత యాభైఏండ్ల కాలంలో క్రమంగా కరిగి పోయాయి. గత రెండు దశాబ్దాల కాలంలో కార్మికుల నిజవేతనాలు బాగా పడిపోయాయి. కార్పొరేట్ల లాభాలు బాగా పెరిగాయి. ఇప్పుడు దిగుమతుల మీద అమెరికా విధిస్తున్న అదనపు సుంకాల వలన దేశీయంగా ఉత్పత్తి అయే సరు కులకు డిమాండ్ కొంతమేరకు పెరిగి కొన్ని ఉద్యోగాలు కలగవచ్చు. కాని అదనపు సుంకాల వలన దిగుమతి అయే సరుకుల ధరలు పెరుగుతాయి. దాని భారం మళ్లీ కార్మిక వర్గం మీదనే పడుతుంది. అప్పుడు వారి జీతాలను గనుక పెంచితే అమెరికన్ ఉత్పత్తుల ధరలు పెరిగి వాటి డిమాండ్ తగ్గుతుంది. దాని వలన ఉపాధి అవకాశాలు తగ్గి పోతాయి. ఒకవేళ జీతాలను పెంచకపోతే కార్మికవర్గం సంక్షోభ భారాన్ని నేరుగా మోయవలసి వస్తుంది. ఏది జరిగినా దెబ్బ తినిపోయేది కార్మికవర్గమే.

ఇప్పుడు కార్మికవర్గం ప్రపంచవ్యాప్తంగా ఎక్కడ చూసినా కార్పొరేట్ల దోపిడీకి బలైపోవడమే కనిపిస్తోంది. ఆ కార్పొరేట్ల స్వదేశీయులా, లేక బహుళజాతి సంస్థలా అన్నదానితో నిమిత్తం లేదు. అయితే ప్రభుత్వాలు మాత్రం 'జాతీయ ప్రయోజనాలు' అన్న ముసుగులో ఈ కార్పొరేట్ల దోపిడీని ప్రజలు గమనించకుండా దాచిపెడుతున్నాయి.

(స్వేచ్ఛానుసరణ)

హెచ్‌సీయూ ఇంకెన్నిసార్లు తన భూముల్ని కోల్పోవాలి?



బి.మదన మోహన్ రెడ్డి
9989894308

మనదేశ ప్రభుత్వ రంగంలో నిధులు, నియామకాలు, నిర్వహణతో ఆరోగ్యకరంగా ఉండే ఉన్నత విద్యాసంస్థలు అతి తక్కువగానే ఉన్నాయి. అటువంటి వాటిలో హైదరాబాదు సెంట్రల్ యూనివర్సిటీ ఒకటి. 1974లో ఏర్పాటైన హైదరాబాదు విశ్వవిద్యాలయం అంచలంచెలుగా ఎదిగి నేడు ఐదు వేల పైచిలుకు విద్యార్థులతో దేశంలోని టాప్ టెన్‌లో ఒకటిగా నిలుస్తూ వస్తుంది. అటువంటి విశ్వవిద్యాలయ పరిధి భూములను అభివృద్ధి పేరిట నాలుగు వందల ఎకరాలను వేలం వేయడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధపడింది. ఇది ఉన్నత విద్యావ్యవస్థపైన తీవ్రప్రభావం చూపు తుంది. ప్రతి విశ్వవిద్యాలయానికి ఒక ఐకానిక్ సింబల్ ఉంటుంది. ఉస్మానియాకు ఆర్ట్స్ కాలేజ్ భవనం, ట్రిబుల్ ఐటీ-హైదరాబాదుకి మర్రిచెట్టు ఉన్నట్టు హైదరాబాదు విశ్వవిద్యా లయానికి మసురంరాక్ అనేది ఉంది. ఈ వేలం ద్వారా అది కూడా ప్రమాదంలో పడిం ది.హైదరాబాదు విశ్వవిద్యా లయం స్థాపించి యాభై ఏండ్లు గడిచిన శుభతరుణంలో ఈ భూముల వేలం వేయడమన్నది అసహేతుకం.

ఈ విశ్వవిద్యాలయం మొదటి నుంచి భూమిని కోల్పోవడమే ఉంది. 1974లో 2,324 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో నాటి కేంద్ర ప్రభుత్వం హైదరాబాదు విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసింది. శేరిలింగంపల్లి తహశీల్దార్ ఆఫీసు కోసం 1987వ సంవత్సరంలో ఐదెకరాలు (2009 వరకు ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఒక మండలం), ఆర్టీసీ డిపో కోసం 1990లో పదెకరాలు, స్థానికంగా ఉన్న బోధన, బోధనేతర సిబ్బంది పిల్లల ప్రాథమిక విద్యకై 1994లో నవోదయ పాఠశాలకు ముప్పై ఎకరాలు, రంగారెడ్డి జిల్లా నూతన కలెక్టరేట్ భవన నిర్మాణం కోసం 1990లో 62 ఎకరాలు (అనంతరం హైదరాబాదు ట్రిబుల్ ఐటీ ఏర్పాటు చేశారు-1998), గచ్చిబౌలి స్టేడియం కోసం 2000లో 108 ఎకరాలు, ఐయంజీ భారత కోసం 2004లో 400 ఎకరాలు (ప్రస్తుతం వేలంలో ఉన్నది), ఏపీ, టీఎన్జీవోస్ హౌసింగ్ కోసం 2007లో 134.28 ఎకరాలు (కోవిడ్ కాలంలో ఇంకా అధిక మొత్తంలో ఆక్రమణలకు గురైంది), టాటా ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసర్చ్ కోసం 2009లో 210 ఎకరాలు... ఇలా నిరంతరం విశ్వవిద్యాలయం తన భూమిని వివిధ అవసరాల రీత్యా కోల్పోవడం కొనసాగుతూనే ఉంది.

వేలం భూమి నిజంగా ఎవరిది?

2004లో నూతనంగా ఏర్పడిన ఐఎంజీ భారత అనే క్రీడా సంస్థకు నాటి చంద్రబాబు ప్రభుత్వం 850 ఎకరాల భూమిని రెండు చోట్ల కేటాయించింది. అవి వర్సిటీ పరిధిలో 400 ఎకరాలు, శంషాబాద్‌లో 450 ఎకరాలు. వర్సిటీకు పరిహారంగా సమానమైన భూమిని కేటాయిస్తాము అన్న హామీతో ముందుకెళ్లింది. అనంతరం వచ్చిన వైయస్ఆర్ ప్రభుత్వం ఆ కేటాయింపులను నిలుపుదల చేశారు. సదురు సంస్థ కోర్టుకు వెళ్లడం, ప్రభుత్వం ప్రతివాదనలు వినిపించడం ఇలా ఇరవై ఏండ్ల పాటు ఈ కేసు నడిచి ఇటీవల సుప్రీంకోర్టు ఆ సంస్థకు ఆ 400 ఎకరాలపై ఎటువంటి అధికారం లేదని తీర్పుని వెలువరించింది. వాస్తవానికి ఈ భూమి కోర్టు వివాదంలో ఉండడంతో వర్సిటీ నుంచి తీసుకొన్న భూమికి ప్రతి భూమిగా ఎక్కడా కేటాయించిన దాఖాలాలు లేవు. వాటిపై వర్సిటీకి కూడా నైతిక హక్కు ఉంది. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ వల్ల పెరిగిన ధరల రీత్యా



ప్రభుత్వం వాటిని కార్పొరేట్ కంపెనీలకు వేలం వేయడానికి చూస్తున్నారు. ఈ చర్యను నిరసిస్తూ విద్యార్థులు ధర్నాలు చేసినా ప్రభుత్వం నుంచి ఏ విధమైన ప్రకటన చేయకపోవడం శోచనీయం. హైదరాబాద్ మహానగరంలో సహజసిద్ధ అడవులుగా మిగిలింది కేవలం కేబీఆర్ పార్క్, హైదరాబాదు విశ్వవిద్యాలయం మాత్రమే. నగరవాసులకు ఈ రెండు ఊపిరితిత్తుల మాదిరి ఆక్సిజన్ అందిస్తున్నాయి. వర్సిటీలో లేడ్లు, నెమళ్లు, కుందేళ్లు, దుప్పులు, అడవి పందులు, వివిధ పక్షులు, కీటకాలు, చెరువులు ఒక బయోలైఫ్ ఉంది. ఇవేకాకుండా పురాతన ఆనవాలైన రాకాసి శిలలు, ఏకశిలలు ఉన్నాయి. ప్రయివేటు పరంగా చేస్తే ఈ ఆనవాళ్లు, జీవజాతుల మనుగడకు ప్రమాదంగా మారుతుంది.

స్వర్ణోత్సవ వేళలో వేలమా?

అన్నం పెట్టి, అక్షరం దిద్దించిన బడిని ప్రతిఒక్కరూ మానసిక మాతృత్వశాలగానే భావిస్తారు. జీవికకు నోచుకోని ఎందరో పేద పిల్లలను ఉన్నత స్థానాలలో నిలబెట్టగలిగేది హెచ్‌సీయూలాంటి విశ్వవిద్యాలయాలే. అటువంటి సంస్థల నుంచి ఎదిగినవాళ్లను తిరిగి తనవైపు చూసేలాగా మనసులో మెదులుతూనే ఉంటుంది. మధ్యతరగతి నుంచొచ్చిన తనను మేధావిగా మార్చి నందుకు కృతజ్ఞతగా డాక్టర్ కృష్ణా చివుకుల అనే పూర్వ విద్యార్థి ఐఐటీ మద్రాసుకు రూ.228 కోట్ల విరాళాన్ని అందించారు. నేటి తెలంగాణ ప్రభుత్వంలో ఉపముఖ్య మంత్రిగా ఉన్న భట్టి విక్రమార్క, ఐటీ శాఖామంత్రిగా వ్యవహరిస్తున్న దుద్దిల్ల శ్రీధర్ బాబు ఇద్దరూ హెచ్‌సీయూ పూర్వ విద్యార్థులే. రేవంత్ రెడ్డి క్యాబినెట్ లో ఉండి కూడా ఈ నాలుగు వందల ఎకరాల వర్సిటీ భూమిని వేలం వేయడాన్ని ఆపలేకపోవడం అసమర్థతగానే చూడాల్సి ఉంటుంది. తొంభై శాతం ఆర్థిక సామాజిక అసమానత కుటుంబాల పిల్లలే ఈ విశ్వవిద్యాల యంలో చదువుతున్నారు. భవిష్య త్తులో మరిన్ని శాఖలుగా ఏర్పాటు చేసుకోవాలన్నా, ప్రపంచస్థాయి సంస్థలతో పోటీపడే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నా ఆహ్లాదకరమైన క్యాంపస్ ఉండాలి. వర్సిటీ స్థాపించి యాభై ఏండ్లు పూర్తి చేసుకుంటున్న తరుణంలో ఈ వేలం వేయడం అత్యంత బాధాకరం. దీన్ని వెంటనే ఆపి నాడు వర్సిటీ నుంచి తీసుకున్న భూమి తిరిగి అప్పజెప్పేలా చర్యలు తీసుకోవడం దేశభవిష్యత్తుకు ప్రయోజనం. అదే విధంగా ప్రకృతిరీత్యా కూడా ఆరోగ్యకరం. ఈ దిశగా తెలంగాణ ప్రభుత్వం పునరాలోచించాలి. అందుకు మంత్రులు భట్టి విక్రమార్క, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పూనుకోవాలి. జ్ఞానం పంచిన విశ్వవిద్యాలయం భవిష్యత్తు తరాలకు అంతర్జాతీయంగా పెంపొందించే విధంగా పాటుపడాలి అంతేకానీ, చదువులమ్మ చెట్టు కొమ్మలని నరుకుతుంటే గుడ్లప్పగించి చూస్తూ.. గొడ్డలి నప్పగించి మిన్నకుండిపోతే హెచ్‌సీయూ భవిష్యత్తులో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని క్షమించదన్న విషయాన్ని గమనంలో పెట్టుకోవాలి.

తొంభై శాతం ఆర్థిక సామాజిక అసమానత కుటుంబాల పిల్లలే ఈ విశ్వవిద్యాలయంలో చదువుతున్నారు. భవిష్యత్తులో మరిన్ని శాఖలుగా ఏర్పాటు చేసుకోవాలన్నా, ప్రపంచస్థాయి సంస్థలతో పోటీపడే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నా, ఆహ్లాదకరమైన క్యాంపస్ ఉండాలి. వర్సిటీ స్థాపించి యాభై ఏండ్లు పూర్తి చేసుకుంటున్న తరుణంలో ఈ వేలం వేయడం అత్యంత బాధాకరం. దీన్ని వెంటనే ఆపి నాడు వర్సిటీ నుంచి తీసుకున్న భూమి తిరిగి అప్పజెప్పేలా చర్యలు తీసుకోవడం దేశభవిష్యత్తుకు ప్రయోజనం. అదే విధంగా ప్రకృతిరీత్యా కూడా ఆరోగ్యకరం. ఈ దిశగా తెలంగాణ ప్రభుత్వం పునరాలోచించాలి. అందుకు మంత్రులు భట్టి విక్రమార్క, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పూనుకోవాలి.

26న మహిళలకు జాబ్ మేళా నిర్వహణ

జిల్లా ఉపాధి అధికారి ఎన్.మాధవి

నవతెలంగాణ- ఖమ్మం

జిల్లాలోని నిరుద్యోగ మహిళలకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించుటకు ఈనెల 26న బుధవారం ఉదయం 10 గంటలకు తనికెళ్ల తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల డిగ్రీ కళాశాల (కేరాఫ్ లక్ష్య ఇంజనీరింగ్ కళాశాల, ఖమ్మం)లో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎన్ మాధవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్, విజయవాడలో పని చేసే విధంగా ఫాక్స్ కాన్, సెన్సా కోర్, ఆల్ఫా, భారత్ బయో టెక్, శిందర్, లైఫ్ సర్కిల్ హెల్త్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, ఎలాన్సర్ ఐటీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, జస్ట్ ఇన్ ఫౌండేషన్, సీతారం స్పిన్నర్స్ ప్రైవేటు లిమిటెడ్, జీఎంఆర్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్, ఎంపవర్మెంట్ సర్వీసెస్, క్రీం స్టోన్ కంపెనీలలో పని చేయుటకు 18-30 సంవత్సరాల వయస్సు గల డిగ్రీ పాసైన మహిళలు అర్హులని, ఎంపికైన వారికి వేతనం 12 వేల నుండి 18 వేల వరకు ఉంటుందని అన్నారు. మొత్తం దాదాపు 1370 ఉద్యోగ ఖాళీల భర్తీకి గాను జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు, తమ విద్యార్హతల సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో మహిళలు జాబ్ మేళాకు హాజరు కావాలని పేర్కొన్నారు.

మున్నేరులో పడి యువకుడు మృతి

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

రాజీవ్ గృహకల్ప ప్రాంతంలోని మున్నేరులో పడి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...ఖమ్మం నగరంలోని లెనిన్‌నగర్‌కు చెందిన సయ్యద్ మౌలానా (19) ఏసీ మెకానిక్‌గా పనిచేస్తుంటాడు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని రాజీవ్ గృహకల్ప ప్రాంతంలో వికలాంగుల కాలనీకి చెందిన వంశీ అనే స్నేహితుడి ఇంటికి మౌలానా సోమవారం వచ్చాడు. ఇద్దరు కలిసి ఈత కొట్టేందుకు పక్కనే ఉన్న మున్నేరులోకి వెళ్ళారు. ఈత కొట్టుకుంటూ మౌలానా (19) ప్రమాదవశాత్తు నీటిలో మునిగి గల్లంతయ్యాడు. విషయాన్ని వంశీ పోలీసులకు సమాచారం అందించగా ఇన్స్పెక్టర్ రాజు సంఘటనా స్థలానికి చేరుకుని గజ ఈతగాళ్లతో మున్నేరులో గాలించగా మౌలానా మృతదేహన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం అన్నం శ్రీనివాస్ బృందం ఖమ్మం ప్రభుత్వఆసుపత్రికి తరలించారు. మౌలానా కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోను ఢీకొన్న ట్రాక్టర్...మహిళకు తీవ్ర గాయాలు

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

మహిళా కూలీలు వెళ్తున్న ఆటోను ట్రాక్టర్ ఢీకొని ఓ మహిళకు తీవ్ర గాయాలైన సంఘటన మండల పరిధిలోని ఆరెకోడు వద్ద సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని ముత్తగూడెం గ్రామానికి చెందిన మహిళా వ్యవసాయ కూలీలు ఆటోలో చింతపల్లి వెళ్లి వస్తుండగా మార్గమధ్యలో ఆరెకోడు వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొంది. దీంతో ఓ మహిళకు తీవ్ర గాయాలు కాగా, మరో మహిళకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాద సమయంలో ఆటోలో 14 మంది మహిళలు ఉన్నారు. తీవ్రంగా గాయపడ్డ మహిళను చికిత్స నిమిత్తం ఖమ్మంలోని ఓ ఆసుపత్రికి తీసుకెళ్లారు.పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కాకర్లపల్లి మాజీ సర్పంచ్ సక్కూబాయికి మట్టా నివాళి

నవతెలంగాణ-సత్తుపల్లి

సత్తుపల్లి మండలం కాకర్లపల్లి మాజీ సర్పంచ్ చల్లారి సక్కూబాయి దశదిన కార్యక్రమాలు వారి గృహంలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టరు మట్టా దయానంద్ విజయకుమార్ పాల్గొని సక్కూబాయి చిత్రపటానికి పూలుజల్లి నివాళలర్పించారు. మృతురాలి భర్త సత్తుపల్లి మాజీ ఎంపీపీ చల్లారి వెంకటేశ్వర రావును, కుటుంబ సభ్యులను పరామర్శిస్తూ సానుభూతిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సత్తుపల్లి, కల్లూరు ఏఎంసీ ఛైర్మెన్లు దోమ ఆనంద్‌బాబు, బాగం నీరజాదేవి, బాగం ప్రభాకర్, అజ్మీరా ప్రసాద్ పాల్గొన్నారు.

ఫోక్సో కేసులో ఐదుగురు రిమాండ్

నవతెలంగాణ-ఎర్రుపాలెం

ఫోక్సో కేసులో ఐదుగురిపై రిమాండ్ విధించినట్లు ఎర్రుపాలెం ఎస్సై వెంకటేష్ ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని భీమవరం గ్రామంలో ఓ మైనర్ బాలికను అత్యాచారం చేసి గర్భం దాల్చేందుకు కారణమైన ముల్లంగి జమలయ్య, అతడికి సహకరించిన ముసలయ్య, గర్భం తీసేందుకు ప్రయత్నించిన మహిళ మరియమ్మ, ఆర్ఎంపీ డాక్టర్ నరేందర్, విజయవాడకు చెందిన నర్సు భవాని అనే ఐదుగురిపై ఫోక్సో కేసు నమోదు చేశారు. ఎర్రుపాలెం పోలీసులు వీరిని రిమాండ్‌కు తరలించనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఐకేపీ గోడౌన్ నిర్మాణ స్థలాన్ని పరిశీలించిన అధికారులు

నవతెలంగాణ - బోనకల్

చొప్పకట్లపాలెం గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో నిర్వహించనున్న గోడౌన్ స్థలాన్ని మండల తహశీల్దార్ అనిశెట్టి పున్నం చందర్, ఐకెపి ఏపీఎం కట్ట సురేందర్ బాబు సోమవారం పరిశీలించారు. చొప్పకట్లపాలెంలో సర్వేనెంబర్ 220లో 12 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అయితే ఈ భూమి మధ్య కొండ రహదారి నిర్మాణం జరుగుతుంది. అయితే ఐకెపి ఎపిఎం సిబ్బంది గోడౌన్‌కు కేటాయించిన స్థలం మధ్య నుంచి బీటీ రోడ్డు వెళుతుందని, దీనివలన ఈ స్థలం ఉపయోగకరంగా ఉండదని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మండల తహసిల్దార్ ఆ స్థలాన్ని పరిశీలించారు. బీటీ రోడ్డును స్థలం మధ్యగుండా కాకుండా ఒక పక్క నుంచి వేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో గిర్దావర్ వన్ మఠం నవీన్‌కుమార్, చొప్పకట్లపాలెం మాజీ సర్పంచ్ ఎర్రంశెట్టి సుబ్బారావు, స్నేహ మండల సమాఖ్య సభ్యులు, వివో ఏఎస్‌లు తదితరులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

నవతెలంగాణ-ముదిగొండ

పెద్దమండవ, గంధసిరి మున్నేరుల నుండి ఇసుక కూపన్స్ లేకుండా అక్రమంగా రవాణా చేస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను వనంవారికిష్టాపురం వద్ద తహశీల్దార్ కొక్కుల సునీత ఎలిజబెత్ సోమవారం పట్టుకొని సీజ్ చేసి పోలీస్ స్టేషన్కు తరలించారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఆమె వెంట ఆర్ఐ పి.ప్రసన్నకుమార్ ఉన్నారు.

తండ్రికి తల కొరివి పెట్టిన కూతురు

నవతెలంగాణ-ఎర్రుపాలెం

మండలం పరిధిలోని బనిగండ్లపాడు గ్రామంలో తండ్రికి తలకు పెట్టింది ఓ కుమార్తె. వివరాల్లోకి వెళితే బనిగండ్లపాడు గ్రామానికి చెందిన శీలం సంజీవరెడ్డి గత కొంతకాలంగా అనారోగ్యంగా ఉంటూ ఆదివారం మృతి చెందాడు. సంజీవరెడ్డికి భార్య వెంకటరావమ్మ, ఒక్కగానొక్క కుమార్తె హారిక ఉన్నారు. సంజీవరెడ్డికి తన కూతురుకి దహన సంస్కారాలు నిర్వహించేందుకు ముందుకు వచ్చింది. హారిక ఇటీవల ఇంటర్ సెకండ్ ఇయర్ పూర్తి చేసింది.

వేటగాళ్ల ఉచ్చుకి యువకుడు బలి

నవతెలంగాణ-కారేపల్లి

వన్యప్రాణులను వేటాడేందుకు అమర్చిన విద్యుత్తు తీగలు తాకి యువకుడు మృతి చెందిన ఘటన కారేపల్లి మండలం చీమలపాడులో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. చీమలపాడుకు చెందిన తండ్రి కొడుకులు మేకల కోటయ్య, మేకల కరుణాకర్(18)లు తమ మేకలు తప్పి పోవటంతో వాటి వెతుకుతూ పాటిమీదిగుంపు సమీపంలోని బోడ్డుబండా వాగువైపు వెళ్ళారు. ఆ ప్రాంతంలో కొందరు అడవి జంతువుల వేటకు విద్యుత్ తీగలు అమర్చారు. వీటి గమనించని కరుణాకర్ విద్యుత్ తీగలకు తాకి విద్యుత్‌ఘాతానికి గురైన అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించి తండ్రి కోటయ్య గ్రామస్తులకు విషయం తెల్పటంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. గతంలో కూడా అనేక సార్లు మనుషులు, గేదెలు, ఆవులు విద్యుత్ వేట తీగలకు చిక్కుకొని మృత్యువాత పడ్డారు. దీనిపై విచారణ చేసి దోషులకు కఠినంగా శిక్షించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

చేతన ఫౌండేషన్ ద్వారా టీవీలు పంపిణీ

నవతెలంగాణ-కల్లూరు

చేతన ఫౌండేషన్ ద్వారా కల్లూరు మండలానికి మూడు స్మార్ట్ టీవీలను ఆయా పాఠశాల ఉపాధ్యాయులకు ఖమ్మం అర్బన్ ఎంఈఓ శైలజ చేతుల మీదగా సోమవారం పంపిణీ చేశారు. 14 వేల విలువైన టిసిఎల్ 32 ఇంచులు స్మార్ట్ టీవీలు 50శాతం పాఠశాల నుంచి చెల్లిస్తే పాఠశాలలకు అందజేశారు. కొర్లగూడెం, వెంకటరాంపురం, రావికంపాడు పాఠశాలల ఉపాధ్యాయులు దాతల నుంచి సేకరించిన ఒక్కో టీవీకి 7వేల రూపాయలు చెల్లించారు. కార్యక్రమంలో చేతన్ ఫౌండేషన్ అధ్యక్షులు వెనిగళ్ళ రాము, ఖమ్మం అర్బన్ ఎంఈఓ శైలజ లక్ష్మీ, ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అమర్లపూడి చక్రవర్తి, ఎర్నం అప్పారావు, బి.రాజు, టీఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కొడిశాన విజయ్ కుమార్ పాల్గొన్నారు.

ఇంటి పన్నులు సకాలంలో చెల్లించాలి

మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-ఖమ్మంరూరల్



ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలు సకాలంలో ఇంటి పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి కోరారు. మున్సిపాలిటీ పరిధిలోని వెంకటగిరి, గుదిమళ్ల గ్రామాల్లో సోమవారం కమిషనర్ పర్యటించారు. ఈ సందర్భంగా పారిశుద్యం, ఇంటిపన్నుల వసూళ్ల పనితీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటిలోని అన్ని గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుద్యం, తాగునీటి సరఫరా, ఇతర సమస్యలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. సిబ్బంది ప్రతీ రోజు వారికి కేటాయించిన విధులను తూచా తప్పకుండా పాటిస్తూ పనులు చేయాలని సూచించారు. ఆయా గ్రామాల వార్డు అధికారులు కూడా సమయపాలన పాటిస్తూ వార్డుల్లో నెలకొన్న సమస్యలపై దృష్టి సారించాలన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఇంటి పన్నులు సకాలంలో చెల్లించాలని, ఈ ఆర్థిక సంవత్సరం ఈ నెల 31తో ముగుస్తున్నందున వెంటనే పన్నులువసూలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

నిర్మాణం పూర్తి... ప్రారంభానికి ఆలస్యమెందుకో ?

ప్రభుత్వంపై విమర్శల వెల్లువ

ప్రారంభానికి నోచుకోని వంద పడకల ఆసుపత్రి

- సరైన వైద్యం అందక రోగుల అవస్థలు
- వైద్య రంగానికి ప్రాధాన్యం అంటే ఇదేనా?

నవతెలంగాణ-బోనకల్



ఏ ప్రభుత్వం వచ్చినా తాము విద్య, వైద్య రంగాలకే అధిక ప్రాధాన్యతమిస్తామని చెబుతూ వస్తారు. కానీ ఆచరణలోకి వచ్చేసరికి అదొక కలగానే మిగిలిపోతుంది. ఎన్నో ఏళ్ల నుంచి అదే ఒక. ఆ కల నెరవేరింది. కల నెరవేరినప్పటికీ పాలకులలో చిత్తశుద్ధి కనిపించడం లేదని ప్రజల నుంచి వస్తున్న విమర్శలు. అది కూడా ఓ డిప్యూటీ ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గ కేంద్రంలోని ప్రారంభానికి నోచుకోని వంద పడకల ఆసుపత్రి తీరు ఈ విధంగా ఉంది. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని ఉంది అనే చందంగా నిర్మాణం పూర్తయి ఏడాది కావస్తున్న ప్రారంభానికి మాత్రం నోచుకోకపోవడంతో నియోజకవర్గ ప్రజలు, ప్రధానంగా పట్టణ ప్రజలు ఆరోగ్యపరంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి డిప్యూటీ సీఎం నియోజకవర్గంలో నెలకొని ఉంది.

మధిరలో ప్రస్తుతం ఉన్న ఏరియా వైద్యశాల శిథిలావస్థలో ఉంది. అందున ప్రతి సంవత్సరం సిబ్బంది కొరతతో నరకయాతన పడుతుంది. పూర్తిస్థాయిలో రోగులకు వైద్య సేవలు అందటం లేదు. నియోజకవర్గ కేంద్రానికి ప్రధానంగా ఎర్రుపాలెం, మధిర, బోనకల్ మండలాల నుంచి పెద్ద సంఖ్యలో మధిర ప్రభుత్వ ఆసుపత్రికి వెళుతుంటారు. అదే విధంగా ఆంధ్ర ప్రాంతం నుంచి కూడా ఈ ఏరియా ఆసుపత్రికి వైద్యం కోసం వస్తుంటారు. పైగా ప్రమాదాలలో మృతి చెందిన, గాయపడిన వారిని మధిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తారు. కానీ పూర్తిస్థాయిలో అక్కడ వైద్యం అందక అనేక రకాలుగా రోగులు ఇబ్బందులు పడుతున్నారు. అనేక ఏళ్ల నుంచి మధిరలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణం జరగాలని ఆందోళనలు జరుగుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో మధిర నియోజకవర్గ కేంద్రంలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి ఆనాటి జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు కృషితో బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.34 కోట్ల రూపాయలను మంజూరు చేసింది. ప్రస్తుతం ఏరియా ఆసుపత్రి శిథిలావస్థలో ఉండటం, అక్కడ అనువైన స్థలం లేకపోవడంతో వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన స్థలంలో ఐదు ఎకరాలను ఆనాటి ప్రభుత్వం కేటాయించింది. ఆస్పత్రి నిర్మాణానికి రూ. 34 కోట్ల రూపాయలను వెంటనే విడుదల చేయటమే కాక వెంటనే ఆనాటి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు శంకుస్థాపన కూడా చేశారు. ఆ వెంటనే నిర్మాణ పనులు కూడా ప్రారంభమయ్యాయి. రూ.34 కోట్లలో రూ.23 కోట్లు భవన నిర్మాణానికి కేటాయించారు. ఇందులోనే మరో రూ.11 కోట్లను ఫర్నిచర్, ఇతర వైద్య పరికరాల కొనుగోలుకు కేటాయించారు. సివిల్ పనుల్లో మొత్తం 24 గదులతో నిర్మాణం పూర్తయింది.

ఇందులో ఐదు ఆపరేషన్ థియేటర్లు, ఐసియు కేటాయించగా 40 గదులను డాక్టర్ల కన్సల్టేషన్ కు, మిగిలిన వాటిని రూములకు, ఇతర అవసరాలకు కేటాయించారు. ఆస్పత్రి మిగతా సివిల్ పనులు అన్ని ఏడాది క్రితమే పూర్తికాగా మార్చురీ పనులు మాత్రం పూర్తి కావస్తుండగా, బెడ్లు, ఎక్స్ రే మిషన్, మరికొన్ని పరికరాలు రాగ, కొంత ఫర్నిచర్ కొనుగోలు చేయవలసి ఉంది. మధిరతోపాటు చుట్టుపక్కల దాదాపు 70 గ్రామాల ప్రజలతోపాటు ఆంధ్ర ప్రాంతానికి చెందిన వారు కూడా మధిర ఏరియా ఆసుపత్రికి వైద్యం కోసం వస్తున్నారు. మధిర ఏరియా ఆసుపత్రికి రైల్వే ప్రమాదాలతో పాటు రోడ్డు ప్రమాదాల్లో ఎవరైనా మృతి చెందిన, శవ పరీక్షలకు మధిర ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువస్తుంటారు. ఉన్న అరకొర సౌకర్యాలతోటే ఏరియా ఆసుపత్రి నెట్టుకుంటూ వస్తుంది. ప్రస్తుతం ఉన్న ఏరియా ఆసుపత్రి శిథిలావస్థలో ఉండి స్లాబు పెచ్చులు ఊడి ఎక్స్ రే మిషన్‌పై పడటంతో గత కొన్ని రోజులుగా ఎక్స్ రేలు కూడా తీయడం లేదు. ఎంతో ప్రాధాన్యత కలిగిన ఆపరేషన్ థియేటర్ స్లాబ్ పెచ్చులు కూడా ఊడిపడటంతో ఏడాదికి పైగానే ఆపరేషన్లు కూడా నిలిపివేశారు. అత్యవసర పరిస్థితులలో ఖమ్మం ప్రధాన ఆసుపత్రికి రోగులను తరలిస్తున్నారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన మధిర ఏరియా ఆసుపత్రి సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుకుంటుంది.

ఆస్పత్రిని వేధిస్తున్న సిబ్బంది కొరత

మధిరలో ఉన్న ఏరియా ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా ఆనాటి బీఆర్ఎస్ ప్రభుత్వం అప్ గ్రేడ్ చేస్తూ నిర్ణయం తీసుకున్న వెంటనే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కింద ఉన్న ఆసుపత్రిని రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కిందకు మారుస్తూ ఆనాడే జీవో విడుదల చేసింది. ఈ జీవో విడుదల చేసే సమయంలో డాక్టర్లతో పాటు, టెక్నికల్, నాన్ టెక్నికల్ స్టాఫ్‌తో పాటు మొత్తం 103 పోస్టులను మంజూరు చేసింది. ఆనాటి ప్రభుత్వం పోస్టులను పెంచుతూ జీవో విడుదల చేసింది. కానీ అందుకు అనుగుణంగా నియామకాలను చేపట్టలేదు. మొత్తం 103 పోస్టులకు గాను 34 పోస్టులను మాత్రమే భర్తీ చేసింది. మిగిలిన 69 పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. ఇందులో మొత్తం డాక్టర్ల పోస్టులు 52 కాగా ప్రస్తుతం 9 మంది డాక్టర్లు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. 43 డాక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మొత్తం నర్సింగ్ స్టాఫ్ పోస్టులు 35 ఉండగా ఇందులో కేవలం 17 పోస్టులను మాత్రమే భర్తీ చేశారు. ఇంకా 18 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మొత్తం పారా మెడికల్ పోస్టులు 11 ఉండగా అందులో కేవలం ఐదు పోస్టులను మాత్రమే భర్తీ చేశారు. ఇంకా 6 పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. మొత్తం మినిస్ట్రియల్ స్టాఫ్ 5 ఉండగా 3 పోస్టులను మాత్రమే భర్తీ చేశారు. మిగిలిన రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అదే విధంగా మార్చురీ బిల్డింగ్, వ్యర్థ వైద్య పరికరాల గది, మురికనీటి శుద్ధి కర్మాగారం, ధోబి ఘాట్, జనరేటర్ రూమ్, పార్కింగ్ షెడ్, రోగులు కూర్చునే హాల్, స్టాఫ్ క్వార్టర్స్, డాక్టర్ల క్వార్టర్స్ లేవు. ఈ విధంగా ఏరియా ఆసుపత్రి వివిధ రకాల సమస్యలతో కునారీలుతున్న నేపథ్యంలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తయి ఏడాదికి పైగా అవుతున్న ఎందుకు ప్రారంభించడం లేదో నేటికీ అర్థం కాని ప్రశ్నగానే మిగిలింది. విద్యా, వైద్య రంగాలకు మొదటి ప్రాధాన్యతమిస్తామని ప్రకటిస్తూనే వంద పడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తి అయినప్పటికీ ప్రారంభించకపోవడం పట్ల పాలకులే సమాధానం చెప్పాలి. వంద పడకల ఆసుపత్రి ని ప్రారంభించకపోవడం పట్ల మధిర పట్టణంతోపాటు మధిర ఏరియా ఆసుపత్రిలో వైద్యం కోసం వస్తున్న గ్రామాల ప్రజల నుంచి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా డిప్యూటీ సీఎం వెంటనే కల్పించుకొని ఆసుపత్రికి అవసరమైన అన్ని పనులను త్వరగా పూర్తిచేసి డాక్టర్లను, సిబ్బందిని నియమించి 100 పడగల ఆసుపత్రిని రోగులకు అందుబాటులోకి తీసుకువచ్చి, మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం : డాక్టర్ అనిల్ కుమార్



100 పడకల ఆసుపత్రి నిర్మాణం పనులు పూర్తిచేసి కాంట్రాక్టర్ భవనాన్ని తమకు అప్పగించారు. అయితే కొన్ని పరికరాలు, ఫర్నిచర్ రావాల్సి ఉంది. అదేవిధంగా మంజూరైన సిబ్బందిని కూడా ప్రభుత్వం కేటాయించాల్సి ఉంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దష్టికి తీసుకెళ్లాను. ఉన్నతాధికారుల ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నా. ప్రస్తుత ఏరియా ఆసుపత్రి లో అనేక సమస్యలు ఉన్న మాట వాస్తవమే. ఆసుపత్రి ప్రారంభించిన వెంటనే ఉన్న సిబ్బందితోటే వైద్య సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నాం.

సాగుపై లాభాలు పెంచడమే లక్ష్యంగా పని చేయాలి

- పంటల మార్పిడి విధానం అమలుపై రైతులు దృష్టి సారించాలి
- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

నవతెలంగాణ-వైరా



రైతులకు వ్యవసాయంలో లాభాలు వచ్చేలా వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ విజ్ఞప్తి చేశారు. సోమవారం వైరా కృషి విజ్ఞాన్ కేంద్రంలో నిర్వహించిన మధ్య తెలంగాణ మండల వ్యవసాయ పరిశోధన, విస్తరణ, సలహా సంఘం సమావేశంలో జిల్లా కలెక్టర్ పాల్గొని ప్రసంగించారు. కేవలం వరిపై ఆధారపడటం మంచిది కాదని అన్నారు. ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని, వారికి ప్రత్యామ్నాయ పంటలపై అవసరమైన సహాయ, సహకారాలు, మార్కెటింగ్ అవకాశాలు చూపకపోవడం వల్ల కూడా వరి పంట వైపు మొగ్గుతున్నారని అన్నారు. ఆయిల్ పామ్, కూరగాయలు, డ్రాగన్ ఫ్రూట్ వంటి ఇతర లాభసాటి పంటల సాగు వైపు రైతులు దృష్టి పెట్టాలని కోరారు. యువత వ్యవసాయ రంగంలోకి రావడం లేదని, భవిష్యత్తులో దేశ ఆహార భద్రత మరోసారి ముప్పుకు గురయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ బలరాం, డైరెక్టర్ ఆఫ్ ఎక్స్టెన్షన్ డాక్టర్ ఎం యాదాద్రి, వరంగల్ ఆర్. ఏ.ఆర్.ఎస్. అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ ఆర్.ఉమారెడ్డి, డిడిఏ సింగా రెడ్డి, ఆర్.ఈ.ఏ.సి. మెంబర్ తుమ్మల రాణాప్రతాప్, తహసీల్దార్ కెవి శ్రీనివాసరావు, ఏడీ అగ్రికల్చర్ తుమ్మలపల్లి కరుణశ్రీ, ఏఓ మంజూఖాన్, నీటి పారుదల శాఖ డిఈ, కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ డాక్టర్ కె.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) అఖిల భారత మహాసభలను జయప్రదం చేయండి

- పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎర్రా శ్రీకాంత్

నవతెలంగాణ-ఖమ్మంకార్పొరేషన్



ఏప్రిల్ 2 నుంచి 6 వరకు తమిళనాడు రాష్ట్రం మధురైలో జరిగే సీపీఐ(ఎం) అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్ పిలుపునిచ్చారు. స్థానిక గుమస్తాల సంఘ భవనంలో వజినేపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన పార్టీ త్రీ టౌన్ కమిటీ శాఖ కార్యదర్శుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో యర్రా శ్రీకాంత్ మాట్లాడుతూ పార్టీ మహాసభలు గ్రామ శాఖ నుంచి అఖిలభారత స్థాయి వారికి జరుగుతాయన్నారు. ఈ మహసభల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల మీద, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల మీద, రైతులు ఎదుర్కొంటున్న సమస్యల మీద, దేశ ఆర్థిక వ్యవస్థ మీద, నిరుద్యోగ సమస్య మీద, మహిళల దాడుల పైన సుదీర్ఘంగా చర్చలు జరుపుతారన్నారు. ఈ మహాసభలో దేశవ్యాప్తంగా ప్రజలు ఎదుర్కొంటున్న అనేక తీర్మానాలను ప్రవేశపెడతామని తెలిపారు. ఐదు రోజులు పాటు జరిగే ఈ మహాసభలకు దేశవ్యాప్తంగా 1000 మంది ప్రతినిధులు హాజరవుతున్నారని తెలిపారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు పి.సోమయ్య, ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రం, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు యర్రా శ్రీనివాసరావు, పార్టీ త్రీ టౌన్ కార్యదర్శి భూక్య శ్రీనివాసరావు, డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యురాలు పత్తిపాక నాగ సులోచన, కార్పొరేటర్ యల్లంపల్లి వెంకట్రావు, డివిజన్ కమిటీ సభ్యులు యర్రా రంజిత్, ఎస్ కే హిమం, త్రీ టౌన్ కార్యదర్శి వర్గ సభ్యులు బండారు వీరబాబు, ఎస్‌కే సైదులు, శీలం వీరబాబు, యర్రా మల్లికార్జున్, బజ్జూరి రమణారెడ్డి, ఎస్కే అమీనా, ఎస్‌కె ఖాసిం, రంగు హనుమంత చారి, సారంగి పాపారావు, కొట్టే అలివేలు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే

వెలుగుచూస్తున్న పలు సమస్యలు

నవతెలంగాణ- ఎర్రుపాలెం



సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేలో భాగంగా మండల పరిధిలోని నరసింహాపురం గ్రామ సర్వేకు పార్టీ మండల కార్యదర్శి మద్దాల ప్రభాకరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సింహపురం గ్రామానికి చెందిన బట్టు స్వామి (67) పెరాలసిస్‌తో కాళ్ళుచచ్చు పడిపోయాయని, ఆపన్నహస్తం కోసం ఎదురు చూస్తున్నాడన్నారు,. 2022 నుంచి ఏ ఒక్క నాయకుడూ పట్టించుకోలేదని కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారన్నారు. 2022 నుండి వివిధ శాఖల అధికారుల చుట్టూ తిరిగి తిరిగి విసుగు చెందమన్నారన్నారు. సదరం క్యాంపు సర్టిఫికెట్ కోసం చాలా ఇబ్బందులు పడ్డామని, కష్టపడి తీసుకున్న సర్టిఫికెట్‌కు విలువ లేదా అని బాధితుడు వాపోయారు. సదరం సర్టిఫికెట్ ఉండి కూడా వికలాంగ పింఛన్ పొందడం లేదని బాధితుడు, కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.

వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని మిషన్ భగీరథ పైప్ లైన్ లీకేజీలను మరమ్మత్తులు చేసి స్వచ్ఛమైన తాగు నీటిని ఇచ్చి వ్యాధులు బారి నుండి కాపాడాలని, అవసరం ఉన్నచోట చేతిపంపులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ ఉన్నత అధికారులు జోక్యం చేసుకొని వెంటనే మంచినీటి సమ స్య పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామంలో వీధి దీపాలు వెలగక చీకట్లో వృద్ధులు, పిల్లలు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మార్చి 29న ఎర్రుపాలెం మండల కార్యాలయం ముందు జరిగే నిరసనకు అందరూ హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు సగ్గుర్తి సంజీవరావు, గామాసు జోగయ్య, కార్యదర్శి కిషోర్ వేణు, శాఖ సభ్య లు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

చెట్టును ఢీకొట్టిన కారు ఇద్దరు మృతి

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

దైవదర్శనం కోసం శ్రీశైలం వెళ్లి తిరిగి వస్తూ....మరో 10 నిమిషాలు అయితే ఇంటికి చేరుతామనుకునే లోపు వారు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి చెట్టును ఢీకొంది. దీంతో కారులో ఉన్న ఇద్దరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి.ఈ సంఘటన ఏదులాపురం గ్రామ పరిధిలోని ఆటోనగర్ వద్ద ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం....ఖమ్మం నగరంలోని 59వ డివిజన్ దానవాయిగూడెం ప్రాంతానికి చెందిన పల్లపు రాము (46), అతని స్నేహితులు కేతం క్రిష్ణమూర్తి (50), బండారి సురేశ్ ముగ్గురు కలిసి ఈనెల 22వ తేదీన కారులో శ్రీశైలం వెళ్లారు. దైవదర్శనం అనంతరం ఆదివారం (23వ తేదీ) సాయంత్రం తిరిగి ఇంటికి బయలుదేరారు. మార్గమధ్యలో ఏదులాపురం పరిధిలోని ఆటోనగర్ వద్ద అర్ధరాత్రి సమయంలో ఎదురుగా వస్తున్న వాహనంను తప్పించబోయి కారు రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొంది. దీంతో పల్లపు రాము అక్కడికక్కడే మృతి చెందగా క్రిష్ణమూర్తి, సురేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి.గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం ఖమ్మంలోని ఓ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రమాద సంఘటనలో మృతిచెందిన రాము మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం అన్నం శ్రీనివాసరావు బృందం సహాయంతో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. క్రిష్ణమూర్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తెల్లవారుజామున మృతి చెందాడు. ప్రమాద సంఘటనపై రాము భార్య ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు ఇన్స్పెక్టర్ ముష్కరాజు తెలిపారు.

సత్తుపల్లి మున్సిపల్ టీపీబీవోగా వెంకటకిరణ్

నవతెలంగాణ-సత్తుపల్లి



సత్తుపల్లి మున్సిపల్ టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీర్ (టీపీబీవో)గా మండలంలోని రేజర్ల గ్రామానికి చెందిన మద్దెల వెంకటకిరణ్ నియమితులయ్యారు. ఇటీవల టీజీపీఎస్సీ నిర్వహించిన టీసీపీ పరీక్షలోఉత్తీర్ణత సాధించి ఈ ఉద్యోగానికి ఎంపికయ్యారు. రేజర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదివిన వెంకటకిరణ్ బాసర ట్రిపుల్ ఐటీలో బీటెక్ సివిల్ ఇంజినీరింగ్ పూర్తి చేశారు. సోమవారం వెంకటకిరణ్ తన నియామకానికి సంబంధించిన ఉత్తర్వుల ప్రతిని మున్సిపల్ కమిషనర్ కోంద్ర నర్సింహకు అందించి ఉద్యోగంలో జాయినయ్యారు.

శ్రీవేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం

నవతెలంగాణ-సత్తుపల్లి

సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ద్వారకాపురి రోడ్డు నెంబరు-7లో వేంచేసి ఉన్న శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ ఉత్సవ విగ్రహాలతో సోమవారం గ్రామోత్సవ కార్యక్రమాన్ని ఆలయ కమిటీ వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ఉత్సవానికి ముందు స్వామివారికి ప్రత్యేక పూజాధికాలు, అభిషేకాలు జరిపారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం మహాన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం జరిగి 16రోజులు అయిన సందర్భంగా స్వామివారి ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆయన కమిటీ బాధ్యులు తెలిపారు.

రిక్కా బజార్ ఉన్నత పాఠశాలకు ఆర్వో వాటర్ ప్లాంట్

నవతెలంగాణ-ఖమ్మం

చేతన ఫౌండేషన్ విద్యా మద్దతు కార్యక్రమంలో భాగంగా రిక్కా బజార్ ప్రభుత్వ పాఠశాలకు ఆర్ఓ వాటర్ ప్లాంట్, వివిధ ప్రభుత్వ పాఠశాలలకు డిజిటల్ టీవీలు, ప్రింటర్లు, మైక్ సెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ శైలజ లక్ష్మీ, చేతన ఫౌండేషన్ ప్రెసిడెంట్ అనిల్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల మౌలిక అవసరాలను తీర్చడంలో, ఆధునిక సాంకేతికతను పరిచయం చేయడంలో ఈ విరాళాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు దొడ్డ సీతారామయ్య, ముత్తినేని సురేష్, చంద్రకాని నవీన్, మాదినేని నరసింహారావు, దొడ్డపనేని కృష్ణారావు, షేక్ రషీద్, ఉమాదేవి, శేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) ఇంటింటి సర్వే..

- బయటపడుతున్న గత, ప్రస్తుత ప్రభుత్వాల వైఫల్యాలు

నవతెలంగాణ-ఎర్రుపాలెం



సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో సోమవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. నరసింహాపురం గ్రామ సర్వేలో పార్టీ మండల కార్యదర్శి మద్దాల ప్రభాకరరావు పాల్గొని మాట్లాడారు. నర్సింహపురం గ్రామానికి చెందిన బట్టు స్వామి (67) పెరాలసిస్ ఇతర వ్యాధులతో కాళ్ళు చచ్చుపడి పోయాయి. దీంతో ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తున్నాడని 2022 నుంచి ఏ ఒక్క నాయకుడు, ఏ ప్రభుత్వం తమను పట్టించుకోలేదని కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. 2022 నుండి వివిధ శాఖల అధికారుల చుట్టూ తిరిగి తిరిగి విసుగు చెందమన్నారు. సదరన్ క్యాంపు సర్టిఫికెట్ కోసం చాలా ఇబ్బందులు పడ్డానని, కష్టపడి తీసుకున్న సర్టిఫికెట్‌కు విలువ లేదా అని బాధితుడు వాపోయారు. తన కాళ్ల పడిపోయి వెన్నుపూసలో నొప్పి ఉంటుందని కనీసం ట్రై సైకిల్ అందిస్తారని అనుకున్న కానీ సదరం సర్టిఫికెట్ ఉండి కూడా వికలాంగ పింఛన్ కూడా పొందడం లేదని బాధితుడు, కుటుంబ సభ్యులు సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. యాక్సిడెంట్‌కు గురైన మరో వ్యక్తి కాళ్ల యాక్సిడెంట్ లో చచ్చుపడిపోయాయిన మరో యువకుడు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారని బాధితుడు తన కుటుంబ పోషణ ఎట్లా అనీ కన్నీళ్ళు పెడుతూ వికలాంగుల పెన్షన్ కోసం ఎదురు చూస్తున్నాడన్నారు. మిషన్ భగీరథ పైప్ లైన్ లీకేజీలను మరమ్మత్తులు చేసి స్వచ్ఛమైన తాగునీటిని ఇచ్చి వ్యాధుల భారి నుండి కాపాడాలని అవసరం ఉన్నచోట చేతి పంపులు ఏర్పాటు చేయాలని ప్రభుత్వ ఉన్నత అధికారులు జోక్యం చేసుకొని వెంటనే మంచినీటి సమస్య పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామంలో వీధిదీపాలు వెలగక చీకట్లో వృద్ధులు, పిల్లలు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, శివారులోని గృహలలో నివాసం ఉండే ప్రజలు విష పురుగుల సంచారంతో భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఇళు లేక పూరి ఇళ్లలో నివసిస్తూ, కలుషితం తాగునీరుతో, విధి దీపాలు లేక, పూర్తిగా గ్రామాలలో గ్రామ స్వపరిపాలన కుంటుపడిందని తెలిపారు. ఇస్తామన్నా సంక్షేమ పథకాలు ఏమీ అమలు చేయట్లేదని ఈనెల మార్చి 29న ఎర్రుపాలెం మండల కార్యాలయం ముందు జరిగే నిరసనకు అందరూ హాజరై ఈ ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు సగ్గుర్తీ సంజీవరావు గామాసు జోగయ్య, కార్యదర్శి కిషోర్ వేణు, శాఖ సభ్యులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల వద్ద '108'లు

నవతెలంగాణ-వైరా

మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన 10 వ తరగతి పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు అత్యవసర సేవలు అందించేందుకు 108 అంబులెన్స్ వాహనాలను సిద్ధంగా ఉంచామని విద్యాశాఖాధికారి కె. వెంకటేశ్వర్లు తెలిపారు. ఎండల తీవ్రతకు విద్యార్థులకు ఎటువంటి అనారోగ్య సమస్యలు ఉత్పన్నమైనా అత్యవసర వైద్య సేవలు అందించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కొందరు విద్యార్థులు ఆరోగ్య సమస్యలు ఉన్నా పరీక్షలు రాస్తున్నట్లు తెలిపారు. డి హైడ్రేషన్‌తో ఆరోగ్య సమస్యల వల్ల కాని ఏ సమస్య ఎదురైనా సిద్ధంగా ఉండేందుకు 108 వాహనాలు ఉంచినట్లు తెలిపారు.



ఉపాధ్యాయులకు డ్యూటీ సర్టిఫికెట్స్ జారీ చేయాలి : టీఎస్ యూటీఎఫ్

నవతెలంగాణ-బోనకల్

సమగ్ర కుటుంబ సర్వేలో గత నవంబర్ నెలలో సెలవు రోజుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు డ్యూటీ సర్టిఫికెట్స్ జారీ చేయాలని కోరుతూ టీఎస్ యూటీఎఫ్ బోనకల్ మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం మండల తహసిల్దార్ అనిశెట్టి పున్నం చందర్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి గుగులోతు రామకృష్ణ మాట్లాడుతూ గత సంవత్సరం నవంబర్ నెలలో సమగ్ర కుటుంబ సర్వేలో సెలవు రోజుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు డ్యూటీ సర్టిఫికెట్స్ జారీ చేయాలని, అదేవిధంగా రెమ్యూనరేషన్ చెల్లించే విధంగా కృషి చేయాలని కోరారు. సర్వే కార్యక్రమం పూర్తయి నాలుగు నెలల గడుస్తున్నా ఇంకా డ్యూటీ సర్టిఫికెట్స్ ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. సెలవు రోజుల్లో కూడా తాము పనిచేశామని, చేసిన శ్రమకు కూడా ఫలితాన్ని అడుక్కోవలసిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ బోనకల్ మండల అధ్యక్షులు గార్లపాటి చిన్న రంగారావు, మండల ఉపాధ్యక్షులు పి.గోపాలరావు, కోశాధికారి జల్లా కోటయ్య, సోషల్ మీడియా కన్వీనర్ నరేంద్ర సింహ, సాంస్కృతిక కమిటీ కన్వీనర్ కె.పద్మావతి, ఉపాధ్యాయులు ప్రశాంత్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మెకానిక్ ఆర్థిక సాయం

నవతెలంగాణ-ఖమ్మం

ఖమ్మం కార్పొరేషన్ టూ వీలర్ యూనియన్ ఆధ్వర్యంలో టూ వీలర్ మెకానిక్‌కి ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఖమ్మం కార్పొరేషన్ టూ వీలర్ యూనియన్ నాయకులు వంగాల కొండలరావు మాట్లాడుతూ ఖమ్మం కార్పొరేషన్ టూ వీలర్ మెకానిక్ నాగుల్ పాషా 13 సంవత్సరాలుగా మెకానిక్ వృత్తిలో కొనసాగుతున్నాడని, గత ఐదు రోజుల క్రితం మేజర్ ఆపరేషన్ జరిగడంతో డాక్టర్లు సూచన మేరకు సుమారు ఆరు నెలలు విశ్రాంతి తీసుకోవాలని తెలపడంతో నాకు సహాయం అందించాలని యూనియన్ సంప్రదించగా మెకానికులు అందరూ కలిసి 13 వేల రూపాయలు యూనియన్ కమిటీ సభ్యులు ఎస్కే సుభాని చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మం, మురళి, నాగేశ్వరరావు, లాలయ్య, శేషు, నాగరాజు, అబ్బాస్, సత్యనారాయణ, కుషీద్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పగిడిపల్లి వెంకటేశ్వర్లుకు డాక్టరేట్

నవతెలంగాణ-ఖమ్మం

ఖమ్మం ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకులు, జాషువా సాహిత్య వేదిక ఖమ్మం ప్రధాన కార్యదర్శి పగిడిపల్లి వెంకటేశ్వర్లుకు డాక్టరేట్ లభించింది. కాకతీయ విశ్వవిద్యాలయం తెలుగు విభాగంలో ఆచార్య పంతంగి వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో 'డాక్టర్ సీతారాం సాహిత్యం – ఒక అధ్యయనం' అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ పట్టా పొందినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎక్సమినేషన్ వారు ప్రకటించారు. ఈ మేరకు పగిడిపల్లికి పలువురు అభినందనలు తెలిపారు.

ప్రభుత్వాలు మారినా విధానాలు మారలేదు

- సీపీఐ(ఎం) మధిర మండల కార్యదర్శి మందా సైదులు

నవతెలంగాణ-మధిర

తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం మారిన పాలన విధానాల్లో ఎలాంటి మార్పు జరగలేదని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి మందా సైదులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆశ వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు ఇలా రాష్ట్రంలోని చిన్నచిన్న ఉద్యోగులు తమకు రావాల్సిన వేతనాలు బిల్లులు చెల్లించాలని అధికారులకు రాజకీయ నాయకులకు ప్రాధేయపడిన ఫలితం లేక పోరాడేందుకు సిద్ధపడితే కార్మికుల పోరాడే హక్కును నీరుగార్చి ఎక్కడికక్కడ స్థానిక పోలీసులను ఉపయోగించి అరెస్టులు చేయడం అర్ధరాత్రి అపరాత్రి అని చూడకుండా మహిళలను పోలీస్ స్టేషన్లో హాజరపరచడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. అధికార పార్టీ నాయకులు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, అధికార యంత్రాంగాన్ని పోలీసు యంత్రాంగాన్ని ఉపయోగించి అణిచివేయాలని చూస్తే సమస్యలు పరిష్కారం కావని గుర్తించాలని తెలిపారు.

27న కరాటే మండల స్థాయి పోటీలు

కల్లూరు : ఈనెల 27న కరాటే మండల స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు పిఈటి వీర రాఘవయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రీన్ ఫీల్డ్ మినీ స్టేడియం ఉదయం 9 గంటలకు హాజరు కావలెను(..కరాటే)ఝాన్సీ లక్ష్మీబాయి సెల్ఫ్ డిఫెన్స్.. కల్లూరు మండలం నందు ఉన్న ఉన్నత పాఠశాలలు రెసిడెన్షియల్ పాఠశాలలందు ఝాన్సీ లక్ష్మీబాయి సెల్ఫ్ డిఫెన్స్ ట్రైనింగ్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. మండలంలో మొత్తం 12 పాఠశాలలలో సెల్ఫ్ డిఫెన్స్ ట్రైనింగ్ ఇవ్వడం జరిగినది. ఆ ట్రైనింగ్ శిక్షణ పొందిన విద్యార్థులు ఈ పోటీలకు హాజరుకావాలని కోరారు.

'భగత్ సింగ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్దాం'

నవతెలంగాణ-పెనుబల్లి



భగత్ సింగ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు నేటి యువత నడుం బిగించాలని సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు చలమాల విఠల్‌రావు అన్నారు. డివైఎఫ్ఐ, సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం మండల అధ్యక్షులు భుక్యా ప్రసాద్ అధ్యక్షతన సభ జరిగింది. ఈ సందర్భంగా చలమాల విఠల్‌రావు మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం చిన్ననాటి తన ప్రాణాలనుతృణంగా అర్పించిన భగత్ సింగ్ యువతకి ఆదర్శమని పేర్కొన్నారు. తుపాకులు బాంబులు, విప్లవాని సృష్టించవని, విప్లవం అనే కత్తి, ఆలోచనలు అనే పదులు పెట్టే రాయిపై పదును పెట్టబడుతుందని, నమ్మాడు, భగత్ సింగ్ చిన్న వయసులో చూపిన దూర దృష్టి, తెగువ, భిన్నమైన ఆలోచన నేటిప్రధాన స్రవంతి రాజకీయాలకు బలమైన ప్రభావం చూపుతోందని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి గాయం తిరుపతిరావు, మండల కమిటీ సభ్యులు తడికమళ్ళ చిరంజీవి, మిట్టపల్లి నాగమణి, కండే సత్యం, చిమట విశ్వనాథం, సిఐటియు నాయకులు మిద్దె స్వామి, తేజావత్ రాములు, మల్లెల వెంకటేశ్వరరావు, నాగయ్య, సత్యం, ప్రసాదు, శీను, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

భగత్ సింగ్ వర్ధంతి బహిరంగ సభ విజయవంతం

వివిధ గ్రామాల నుంచి భారీగా హాజరైన సీపీఐ(ఎం) శ్రేణులు

- పెద్ద బీరవల్లిలో నూతన ఉత్సాహం నింపిన బహిరంగ సభ
- ఎర్ర చీరలు, ఎర్ర చొక్కాలతో కదం తొక్కిన ఎర్ర దండు
- హాజరైన జాన్ వెస్లీ, పోతినేని, నున్నా, జిల్లా కార్యదర్శి వర్గం

నవతెలంగాణ-బోనకల్









మండల పరిధిలోని పెద్ద బీరవల్లి గ్రామంలో విప్లవ పోరాట యోధుడు, స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్ 94వ వర్ధంతిని సీపీఐ(ఎం) గ్రామ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి భారీ ఎత్తున నిర్వహించారు. ఈ వర్ధంతి సభ సందర్భంగా భారీ బహిరంగ సభను కూడా నిర్వహించారు. ఈ సభకు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జగ్గుల జాన్ వెస్లీ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన తర్వాత తొలిసారి బోనకల్ మండలంలో పెద్ద బీరవల్లిలో జరిగిన భగత్ సింగ్ వర్ధంతి సభకి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సభను సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కిలారు సురేష్ అధ్యక్షతన నిర్వహించారు. అదేవిధంగా సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, రాష్ట్ర కమిటీ సభ్యులు బుర్రి ప్రసాద్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులందరూ, ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి సరళ, జిల్లా కార్యదర్శి బండి పద్మ, జిల్లా అధ్యక్షురాలు మాచర్ల భారతి హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలో మహిళలు ఎర్ర చీరలు, పురుషులు ఎర్రచొకాలతో గ్రామంలో భారీ ర్యాలీతో కదం తొక్కారు. పెద్ద బీరవల్లి గ్రామంలోని సీపీఐ(ఎం)కు చెందిన నాయకులు, సానుభూతిపరులు, శ్రేయోభిలాషులు ప్రతి ఇంటి నుంచి హాజరు కావటం విశేషం. బహిరంగ సభకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి పార్టీ శ్రేణులు హాజరయ్యారు. అతిపెద్ద భగత్ సింగ్ చిత్రపటాన్ని ట్రాక్టర్‌లో ఉంచి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ముందు భాగాన రాష్ట్ర, జిల్లా నాయకత్వం అడుగులు వేసింది. సభా వేదికపై భగత్ సింగ్ చిత్రపటానికి జాన్ వెస్లీ, పోతినేని సుదర్శన్‌రావు, నున్న నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వర్గం, మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు, మండల నాయకత్వం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సభ మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలో నూతన ఉత్సాహాన్ని నింపింది. ముఖ్య అతిథిగా హాజరైన జగ్గుల జాన్ వెస్లీ ఉపన్యాసం ఆద్యంతం సభకు హాజరైన జనాన్ని ఆకట్టుకుంది. భగత్ సింగ్ పోరాట స్ఫూర్తిని జాన్ వెస్లీ వివరించగా, పోతినేని సుదర్శన్ రావు భగత్ సింగ్ పోరాట స్ఫూర్తిని, వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరుల పోరాటాన్ని, మండలంలో ఆ పోరాటంలో పాల్గొన్న వీరుల త్యాగాలను వివరించారు. ఈ సందర్భంగా ఇటీవల రాష్ట్ర కమిటీ నుంచి వయసు రీత్యా రిలీవ్ అయిన మండలానికి చెందిన పొన్నం వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వర్గం నుంచి రిలీవ్ అయిన చింతలచెరువు కోటేశ్వరరావు, మండలంలో సీపీఐ(ఎం) నిర్మాత 'కర్ర సత్యం'గా పేరుగాంచిన పెద్ద బీరవల్లి గ్రామానికి చెందిన వృద్ధాప్య దశలో ఉన్న ఎనమద్ది సత్యనారాయణను రాష్ట్ర కార్యదర్శి నుంచి పెద్ద బీరవల్లి గ్రామ శాఖ వరకు శాలువాలతో ఘనంగా సన్మానించారు. వారి కుటుంబ సభ్యులను కూడా ఈ సందర్భంగా సన్మానించారు. పొన్నం వెంకటేశ్వరరావు, ఎనమద్ది సత్యనారాయణ, చింతలచెరువు కోటేశ్వరరావు పార్టీ కోసం చేసిన త్యాగాలను, వారి నిబద్ధతను వారు వివరించారు. వయసు రీత్యా కమిటీల నుంచి వైదొలిగిన పార్టీ కార్యక్రమాల విజయవంతంలో తమ శక్తి మేరకు పనిచేస్తూనే ఉంటామని సన్మాన గ్రహీతలు స్పష్టం చేశారు. ఈ సభను విజయవంతం చేయటానికి గత నాలుగైదు రోజులుగా పెద్ద బీరవల్లి గ్రామ శాఖ కార్యదర్శులు చింతలచెరువు రమేష్, పెద్దపోలు రామారావు, సీనియర్ నాయకులు పెద్దపోలు కోటేశ్వరరావు, ఆళ్ల ప్రసాద్, ఆళ్ల పుల్లమ్మ, చల్లగుండ్ల రామనరసయ్య, తాళ్లూరి దుర్గా ప్రదీప్, మిర్యాల వెంకటకృష్ణ, మాదినేని నరసింహారావు, శాఖ సభ్యులు, సానుభూతిపరులు చేతికి బలపం కట్టుకొని పనిచేశారు. వారు పడిన కష్టానికి ఫలితంగా సభ విజయవంతం కావడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జగ్గుల జాన్ వెస్లీని సన్మానించిన సీపీఐ

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికై తొలిసారి జాన్ వెస్లీ బోనకల్ మండలం రావటంతో బోనకల్ మండల పరిధిలోని అన్ని గ్రామాల శాఖలు జాన్ వెస్లీని శాలువాతో ఘనంగా సన్మానించాయి. అదేవిధంగా సిపిఐ జిల్లా సమితి కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు మండల కార్యదర్శి యంగల ఆనందరావు, సిపిఐ నాయకులు ఆకెన పవన్, గుంపుల జయరాజు శాలువాతో జాన్ వెస్లీని ఘనంగా సన్మానించి తమ మిత్ర స్నేహ బంధాన్ని చాటుకున్నారు.

జాన్ వెస్లీకి ఆర్‌ఎంపీల సమస్యలపై వినతి

జిల్లావ్యాప్తంగా ఆర్‌ఎంపీలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆర్‌ఎంపీడబ్ల్యూ జిల్లా ఉపాధ్యక్షులు కొంగర భూషయ్య (గోపి), మైనార్టీ గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షులు షేక్ హుస్సేన్ ఆధ్వర్యంలో జాన్ వెస్లీకి వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం గ్రామీణ వైద్యులను వివిధ రకాలుగా వేధింపులకు గురిచేస్తుందని కనీసం ప్రాథమిక చికిత్స కూడా చేసుకోనివ్వటం లేదని, అనేకమంది ఉపాధి హామీ పనులకు వెళ్తున్నారని, ఎప్పుడు ఏమి జరుగుతుందో తెలియటం లేదని జిల్లా వ్యాప్తంగా 41 మంది ఆర్‌ఎంపీలపై కేసులు నమోదు చేశారని ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు. పల్లె దవాఖానాలో తాము గౌరవ వేతనం ఇస్తే పనిచేయడనికి సిద్ధంగా ఉన్నామని, ఆ విధంగానైనా తమకు అవకాశం కల్పిస్తే పనిచేయటానికి సిద్ధంగా ఉన్నామని ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు. దీంతో జాన్ వెస్లీ స్పందిస్తూ పార్టీ ఆర్‌ఎంపీలు విషయంపై ఒక నిర్ణయం తీసుకుంటామని, అవసరమైతే మీకు మద్దతుగా పోరాటాల నిర్వహిస్తామని హామీ ఇచ్చారు

ఆశా వర్కర్ల అక్రమ అరెస్టులు హేయమైన చర్య

నవతెలంగాణ-కూసుమంచి



ఆశా వర్కర్ల అక్రమ అరెస్టులు హేయమనైన చర్య అని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు బండి రమేష్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి తమ సమస్యలను విన్నవించుకునేందుకు వెళుతున్న ఆశా వర్కర్లను సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. విషయం తెలుసుకున్న సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు బండి రమేష్ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌కి వెళ్లి ఆశా వర్కర్లను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తమ సమస్యల పరిష్కారానికి జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుండి చలో అసెంబ్లీ కార్యక్రమానికి హైదరాబాద్ వెళ్తున్న ఆశ వర్కర్లను, జిల్లా సరిహద్దులో పోలీసులు ఒక్కొక్క బస్సును అడ్డుకుని సుమారు 50 మందికి పైగా ఆశ వర్కర్లను అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించడం దుర్మార్గమైన చర్య అన్నారు. మహిళలు ప్రయాణిస్తున్న బస్సులను ఆపి అర్ధాంతరంగా బస్సులను చెక్ చేసి బస్సుల నుండి బలవంతంగా ఆశా వర్కర్లను దింపి పోలీస్ స్టేషన్‌కి తరలించడానికి ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ వారు హైదరాబాద్ వెల్లవలసిన సందర్భంగా అరెస్ట్ చేయటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వెంటనే భాజప్తిగా ఆశా వర్కర్లను పోలీస్ స్టేషన్ నుండి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇలా అక్రమంగా అరెస్టులతో ఏ ఉద్యమాలను, నిరసన కార్యక్రమాలను ఆపలేరని ఆయన హెచ్చరించారు. ఆశ వర్కర్లకు ఆయన మద్దతుగా నిలిచారు.

అక్రమ అరెస్టులతో ఏ ఉద్యమాలను ఆపలేరు : సీఐటీయూ

మొన్న సిఐటియు ఆధ్వర్యంలో హైదరాబాద్ వెళుతున్న సుతారి మేస్త్రులను, కార్మికులను, నేడు ఆశ వర్కర్లను అక్రమంగా రాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేయడంతో ఉద్యమాలను ఆపలేరని సిఐటియు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... ఇలా కార్మికులను, నాయకులను, అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించడం ద్వారా, లేదా భయపెట్టడం ద్వారా నిరసన కార్యక్రమాలను, ఏ ఉద్యమాలను ఆపలేరని హెచ్చరించారు. ఏ ఒక్క అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని సిఐటియు నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా నాయకులు ఎర్ర శ్రీనివాసరావు, షేక్ బషీరుద్దీన్, సిఐటియు నాయకులు తాళ్లూరి వెంకటేశ్వర్లు, సోషల్ మీడియా బాధ్యులు కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

నేలకొండపల్లి : ఆశా కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు అనుబంధ ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన చలో హైదరాబాదు సందర్భంగా స్థానిక పోలీసులు ఆశా కార్యకర్తలను ముందస్తుగా అరెస్టులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సిపిఐ(ఎం) మండల కార్యదర్శి కెవి. రామిరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్లో అరెస్టయిన ఆశా కార్యకర్తలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అరెస్టు అయిన వారిలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సభ్యురాలు సూరేపల్లి జ్యోతి, మండల అధ్యక్షురాలు బానోతు విజయ, మండల కార్యదర్శి గార్లపాటి జ్యోతి, ధారావత్ అరుణ, కుక్కల రమణ, గుమ్ముల సుభద్ర, పగిడికత్తుల రమాదేవి, బొడ్డు మరియమ్మ పగిడికత్తుల సుజాత, పగిడికత్తుల ఉమారాణి, శైలజా, సుశీల ఉన్నారు.

వికలాంగులందరికీ తక్షణమే రుణాలు ఇవ్వాలి

- సీపీఐ(ఎం) మండల కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన

నవతెలంగాణ-పెనుబల్లి



ప్రభుత్వం ప్రకటించిన రుణ సౌకర్యం తక్షణమే వికలాంగులందరికీ ఇవ్వాలి సీపీఐ(ఎం) ఖమ్మం జిల్లా కమిటీ సభ్యులు చలమాల విఠల్‌రావు, మండల కార్యదర్శి గాయం తిరుపతిరావు డిమాండ్ చేశారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఎదుట సోమవారం వికలాంగుల సమస్యలపై సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. పెనుబల్లి మండల వ్యాప్తంగా ఉన్న వికలాంగులు ఈ కార్యక్రమలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కమిటీ సభ్యులు చలమల విఠల్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వం రుణాల పేరుతో వికలాంగులను మోసం చేస్తుందని, వారికి ప్రకటించిన పెన్షన్ వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. అధికారులు వికలాంగుల ఇళ్లకు వెళ్లి వారి అర్హతలను పరిశీలించాలని, వెరిఫికేషన్ పేరుతో ప్రభుత్వ కార్యాలయాలకు తిప్పడం దారుణమన్నారు. అధికారపక్షం వ్యవహరిస్తున్న తీరు మండలంలోని వికలాంగులను చాలా ఇబ్బంది గురి చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తు కాలంలో ఇటువంటివి జరిగితే మరింత ఉధృతమైన పోరాటాలకు సిద్ధం చేస్తామని ఆయన హెచ్చరించారు. సీపీఐ(ఎం) మండల కార్యదర్శి గాయం తిరపతిరావు మాట్లాడుతూ పెన్షన్ 6000 రూపాయలు ఇవ్వాలని, బ్యాంకు ద్వారా ప్రతి ఒక్కరికి లక్ష రూపాయలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎంపీడీవో అన్నపూర్ణ కల్పించుకొని సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు తడికమళ్ళ చిరంజీవి, నల్లమల్ల అరుణ ప్రతాపు, కలకోట అప్పారావు, కలకోట చిన్న వెంకటేశ్వర్లు, వికలాంగులైన నాగేశ్వరి, ప్రసాద్, రంగమ్మ, మారేషు, లక్ష్మీ, సీతారాం, తదితరులు పాల్గొన్నారు.



యువతరానికి విప్లవ వీరుడు భగత్ సింగ్ ఆదర్శం

నవతెలంగాణ-బోనకల్

నేటి యువతరానికి విప్లవ పోరాట యోధుడు స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్ ఆదర్శమని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు, సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు దొండపాటి సత్యనారాయణ, గుగులోతు నరేష్ అన్నారు. మండల పరిధిలోని రావినూతల గ్రామంలో భగత్సింగ్ 94వ వర్ధంతి వేడుకలను ఆదివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్ సింగ్ చిత్రపటానికి గుగులోత్ పంతు, దొండపాటి సత్యనారాయణ, గుగులోతు నరేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భగత్ సింగ్ రాజగురు సుఖదేవ్ దేశ స్వాతంత్ర కోసం అతి తిన్న వయసులోనే తమ ప్రాణాలను అర్పించారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు కొంగర భూషయ్య ఎర్రగానే నాగరాజు, జోనిబోయిన గురవయ్య, మచ్చ గురవయ్య తాళ్లూరి బాబు, ఎర్రగాని కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

తల్లాడ : మండల పరిధిలోని గోపాలపేట, కుర్నవల్లి గ్రామాలలో ఆదివారం రాత్రి ఘనంగా భగత్ సింగ్ 94వ వర్ధంతి సభలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి సేలం సత్యనారాయణరెడ్డి, మండల కార్యదర్శి డివిజన్ నాయకులు నల్లమందు మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

టాక్స్‌ల కలెక్షన్ వేగవంతం చేయాలి

- మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్

నగరపాలక సంస్థ పరిధిలోని టాక్స్‌ల కలెక్షన్ వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య అధికారులను ఆదేశించారు. సోమవారం టాక్స్ కలెక్షన్ కోసం ఏర్పాటు చేసిన కౌంటర్లను ఆయన పరిశీలించారు. ఇంకా 7 రోజుల మాత్రమే మిగిలి ఉన్నందున, టాక్స్ వసూలును వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. బిల్ కలెక్టర్లు, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లు ఉదయం 8 గంటల లోపు ఫీల్డ్‌లోకి వెళ్లి, ప్రతి ఇంటికి వెళ్లి కట్టవలసిన టాక్స్ వివరాలను ప్రజలకు తెలియజేస్తూ వసూలు చేయాలని సూచించారు.



పలు కార్యక్రమాలలో పాల్గొన్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-కామేపల్లి

పండితాపురం గ్రామంలో పశువుల సంత ఎదురుగా శ్రీ విజయదుర్గా ఫిల్లింగ్ స్టేషన్ వారి నూతన పెట్రోల్ బంక్‌ను ఎమ్మెల్యే కోరం కనకయ్య, డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ ప్రారంభించారు. పెట్రోల్ బంక్ నిర్వాహకులు ధరావత్ బాలు, ధరావత్ హరితకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కొండాయిగూడెం పిఎసిఎస్ చైర్మెన్ ధనియాకుల హనుమంతరావు తండ్రి ధనియాకుల వీరయ్య దశదిన కర్మ కార్యక్రమాల్లో పాల్గొని వీరయ్య చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసి మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు షేక్ పతే మహమ్మద్, బానోత్ నరసింహనాయక్, బానోత్ కస్తూరిబాయి, మేకపోతుల మహేష్, శీలం పుల్లయ్య, సామినేని మోహన్‌రావు, బాదావత్ నాగరాజు, బత్తుల వీరబాబు, చల్ల మల్లయ్య, బండి ఉపేందర్, మొగిలి శ్రీను, చిట్టిబాబు, పాటిబండ ప్రసాదు, చింటూ, దండగల దేవేంద్ర, కొమ్మినేని శ్రీను, కొమ్మినేని అప్పారావు, దొడ్డ ఏసు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
7
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం | మార్చి 25, 2025 | www.navatelangana.com




సీతారామ ప్రాజెక్టు అధ్యయనం

ప్రాజెక్టును పూర్తి చేసేందుకు అధిక నిధులు కేటాయించాలి

- జిల్లా రైతాంగానికి సాగునీటికి తొలి ప్రాధాన్యతను ఇవ్వాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-అశ్వాపురం

సీతారామ ప్రాజెక్ట్ నిర్మాణ పనుల వాస్తవ స్థితిగతులను సోమవారం సీపీఐ(ఎం) జిల్లా నాయకత్వ బృందం అధ్యయనం చేసింది. ప్రాజెక్టు నిర్మాణ కేంద్రమైన అశ్వాపురం మండలం, కుమ్మరిగూడెం గ్రామ సమీపంలోని గోదావరి నదిపై ప్రారంభమైన ప్రాజెక్టును సందర్శించారు. అదేవిధంగా బిజీ కొత్తూరు సమీపంలో నిర్మించిన ఫేస్ వన్ పంపహౌస్, చంద్రుగొండ మండలంలోని ఎర్రగుంట, జూలూరుపాడు మండలంలోని వినోబానగర్ ఉన్న పాయింట్లను సందర్శించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన పనులు ఇప్పటివరకు జరిగిన నిధుల ఖర్చు సాధించిన ఫలితాలపై ప్రజలకు వాస్తవాలను వివరించాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్ట్ పూర్తికాకుండానే ముఖ్యమంత్రి, మంత్రులు ఆగమేఘాలమీద నీటిని విడుదల చేసి ప్రజలకు తప్పుడు సంకేతాలను ఇచ్చారని తెలిపారు. మరల ఇటీవల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గోదావరికి గండికొట్టి కాలువలకు నీటిని విడుదలచేయటం అక్రమంకాదా? అని ఆయన ప్రశ్నించారు. పాలకులు మారిన ప్రతిసారి ప్రాజెక్టు నమూనాను మార్చుకుంటూ జిల్లా రైతులకు తీవ్ర నష్టం కలిగించేవిధంగా ప్రాజెక్టు, కాలువల నిర్మాణాలు సాగుతున్నాయని సీపీఐ(ఎం) కమిటీ బృందం తెలిపింది. మొదట భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైతుల భూములకు నీళ్ళు ఇచ్చి జిల్లాను సస్యశామలం చేయాలని డిమాండ్ చేసారు. ప్రాజెక్ట్ నిర్మాణం త్వరిత గతిన పూర్తి చేసి ముందు భద్రాద్రి జిల్లాలోని చెరువులు, కుంటలు, నింపి ఇక్కడ రైతాంగానికి నీళ్ళు ఇచ్చిన తర్వాతనే ఖమ్మం జిల్లాకు నీరు తీసుకు పోవాలని ప్రభుత్వాన్ని కోరారు. గోదావరి చెంతనే ఉన్నప్పటికీ జిల్లాలో అత్యధిక భాగం భూములకి సాగునీటి కొరత తీవ్రంగా ఉందని ఇటువంటి నేపథ్యంలో జిల్లా ప్రగతికి మొదటి ప్రాధాన్యతని ఇవ్వాలని పార్టీ డిమాండ్ చేసింది. ప్రాజెక్టు నిర్మాణంలో మొదట ప్రతిపాదించిన నమూనాలో రోల్లపాడు ప్రతిపాదన ఉన్నప్పటికీ కొత్త ప్రతిపాదనలో రోల్లపాడుకి ఎటువంటి ప్రాధాన్యత లేకుండా నమూనాను మార్పు చేశారన్నారు. ప్రాజెక్టు నిర్మాణ వ్యయానికి ప్రభుత్వం బడ్జెట్లో కేటాయిస్తున్న కేటాయింపులకు ఎటువంటి పొంతన లేకుండా ఉందని, అవసరమైన బడ్జెట్ కేటాయింపు లేకుండా పనులు సకాలంలో పూర్తి కావని నేతలు అభిప్రాయపడ్డారు. అదేవిధంగా ప్రాజెక్టును పూర్తి చేసేందుకు నిధులు కేటాయింపు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు కోర్టు ఆదేశాల ప్రకారం వెంటనే నష్ట పరిహారం ఇవ్వాలని కోరారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం రైతులకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. సీతమ్మ సాగర్ ప్రాజెక్ట్ ఉమ్మడి ఖమ్మం జిల్లాకు వరప్రదాయినిగా మారాలని సీపీఐ(ఎం) అభిప్రాయపడుతుందని తెలిపారు. అయితే ఉమ్మడి జిల్లాకి ప్రాతినిధ్యం వహిస్తున్న ముగ్గురు మంత్రులు ప్రాజెక్టు నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయడం కోసం కృషి చేయాలన్నారు. ప్రాజెక్టు నిర్మాణంపై జిల్లా ప్రజలకు ఉన్న అనుమానాలను నివృత్తి చేయాలని కోరుతూ జిల్లా బృందం మంత్రులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య, ఏ.జే.రమేష్, జిల్లా సీనియర్ నాయకులు ఎల్లమంచి రవికుమార్, సర్గం బాల నరసయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కే.బ్రహ్మాచారి, ఎంబి నర్సారెడ్డి, కారం పుల్లయ్య, అన్నవరపు సత్యనారాయణ, రేపాకుల శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు గద్దల శ్రీనివాస్, నిమ్మల వెంకన్న, అమ్మగారి పల్లి మాజీ సర్పంచ్ పాయం భద్రయ్య, అశ్వాపురం పార్టీ మండల కార్యదర్శి నరసింహారావు, సత్రపల్లి సాంబశివరావు, రైతు సంఘం నాయకులు బొల్లి సూర్యచంద్రరావు, అశ్వాపురం మండల నాయకులు మోకాళ్ళ రమేష్, అశోక్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, సంబిరెడ్డి, రాములు, పద్మ సాంబశివరావు పాల్గొన్నారు.



జిల్లాను సస్యశ్యామలం చేయాలి

ములకలపల్లి : సీతారామ ప్రాజెక్ట్ సాగునీరు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సాగు భూములకు అందించి జిల్లాను సస్యశ్యామలం చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని ఒడ్డు రామవరం, కమలాపురంలో ఉన్న సీతారామ ప్రాజెక్టు పంప్ హౌస్‌లను పార్టీ జిల్లా బృందం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లా రైతాంగాన్ని మభ్య పెట్టేందుకు సీతారామ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి కాకుండానే ఆగమేగాల మీద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారని ప్రాజెక్టు నమూనాన మార్చుతూ రైతాంగానికి తీవ్ర నష్టం కలిగించే విధంగా ప్రాజెక్టు నిర్మాణం కాలువల నిర్మాణం సాగుతుందని అన్నారు. ముందుగా మండలంలోని ఉన్న చెరువులు, కుంటాలను నింపి మండల రైతాంగానికి సాగునీరు అందించిన తర్వాతనే ఖమ్మం జిల్లాకు నీరు తరలించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీతారామ ప్రాజెక్ట్ కెనాల్ నిర్మించి మూక మామిడి, మాదారం, పూసుగూడెం, వికేరామారావు, మండలంలో ఉన్న వివిధ చెరువులు కుంటలను నింపి మండల రైతాంగానికి సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అన్నవరపు కనకయ్య, ఏజే రమేష్, కొక్కెరపాటి పుల్లయ్య, బాల నర్సారెడ్డి, కే.బ్రహ్మాచారి, కారం పుల్లయ్య అన్నవరం సత్యనారాయణ, రేపాకుల శ్రీనివాస్, మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, రావుజా, రవికుమార్, నిమ్మల మధు, ఆదినారాయణ, రామ్మూర్తి, కృష్ణ, వెంకటేశ్వర్లు, హేమని, వినోద్, తదితరులు పాల్గొన్నారు.





సామ్రాజ్యవాద, మతోన్మాద వ్యతిరేక పోరాటమే

భగత్ సింగ్‌కిచ్చే నివాళి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మచ్చ
- భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా లౌకిక సందేశ్ ర్యాలీ

నవతెలంగాణ-కొత్తగూడెం

సామ్రాజ్యవాదానికి మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా పోరాటమే భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లకు ఇచ్చే ఘనమైన నివాళి అని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు అన్నారు. భారత స్వాతంత్ర సమరయోధులు విప్లవ వీర కిశోరాలు భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ 94వ వర్ధంతి సందర్భంగా ఆదివారం రాత్రి స్థానిక పాత డిపో నుండి రైల్వే స్టేషన్ వరకు లౌకిక సందేశ్ ర్యాలీని నిర్వహించారు. అనంతరం రైల్వే స్టేషన్ వద్ద జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లిక్కి బాలరాజు అధ్యక్షతన జరిగిన సభలో మచ్చ మాట్లాడారు. రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా పోరాడుతూ భారతదేశ యువతను మేల్కొల్పడంలో భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ మిత్రుల త్యాగం చాలా విలువైనదని కొనియాడారు. మాతృదేశం కోసం చిన్న వయసులోనే చిరునవ్వుతో ఉరికంబమెక్కి భారత జాతీయ ఉద్యమానికి దశా దిశా నిర్దేశం చేసిన గొప్ప విప్లవకారులన్నారు. బ్రిటిష్ వలస పాలన నుండి మాతృదేశాన్ని విముక్తి చేయడానికి తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజలకు స్వాతంత్రం అందించడం కోసం బలి దానాలు గావించబడ్డారని తెలిపారు. ఈ దేశానికి స్వాతంత్రం రావడం అంటే కేవలం అధికార మార్పిడి రాజకీయ అధికార మాత్రమే కాదని దీని వలన స్వాతంత్ర ఫలాలు పేదలకు దక్కవని అన్నారు. ప్రజలందరికీ సామాజిక ఆర్థిక స్వాతంత్రం వచ్చినప్పుడే నిజమైన స్వాతంత్రమని భగత్ సింగ్ ప్రకటించాడన్నారు. భగత్ సింగ్ కలలుగన్న ఆర్థిక, సామాజిక స్వాతంత్రం నేటికీ మన భారతదేశానికి దక్కలేదని ధనవంతులు శతకోటీశ్వరులుగా ఎదుగు తుంటే పేదవాడు మరింత పేదవాడుగా కునారిల్లి పోతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. నేటికీ సామాజిక అనిచివేత కూడా సమాజంలో కొనసాగుతుందని అన్నారు. అందుకని భగత్ సింగ్ ఆశయ సాధన కోసం ఈ దేశానికి సోషలిజమే ప్రత్యామ్నాయంగా వెలుగెత్తి చాటుతూ భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపు నిచ్చారు. భగత్ సింగ్ స్ఫూర్తితో సామ్రాజ్య వాదానికి మతో న్మాదానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తూ మతసామరస్యం కోసం పాటుపడాలని ఆయన పిలుపు నిచ్చారు. ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకానికి వ్యతిరేకంగా జాతి సంపదను కాపాడుకోవడానికి భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ స్ఫూర్తితో మరో స్వాతంత్ర పోరాటానికి సిద్ధం కావాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అన్నవరపు సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు భూక్య రమేష్, వాంకుడోత్ కోబల్, అమర్ సింగ్, సందకురి లక్ష్మి, నందిపాటి రమేష్, జయశ్రీ, విజయగిరి శ్రీనివాస్, కె.హెచ్.ప్రసాద్, ఎస్ఎస్ రాజు, సత్రం, పద్మ, రమ, బాలకృష్ణ, రాములు, రఘు, తదితరులు పాల్గొన్నారు.

ఊపిరి ఆడడం లేదు...



కాలుష్య విషం చిమ్ముతున్న సింగరేణి, బీటీపీఎస్

- 300 కోట్లు పర్యావరణ నిధులేవి
- స్పందించని అధికార యంత్రాంగం

నవతెలంగాణ-మణుగూరు

సింగరేణి ఉపరితల గనుల వలన బొగ్గుచూర, బీటీపీఎస్ బూడిద వలన మణుగూరులో మండలంలో గాలి విపరీతంగా కాలుష్యమైంది. వాతావరణంలో కాలుష్యం విస్తృతంగా ఆవరించింది. భద్రాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణం ప్రారంభంలో ప్రజా అభిప్రాయ సేకరణ సందర్భంగా బీటీపీఎస్‌కు 25 కిలోమీటర్లు దూరం వరకు గ్రామాలను పర్యావరణ అభివృద్ధి చేస్తాం అన్నారు. విరివిగా చెట్లు నాటుతామన్నారు. ఇంతవరకు డీ సల్ఫరైజేషన్ ప్లాంట్ నిర్మించకుండానే విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. దీని కారణంగా విపరీతమైన విషవాయువులు గాల్లో కలిసి పర్యావరణాన్ని దెబ్బతీస్తున్నాయి. విషపూరితమైన కాలుష్యం వలన వృద్ధులకు, పిల్లలకు అనారోగ్యంతో బాధపడుతున్నారు. తీవ్ర కాలుష్యం కారణంగా కళ్ళు మండుతున్నాయి. విపరీతంగా కాలుష్యం, పొగ కారణంగా ప్రజలకు ఊపిరావడం లేదు. జ్వరన పడిన ప్రజలు ఆస్పత్రులలో టెస్టులు చేయించుకోగా ఎక్కువమందికి ఊపిరితిత్తుల సమస్యలు బయటపడుతున్నాయి. మణుగూరు ఉపరితల గనుల నుండి భద్రాద్రి పవర్ ప్లాంట్ రోజుకు 16,000 టన్నుల బొగ్గును సరఫరా చేస్తున్నారు. రహదారులు వెంబడి జారి పడిన బొగ్గు పెల్లలు నుజ్జు నుజ్జుగా మారుతుంది. విపరీతమైన బొగ్గుచూర, దుమ్ము గాలిలో కలుస్తుంది. ప్రధాన రహదారి ఇరువైపుల ఉన్న పచ్చని చెట్లు నల్లగా మారిపోయాయి. పచ్చదనం లేక ప్రకృతి విలవిల ఆడుతుంది. సాయంత్రం నాలుగు గంటల నుండి రాత్రి 10:00 వరకు విపరీతమైన దుమ్ము బొగ్గు చూర గాలిలో కలుస్తుంది. వాతావరణంలో కలవడం వలన సాయంత్రం వేళలో ఆ రహదారిపై ప్రయాణించాలంటే ప్రయాణికులకు ఆయా ప్రాంతాల ప్రజలకు ఊపిరాడకుండా అవుతుంది. దట్టంగా గాలిలో ఉన్న కాలుష్యం కారణంగా ఎదురుగా వచ్చే వాహనం కూడా కనిపించడం లేదు. దాంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా గాంధీనగర్, కాళీమాత ఏరియా, భగత్ సింగ్ నగర్, శేషగిరి నగర్, రాజుపేట, బాపన కుంట చెరువు, ముందు సింగారం, జీఎం సింగారం, రాంనగర్, అరుంధతి నగర్ తదితర ప్రాంతాలలో ప్రజలు దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడుతున్నారు. భద్రాద్రి పవర్ ప్లాంట్ ప్రభావిత గ్రామాలైన చినరావి గూడెం, సీతారాంపురం, దమ్మక్కపేట, సాంబాయిగూడెం గ్రామాలలో విపరీతమైన బూడిద గ్రామాలలో ఆవరిస్తుంది. పెరట్లో పెంచుకునే మొక్కల నుండి వాకిళ్ళలో విపరీతమైన బూడిద వర్షం కురుస్తుంది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. సింగరేణి ఉపరితల గనులు భద్రాద్రి పవర్ ప్లాంట్ కారణంగా మణుగూరు మున్సిపాలిటీ, మండలంలోని ప్రజలు తీవ్ర కాలుష్య ప్రభావానికి గురవుతున్నారు. ఓబి బొగ్గు బ్లాస్టింగ్ సందర్భంగా సరైన నిబంధనలు పాటించకపోవడంతో విపరీతమైన దుమ్ము, బొగ్గు చూర వాతావరణలో కలుస్తుంది. ఓసీ టులో కోల్ క్రషర్ మిషన్‌లో వాటర్ ఉపయోగించని కారణంగా విపరీతమైన బొగ్గుచూర గాలలో కలుస్తుంది. దీని కారణంగా పగిడేరు పంచాయతీలోని శాంతినగర్, గొల్ల కొత్తూరు గ్రామాలలో గాలి కాలుష్యమై అనారోగ్యం పాలవుతున్నారు. ఆక్సిజన్ తగ్గి కార్బన్డయాక్సైడ్ అధికం అవుతుందని పర్యావరణ శాస్త్రవేత్తలు, ప్రేమికులు ఆరోపిస్తున్నారు. ఇలానే కొనసాగితే మణుగూరు ఏరియాలో తీవ్ర గాలి కాలుష్యం ఏర్పడే అవకాశం ఉందని, వెంటనే భద్రాద్రి పవర్ ప్లాంట్ యాజమాన్యం, సింగరేణి యాజమాన్యం కాలుష్య నివారణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలలో నీళ్లను చల్లి దుమ్ము లేవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని లేనిచో ఉద్యమాలు నిర్వహిస్తామని ప్రజలు, ప్రజా సంఘాలు పేర్కొన్నారు.




జూలూరుపాడులోని సీతారాం ప్రాజెక్టు పనులను పరిశీలించిన పార్టీ బృందం


నవతెలంగాణ-కొత్తగూడెం(జూలూరుపాడు)

భూములు మావి, నీళ్ల ఖమ్మం జిల్లాక..?, స్వార్ధ ప్రయోజనాల కోసం జిల్లా రైతాంగానికి తీవ్ర అన్యాయం చేస్తున్నారని, హడావుడిగా ప్రారంభం దేనికి సంకేతమని ....? భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైతాంగానికి న్యాయం చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు నీటితీరుపై అన్యాయం జరుగుతున్నటువంటి తీరును ప్రత్యక్షంగా వీక్షించారు. అనంతరం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైతాంగానికి కళ్ళల్లో కారం కొట్టి సీతారామ ప్రాజెక్టు నీళ్లను తమ స్వార్ధ ప్రయోజనాల కోసం తమ నియోజకవర్గాల అభివృద్ధి కోసం తీసుకు వెళ్లడం సరికాదన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైతాంగానికి అన్యాయం చేస్తూ సీతారామ ప్రాజెక్టు నీళ్లను ఖమ్మం జిల్లాకు తీసుకు వెళ్తున్నారన్నారు. దుమ్ముగూడెం ప్రాజెక్టు మొదలుకొని, సీతారామ ప్రాజెక్టు దాకా ఈ జిల్లా రైతాంగానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కానీ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో కానీ తీవ్రమైన అన్యాయం జరుగుతోందన్నారు. ఆనాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో ఈనాటి మంత్రులు ఉన్నారు. నేటి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో వారు మంత్రులుగా కొనసాగుతున్నారు. కానీ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైతాంగానికి ఒరిగిందేమీ లేదని విమర్శించారు. రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత నాటి ముఖ్యమంత్రి పేర్లు మార్చి డిజైన్లు మార్చి సీతారామ ప్రాజెక్టుగా నామకరణం చేసి ఈ జిల్లాలోని నాలుగు లక్షల ఎకరాల భూమికి సాగునీరు అందిస్తానని చెప్పి, జిల్లా రైతాంగం దగ్గర భూసేకరణ చేశారని తెలిపారు. 10 ఏళ్లుగా సాగదీత ధరోణితో ప్రాజెక్టు పూర్తి చేయకుండా ఉండటం ద్వారా నేటి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తుమ్మల నాగేశ్వరరావు మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే సాగర్ ఆయకట్టు స్థిరీకరణ పేరుతో ఈ జిల్లా రైతులకు అన్యాయం చేస్తున్నారని, తమ స్వార్ధ ప్రయోజనాల కోసం ఈ జిల్లా నీళ్లను తరలించుకు వెళుతున్నారని ఆరోపించారు. పార్టీ జిల్లా బృందం ఆధ్వర్యంలో సీతారామ ప్రాజెక్టు ప్రారంభమైన అశ్వాపురం మొదలుకుని, ఈ జిల్లా ఆఖరి ప్రాంతమైనటువంటి జూలూరుపాడు వరకు పర్యటించి రైతులకు జరుగుతున్న అన్యాయంపై మాట్లాడారు. తీసుకురాకుండా ఎక్కడా పిల్ల కాలువలు తీయకుండా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు జూలూరుపాడు మండలానికి అన్యాయం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టుల ప్రారంభం పేరుతో కాలయాపన చేస్తుందని దుయ్యబట్టారు. ఈ మండల రైతాంగానికి నీరు ఇచ్చిన తర్వాతనే మిగులు జలాలు మాత్రమే సాగర్ ఆయకట్టు స్థిరీకరణకు తీసుకువెళ్లాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే.రమేష్, అన్నవరపు కనకయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.బ్రహ్మాచారి, రేపాకుల శ్రీనివాసరావు, అన్నవరపు సత్యనారాయణ, మండల కార్యదర్శి యాస నరేష్, పార్టీ మండల కమిటీ సభ్యులు గార్లపాటి వెంకటి, గడిదేసి కనకరత్నం, రాచబంటి కోటేశ్వరరావు, జల్లిక రాధాకృష్ణ, శాఖ కార్యదర్శి బొల్లి లక్ష్మయ్య పాల్గొన్నారు.

పర్ణశాల రామయ్యను దర్శించుకున్న చెన్నై హైకోర్టు జస్టిస్

నవతెలంగాణ-దుమ్ముగూడెం

భద్రాచల రామాలయానికి అనుబంధ ఆలయమైన పర్ణశాల శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని సోమవారం చెన్నై హైకోర్టు జస్టిస్ వి.శివజ్ఞానం సతీ సమేతంగా దర్శించుకున్నారు. ముందుగా ఆలయ సిబ్బంది వారికి ప్రధాన ద్వారం వద్ద స్వాగతం పలికి ప్రధాన ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం సీత కుటీర ప్రదేశంతో పాటు, నార చీరల ప్రాంతాలను సందర్శించి పర్ణశాల విశిష్టతను గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వారి వెంట పర్ణశాల ఆలయ ఇన్‌చార్జి అనిల్ కుమార్, ఆలయ అర్చక స్వాములు శకిరణ్ కుమారాచార్యులు, ఎస్సై గణేష్, ఆలయ సిబ్బంది ఉన్నారు.



కాంగ్రెస్ గూటికి మాజీ జడ్పీటీసీ

- 50 కుటుంబాలతో పార్టీలో చేరిన సత్యనారాయణమూర్తి
- పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించిన మంత్రి, ఎంపీ



నవతెలంగాణ-దుమ్ముగూడెం

మండల మాజీ జెడ్పీటీసీ, బీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు అన్నె సత్యనారాయణమూర్తి ఎట్టకేలకు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ భద్రాచలం నియోజకవర్గంలో ప్రతి నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలు పరిష్కారం మార్గం చూపుతూ... నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో ముందుకు తీసుకు వెళుతున్న తెల్లం పట్ల ఆకర్షితులై ఎమ్మెల్యే ఆధ్వర్యంలో మంత్రివర్యులు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరినట్టు తెలిపారు. సత్యనారాయణ మూర్తితో పాటు బీఆర్ఎస్ పార్టీకి చెందిన మండల నాయకులు పూసం సావిత్రి, పొడియం సుబ్బారావు, కొండపల్లి నరేంద్ర, అల్లాడి వెంకటేష్, మోతుకూరి శ్రీకాంత్, బొల్లి శేఖర్ యాదవ్, కొయ్యలముడి సాగర్, ఎస్.కెఖాదర్ పాషా, బొల్లోజు రవి కుమార్, జెట్టి రామకృష్ణ, పిట్టా పూర్ణయ్య, ముత్తయ్య, శ్రవణ్ మొత్తం 50 కుటుంబలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, భద్రాచలం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ తెల్లం సీతమ్మ, కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు లంక శ్రీనివాసరావు (అబ్బులు) డివిజన్ సేవాదళ్ అధ్యక్షులు పిలక వెంకటరమణ రెడ్డి, మాజీ సర్పంచ్ మట్ట వెంకటే శ్వరావు (శివాజీ), మండల సీనియర్ నాయకులు కుంజా శ్రీనివాసరావు, కెల్లా శేఖర్, తోట రమేష్, సేవాదళ్ మండల అధ్యక్షులు రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

- ఆరుగురు అరెస్టు : ఎస్ఐ

నవతెలంగాణ-కరకగూడెం


పేకాట స్థావరంపై సోమవారం పోలీసులు మెరుపు దాడి చేశారు. ఈ ఘటన మండలంలోని బుర్గరం సమీపంలోని నరసింహస్వామి ఆలయ సమీపంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని ఎస్ఐ రాజేందర్ అరెస్ట్ చేశారు. ఎస్ఐ రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం..పేకాట ఆడుతున్న సమాచారంతో తన సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. నిందితుల నుంచి రూ.7000 నగదు, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



రంజాన్ పండుగకు విస్తృత ఏర్పాట్లు చేపట్టండి

- అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే కూనంనేని

నవతెలంగాణ-కొత్తగూడెం



రంజాన్ పండుగ సందర్భంగా బస్తీలు, గ్రామాల్లో ఎలాంటి అసౌకర్యం కలగకుండా విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. అసెంబ్లీ సమావేశాల్లో అయన సోమవారం మున్సిపల్, పోలీసు, పంచాయతీ రాజ్ శాఖల సబ్ డివిజన్, మండల స్థాయి అధికారులకు సోమవారం ఫోన్ చేసి పలు సూచనలు చేశారు. ఉపవాస దీక్షలు, రంజాన్ పండుగ సందర్భంగా మజీదులు, బస్తీలు, గ్రామాల్లో ఇఫ్తార్ విందులు, ప్రేత్యేక ప్రార్ధనలు జరుగుతున్నాయని ఈ ప్రాంతాల్లో ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టాలని, విధుల్లో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈద్గాలు, మజీదులు పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సౌకర్యం, పారిశుధ్యం చేపట్టాలని సూచించారు. ఈద్గాలు వద్ద తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని, పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసి పండుగ ఉత్సవాలు ప్రశాంతగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

రైతు బీమా తరహాలో కూలి బీమా ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-లక్ష్మీదేవి పల్లి

ఉపాధి కూలీలకు రైతు బీమా తరహాలో కూలి బీమా ఏర్పాటు చేయాలని ఏపీపీకేఎంఎస్ రాష్ట్ర నాయకులు జాటోత్ కృష్ణ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అశోక్ నగర్, శ్రీనగర్, లోతు వాగు, మాదిగ పోళ్ళు, మోకాళ్ళ గుంపు, అని శెట్టిపల్లి, గ్రామాల్లో ఉపాధి పని ప్రదేశాలను సందర్శించి పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. రెక్కాడితే డొక్కాడని వ్యవసాయ కార్మికులు పని దొరక్క ఉపాధి పని చేసుకుంటున్న పరిస్థితి కొనసాగుతుందన్నారు. వ్యవసాయ కూలీలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.12000లు ఆర్థిక సహాయం తక్షణమే అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం జిల్లా నాయకులు ఎం.రాజశేఖర్, ఎల్లమ్మ సీతమ్మ, సుశీల, వరలక్ష్మి, వెంకయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీలో నియోజకవర్గ సమస్యలు లేవనెత్తిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-మణుగూరు



పినపాక నియోజకవర్గానికి సంబంధించి కీలక సమస్యలను శాసనసభలో లేవనెత్తిన ఎమ్మెల్యే పలు కీలక డిమాండ్లు ఉంచారు. కొత్త మండలాల పరిపాలన సమస్యలు 2016లో ఏర్పాటు చేసిన కొత్త మండలాలు ఆళ్లపల్లి, కరకగూడెం గత పాలకులు పరిపాలనను విస్మరించడంతో ఈ మండలాల్లో సరైన భవనాలు లేక, తాత్కాలిక గదుల్లోనే కార్యాలయాలు నిర్వహించాల్సిన పరిస్థితి ఉందన్నారు. సమీకృత రెవెన్యూ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. జూనియర్ కాలేజీల మంజూరు ఈ కొత్త మండలాల్లో కేజీబీవీలు, ఆశ్రమ గురుకుల పాఠశాలలు ఉన్నప్పటికీ, జూనియర్ కాలేజీలు లేవు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రెండు కొత్త జూనియర్ కాలేజీలను మంజూరు చేయాలన్నారు. మండల కేంద్రాలకు రహదారి సౌకర్యం కొత్తగా ఏర్పాటైన ఆళ్లపల్లి మండల కేంద్రం నుంచి కొత్తగూడెం జిల్లా కేంద్రానికి డబుల్ బీటీ రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలన్నారు. మారుమూల ప్రాంతాలకు సరైన రవాణా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటు, జిల్లా ఖనిజ సంపద కలిగిన ప్రాంతం జిల్లాలో నవభారత్ కేటీపీఎస్ ఐటీసీ బీపీఎల్ పేపర్ బోర్డు, హెచ్‌డబ్ల్యుపీ కర్మాగారం, సింగరేణి బొగ్గు గనులు వంటి పరిశ్రమలు ఉన్నాయి. అందువల్ల జిల్లాలో 'ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ' ఏర్పాటుకు ప్రభుత్వం ప్రత్యేకంగా శ్రద్ధ చూపాలని ఈ కీలక డిమాండ్లను ఎమ్మెల్యే అసెంబ్లీలో ప్రస్తావించగా, ప్రభుత్వం త్వరలో స్పందించి అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు ఆశిస్తున్నారు.

కార్మిక పోరాటాలపై ప్రభుత్వ నిర్బంధం తగదు : సీఐటీయూ

నవతెలంగాణ-కొత్తగూడెం

రాష్ట్రంలో కార్మిక పోరాటాలపై ప్రభుత్వం నిర్బంధాన్ని ప్రయోగించటాన్ని సీఐటీయూ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఎన్నికల ముందు ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీల అమలు కోసం హైదరాబాద్ ధర్నాకు వెళ్లిన ఆశా వర్కర్లపై లాఠీచార్జి చేసి అక్రమ అరెస్టులు చేయటాన్ని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.బ్రహ్మాచారి, ఏజే.రమేష్‌లు తీవ్రంగా ఖండించారు. హైదరాబాద్ వెళ్ళకుండా అడ్డుకునేందుకు అర్ధరాత్రి సైతం మహిళల ఇండ్లకు వెళ్లి అరెస్టులు చేయడం దుర్మార్గమైన చర్యగా సిఐటియు పేర్కొన్నది. మధ్యాహ్న భోజన పథకం కార్మికులను సైతం హైదరాబాద్ వెళ్లకుండా వందలాది మందిని అరెస్టు చేసి స్టేషన్‌లో ఉంచటం ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనంగా వారు పేర్కొన్నారు. సమస్యలు చెప్పుకునే స్వేచ్ఛ, హక్కుల కోసం పోరాటం చేయడం రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కుని దాన్ని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం కాల రాయాలని చూస్తే బీఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కి పడుతుందని సిఐటియు హెచ్చరించింది. ఇప్పటికైనా ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలకు బడ్జెట్ సమావేశాల్లో స్పష్టమైన ప్రకటన చేసి బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైఖరి మార్చుకోకపోతే కార్మిక పోరాటాల ద్వారా ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని సిఐటియు హెచ్చరించింది.

విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు ఉండాలి

తహసీల్దార్ అద్దంకి నరేష్



నవతెలంగాణ-పినపాక
పినపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని సోమవారం తహసీల్దార్ అద్దంకి నరేష్ పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

రెచ్చిపోతున్న మైనింగ్ మాఫియా



నవతెలంగాణ-మణుగూరు
మణుగూరు మండలంలో మైనింగ్ మాఫియా రెచ్చిపోతున్నారని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సీతారామరాజు అన్నారు. సోమవారం స్నేహ గార్డెన్స్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మణుగూరు నుండి బీటీపీఎస్‌కు నిర్మిస్తున్న రైల్వే లైన్‌కు అనుమతులు లేని అక్రమ గ్రావెల్ తరలిస్తున్నారని అన్నారు. ఇసుక అనుమతి లేకుండా స్థానిక గురపెట్టవాగులో నాణ్యత లేని ఇసుకను ఉపయోగిస్తున్నారని అన్నారు. అధికారులకు ముడుపులు అందజేస్తూ రైల్వే ట్రాక్ నిర్మాణం చేస్తున్నారని తెలిపారు. బీటీపీఎస్ నుండి వెలువడే బూడిదను గోదావరిలో విడుదల చేస్తున్నారని అన్నారు. నదీ పరివాహక ప్రాంతంలో ఉన్న మిషన్ భగీరథ ద్వారా ప్రజలు అదే నేను తాగుతున్నారని అన్నారు. ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భోగి రామచంద్రరావు, ముత్యాల వెంకటేశ్వర్లు, మీసాల వెంకటేశ్వర్లు, పట్టా బిక్షపతి, మురళి, మనోహర్, రాజు, మీసాల దుర్గారావు, పల్లపు కిషోర్ బాబు, కామసాని వీర మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ డి వేణుగోపాల్

నవతెలంగాణ-పాల్వంచ
ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయ సమావేశ మందిరంలో అన్ని శాఖల అధికారులతో ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు. ఈ సందర్భంగా దరఖాస్తు చేసిన అభ్యర్థులను వివరాలను అడిగి తెలుసుకొని సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని శాఖల వారీగా అధికారులను ఆదేశించారు. జూలూరుపాడు మండలం కాకర్ల గ్రామంలో నివాసముంటున్న సూర్యదేవర సీతమ్మ తన భర్త సూర్యదేవర రాజయ్య స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రాణాలకు తెగించి పోరాడినందుకుగాను ప్రభుత్వం 1982వ సంవత్సరంలో పింఛన్ మంజూరు చేసినారని కానీ స్వాతంత్ర సమరయోధులకు ప్రభుత్వం నుండి రావలసిన భూమి కానీ ఇంటి స్థానం కానీ కేటాయించలేదని, వాటి కోసం 40 సంవత్సరాలుగా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగి ఆఖరికి మరణించినారని, ఆయన మరణానంతరము పింఛన్ ను తనకు మంజూరు చేసినారని, కావున ప్రభుత్వం నుండి రావలసిన భూమి తనకు ఇప్పించవలసిందిగా చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యలు నిమిత్తం ఈ సెక్షన్ సూపరెంటెంట్ కు ఎండార్స్ చేశారు. దమ్మపేట గ్రామంలో నివాసం ఉంటున్న కందుకూరి లక్ష్మీ నరసమ్మ తన భర్త మరణానంతరం తమకున్న భూమిలో ఒక ఎకరం పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి దేవాలయానికి విరాళంగా ఇవ్వడానికి నిర్ణయించుకున్నామని, ఇప్పుడు నా మరిది దానికి



అడ్డుపడి, ఆస్తిలో వాటాకు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని చెప్పారు. కావున నా భర్త మరియు నేను ఇచ్చిన మాట ప్రకారం బ్రహ్మంగారి దేవాలయానికి భూమిని ఇప్పించగలరని చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యలు నిమిత్తం ఈ సెక్షన్స్ సూపర్డెంట్‌కి ఎండార్స్ చేయడం జరిగింది. ప్రజావాణి కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

కొత్తగూడెం కార్పొరేషన్ ఏర్పాటు బిల్లుకు ఆమోదం



- అసెంబ్లీలో ప్రకటించిన మంత్రి శ్రీధర్ బాబు
- సహకరించిన మంత్రులకు, అధికారులకు కూనంనేని కృతజ్ఞతలు

నవతెలంగాణ-కొత్తగూడెం
కొత్తగూడెం మున్సిపాలిటీ, పాల్వంచ మున్సిపాలిటీతోపాటు సుజాతనగర్ మండల పరిధిలోని ఏడు గ్రామ పంచాయతీలు కలుపుతూ కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తూ రాష్ట్ర అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బిల్లుకు ఆమోదం లభించింది. రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు ఈమేరకు రాష్ట్ర అసెంబ్లీలో ప్రకటించారు. కార్పొరేషన్ ఏర్పాటు బిల్లుకు ఆమోదం తెలపడంతో కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆనందం వ్యక్తం చేశారు. కార్పొరేషన్ ఏర్పాటుకు సహకరించిన రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డికి, ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్కకు, జిల్లా ఇంచార్జి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి, జిల్లా మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డికి, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అసెంబ్లీ ఆమోదం లభించడంతో గవర్నర్ ఆమోదంతో త్వరలో గెజిట్ విడుదల కానుంది. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ నియోజకవర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయాలనే సంకల్పంతోనే కార్పొరేషన్ ఏర్పాటు చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేసి సాధించానని, కొద్ది రోజుల్లోనే కొత్తగూడెం ప్రాంతం నగరాలకు తీసిపోని విధంగా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని తెలిపారు. తాను గెలిచిన 15 నెలల కాలంలోనే కార్పొరేషన్ సాధించి నియోజకవర్గ ప్రజలకు గెలుపు ఫలాలు అందించడం పట్ల అన్నివర్గాల్లో హర్షం వ్యక్తం అవుతోంది. కార్పొరేషన్ ఏర్పాటుకు నిరంతరం కృషి చేసిన ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా కృతజ్ఞతలు తెలిపారు.

శివాలయం ప్రధాన అర్చకులకు పితృవియోగం

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి
స్థానిక శివాలయం ప్రధాన అర్చకులు సత్యనారాయణ శర్మ తండ్రి రామచంద్రరావు శర్మ(84) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం వారి స్వగృహంలో మృతి చెందారు. సోమవారం ఆయన భౌతికకాయాన్ని కాంగ్రెస్ నాయకులు పర్స వెంకట్ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర నాయకులు మల్లెల నరసింహారావు సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారి కుటుంబానికి ధైర్యం చెప్పి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అదేవిధంగా ఆలయ సిబ్బంది సంపత్, మాజీ సర్పంచ్ బోడ పద్మ, సత్యం, పూర్ణ, ముక్తేశ్వరరావు నివాళులర్పించారు.

ఉన్నత చదువుల కోసం వెళ్లి అనంత లోకాలకు

- రోడ్డు ప్రమాదంలో సున్నంబట్టి యువకుడు మృతి

నవతెలంగాణ-దుమ్ముగూడెం



ఉన్నత చదువుల కోసం వెళ్ళిన ఆ యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో కుటుంబంలో, గ్రామంలో విషాదఛయలు అమ్ముకున్నాయి... మండలంలోని సున్నంబట్టి గ్రామానికి చెందిన బంటు రాజ్ కుమార్(19) హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో బీటెక్ ఫస్ట్ సెమ్ పూర్తి చేశాడు. ఈనెల 23న రాత్రి సుమారు 12 గంటల సమయంలో గోదావరిఖనికి చెందిన తోటి సీనియర్ విద్యార్థితో కలిసి డ్యూక్ ద్విచక్ర వాహనంపై బయటికి వెళ్లారు. బయటకు వెళుతున్న సమయంలో రాజ్ కుమార్ తండ్రి శ్రీనుకు ఫోన్ చేసి తాను బయటకు వెళుతున్నానని ఫోన్ పే ద్వారా డబ్బులు కావాలని అడిగినట్లు తెలిసింది. కాగా తన కుమారుడికి డబ్బులు అత్యవసరమని గమనించి తండ్రి శ్రీను ఫోన్ పే ద్వారా 100 రూపాయలు పంపాడు. బయటకు వెళ్లిన సమయంలో వాహనాన్ని అతివేగంగా నడిపి డివైడర్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో రాజ్ కుమార్ తో పాటు తోటి సీనియర్ విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందారు. కాగా సున్నంబట్టి గ్రామానికి చెందిన బంటు శ్రీను, లక్ష్మీ దంపతులకు ఒక కుమారుడు కూతురు కాగా మృతి చెందిన రాజ్ కుమార్ హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో బీటెక్ ఫస్ట్ సెమ్ పూర్తి చేశాడు.. కాగా కూతురు కావ్య ఖమ్మంలోని ప్రైవేటు పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది.. ఉన్నత చదువులు చదివి ఎంతో ఉజ్వల భవిష్యత్తు ఉన్న రాజ్ కుమార్ రోడ్డు ప్రమాదంలో మతి చెందడంతో కుటుంబంలో, గ్రామంలో విషాదఛాయలు అనుముకున్నాయని చెప్పవచ్చు.



జిల్లా ఎస్పీకి అవార్డు

- సీఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ చారుసిన్హా చేతుల మీదుగా డీజి డిస్క్ ప్రశంసా పత్రం అందజేత

నవతెలంగాణ-కొత్తగూడెం
2024లో జరిగిన పార్లమెంట్ ఎన్నికలు సజావుగా జరిగేలా కృషి చేసిన ఎస్పీ రోహిత్ రాజుకు అత్యుత్తమ పురస్కారం అందింది. సోమవారం సిఆర్పిఎఫ్ ఐజిపి చారుసిన్హా ప్రత్యేకంగా అభినందనలు తెలిపి డీజి డిస్క్, ప్రశంసా పత్రాన్ని అందజేశారు. హైదరాబాదులోని సిఆర్పిఎఫ్ సౌత్ సెక్టార్ కార్యాలయం నందు జరిగిన కార్యక్రమంలో ఎస్పీ రోహిత్ రాజు వీటిని స్వీకరించారు. నిషేధిత మావోయిస్టు ప్రభావిత జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లను చేసి సమర్థవంతంగా పార్లమెంట్ ఎన్నికలను పూర్తి చేసినందులకు గాను ఈ గుర్తింపు లభించింది. జిల్లాలో విధులు నిర్వర్తించే పోలీస్ అధికారులు, సిబ్బంది సమిష్టి కృషి వల్లనే పార్లమెంట్ ఎన్నికలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సమర్థవంతంగా పూర్తి చేయగలిగామని ఈ సందర్భంగా ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు. ఆవార్డు అందుకున్న ఎస్పీని జిల్లాలోని పలువురు అభినందనలు తెలిపారు.

కొత్తగూడెం స్పెషల్ జ్యుడిషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్‌గా మెండు రాజమల్లు నియామకం



నవతెలంగాణ-కొత్తగూడెం లీగల్
తెలంగాణ హైకోర్టు ఉత్తర్వుల మేరకు మెండు రాజమల్లును స్పెషల్ జ్యూడిషల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్‌గా నియమించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ ద్వారా నియామక ఉత్తర్వులు అందుకున్నారు. అనంతరం కొత్తగూడెం చీఫ్ జ్యూడిషల్ మేజిస్ట్రేట్(ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి) బత్తుల రామారావుకు నియామక ఉత్తర్వులు అందజేసి పదవి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్, స్పెషల్ జ్యూడిషల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ గొల్లపూడి భానుమతి, చీఫ్ జ్యూడిషల్ మేజిస్ట్రేట్ బత్తుల రామారావు, రెండవ అదనపు జ్యూడిషల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కే.సాయి శ్రీ, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెలగల నాగిరెడ్డి, రమేశ్ కుమర్ మాక్కడ్, అడ్వకేట్స్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

కార్మిక నేత టీవీఎన్‌వీ ప్రసాద్‌కు ఘన సన్మానం



నవతెలంగాణ-మణుగూరు
కార్మిక నేత, సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ బ్రాంచ్ అధ్యక్షులు, సీపీఐ(ఎం) మండల మాజీ కార్యదర్శి వర్గ సభ్యులు, వివిధ ప్రజాసంఘాలలో పనిచేసిన టీవీ ఎన్‌వీ ప్రసాద్ పదవీ విరమణ పొందారు. సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా పీకే ఓసీలో నలభై సంవత్సరాల పాటు సీనియర్ ఈపీ పిట్టర్‌గా పనిచేశారు. సోమవారం పీవీ కాలనీ గోల్డెన్ ఫంక్షన్ హాల్‌లో సింగరేణి అధికారులు, షావెల్స్ అండ్ డ్రిల్స్ సెక్షన్ సహోద్యోగులు, కార్మిక సంఘాల, రాజకీయ పార్టీల, ప్రజా సంఘాల, బంధుమిత్రుల ఆధ్వర్యంలో శాలువా పూలమాలలు, బహుమతులు, జ్ఞాపికలతో దంపతులు ప్రసాద్, సత్యవాణిలను సన్మానించారు. సీఐటీయూ ఏరియా కార్యదర్శి వల్లూరు వెంకటరత్నం అధ్యక్షతన జరిగిన సభలో పలువురు నాయకులు, అధికారులు మాట్లాడారు. సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిర్వహించిన పలు కార్మిక, ప్రజా పోరాటాలలో చురుకైన పాత్రను పోషించారని కొనియాడారు. ఆయన విశ్రాంత జీవితం ఆనందమయం కావాలని ఆకాంక్షిస్తూ దంపతులిద్దరికీ పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ ఆర్.శ్రీనివాస్, ఇంజనీర్లు ప్రవీణ్, సుధీర్, విజయరావు, కుమార్, సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ జిల్లా నాయకులు అన్నవరపు కనకయ్య, బ్రహ్మచారి, నెల్లూరి నాగేశ్వరరావు, హైమావతి, వి.వెంకటరత్నం, ఎం.లక్ష్మణరావు, గద్దల శ్రీనివాస్, కొడిశెల రాములు, సత్రపల్లి సాంబ, నిమ్మగడ్డ లక్ష్మణరావు, వెంకట్రావు, టీడీపీ నాయకులు వాసిరెడ్డి చలపతిరావు, వట్టం నారాయణ, కార్మిక నాయకులు, ఏఐటీయూసీ మేకల ఈశ్వర్, ఆవుల నాగరాజు, ఎస్.కుమారస్వామి, పెద్ద ఎత్తున ఉద్యోగులు, బంధుమిత్రులు, ప్రజాసంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదివాసీల అస్తిత్వం కోసం ఐక్యంగా ఉద్యమిస్తాం

- ఆదివాసీ సంఘాల ఐక్యవేదిక



నవతెలంగాణ-భద్రాచలం రూరల్
ఆదివాసీల అస్తిత్వాన్ని నీరుగార్చేలా కొన్ని శక్తులు కుట్రలు పన్నుతున్నాయని, వారి కుట్రలను భగ్నం చేసేలా ఆదివాసీల సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుతూ అస్తిత్వాన్ని కాపాడడం కోసం అందరూ కూడా ఐక్యంగా కలిసి ముందుకు సాగుతామని ఆదివాసీ సంఘాల ఐక్యవేదిక జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా భద్రాచలం ఐటిడిఏ ప్రాంగణంలో ఆదివాసీ జేఏసీ నాయకులు అడ్వకేట్ పాయం రవివర్మ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆదివాసీ సీనియర్ నాయకులు పూనెం వీరభద్రం మాట్లాడుతూ.. అర్హతలేని కొన్ని కులాలు షెడ్యూల్ ట్రైబ్స్‌గా చలామణి అవుతూ మేమే అసలైన షెడ్యూల్ ట్రైబ్స్ అనే విధంగా వ్యవహరిస్తూ అసలైన ఆదివాసీ తెగలు కోయ కొండ రెడ్డి నాయకపోడు తెగలను విస్మరిస్తూ ముందుకు వెళ్లే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. అదే విధంగా ఆదివాసీ నాయకులు ముర్ల రమేష్ రెడ్డి మాట్లాడుతూ.. అసలైన ఆదివాసీ తెగల దేవతలను సంస్కృతి సాంప్రదాయాలను ముందు తరాలకు తెలిసే విధంగా కృషి చేస్తున్న ఐటిడిఏ అధికారులకు అభినందనలు తెలుపుతుందన్నారు. అధికారులకు సంఘాల ఐక్యవేదిక ఎప్పటికీ పూర్తి సహకారాలు అందిస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు పూనెం కృష్ణ దొర, పూనేం నాగేశ్వరరావు, వీసాల కృష్ణయ్య, కల్లూరి జయబాబు, కొంద్రు సుధారాణి, కుంజా రమాదేవి, జగ్గ పుల్లయ్య, చిచ్చడి సత్యనారాయణమూర్తి, కోర్స చిన్నబాబు దొర,ఉమ్మల దుర్గారెడ్డి, సోంది రవికుమార్, వాసం వీరభద్రం మరియు ఆదివాసి నాయకులు పాల్గొన్నారు.

రోడ్లపైకి చేరుతున్న మురుగునీరు

- సైడ్ డ్రెయిన్ నిర్మించండి
- జగదీష్ కాలనీ ఎల్బీజీ నగర్ నందు స్థానిక సమస్యలపై సీపీఐ(ఎం) సర్వే



నవతెలంగాణ-భద్రాచలం రూరల్
జగదీష్ కాలనీ శివారు ఎల్బీజీ నగర్ గుట్టపై గల ప్రాంతంలో డ్రయినేజీ నిర్మించకపోవడం వల్ల మురుగునీరు రోడ్లపైకి వచ్చి తీవ్ర దుర్వాసన వస్తుందని చుట్టుపక్కల ప్రజలు పిల్లలు రోగాల బారిన పడుతున్నారని సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అన్నారు. భద్రాచలం పట్టణం 19వ వార్డు కమిటీ ఆధ్వర్యంలో జగదీష్ కాలనీ శివారు ప్రాంతంలో సీపీఐ(ఎం) బృందం స్థానిక సమస్యలపై సర్వే నిర్వహించింది. ప్రజలు పలు రకాల సమస్యలు సర్వే బృందం దృష్టికి తీసుకొచ్చారు. ఎల్బీజీ నగర్ శివారు లైన్‌లో మిషన్ భగీరథ పైపులు వేయకపోవడంతో మంచినీరు అందడం లేదని వాపోయారు. వీధిలైట్లు వేయటం లేదని అన్నారు. రేషన్ కార్డులు, పింఛన్లు, ఇంటి పన్నులు తదితర సమస్యలు సర్వే బృందం దృష్టికి వారు తీసుకువచ్చారు. సీపీఐ(ఎం) సర్వేలో వచ్చిన సమస్యల పరిష్కారం కోసం ప్రజల మద్దతుతో కృషి చేస్తామని పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు వార్డు కన్వీనర్ డి.సీతాలక్ష్మి, శాఖ కార్యదర్శి డి.రామకృష్ణ, కుమార్, శ్రీనివాస్, పాల్గొన్నారు.

కేంద్ర పాలకుల నుండి దేశాన్ని రక్షించాలి

- "భగత్ సింగ్ లౌకిక సందేశ్ యాత్ర" ముగింపు కార్యక్రమంలో సీపీఐ(ఎం)



నవతెలంగాణ-ఇల్లందు
స్వాతంత్ర్య సమరయోధులు నాడు బ్రిటీషు వారి నుండి దేశాన్ని రక్షించారని, నేడు ప్రస్తుత పాలకుల నుండి దేశాన్ని రక్షించాల్సిన అవసరం ఉందని సీపీఐ(ఎం) జిల్లా నాయకులు అబ్దుల్ నబీ అన్నారు. షహీద్ భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలో భారీ ర్యాలీ కాగడాలతో పురవీధులలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం "భగత్ సింగ్ లౌకిక సందేశ్ యాత్ర" ముగింపును పుచ్చలపల్లి సుందరయ్య స్థూపం వద్ద సభ పార్టీ మండల కార్యదర్శి ఆలేటి కిరణ్ కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సభలో పార్టీ జిల్లా నాయకులు అబ్దుల్ నబీ పాల్గొని మాట్లాడుతూ స్వాతంత్ర్య సంగ్రామంలో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌లు అసువులు బాసారని అన్నారు. బ్రిటిష్ పార్లమెంట్‌లో సైమన్ కమీషన్‌కు వ్యతిరేకంగా పొగ బాంబు వేశారని, బ్రిటీష్ పాలకులు వారికి ఉరి శిక్ష వేసినా ఉరి కంబాన్ని ముద్దాడారని అన్నారు. బ్రిటీషు వారి కబంధ హస్తాల నుంచి దేశాన్ని రక్షించిన నేతల వర్ధంతి సందర్భంగా పార్టీ లౌకిక సందేశ్ యాత్రను పట్టణ మండల గ్రామాలలో సభలు జరిపామని అన్నారు. ప్రజా పోరాటాలలో పాల్గొనడమే భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌లకు అర్పించే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో తాళ్లూరి కృష్ణ, మన్యం మోహన్ రావు, ఆలేటి సంధ్య, సర్వన్ కుమార్, మాదారపు వెంకటేశ్వర్లు, మరియా, వాసం రాము, వెంకటమ్మ మాధవి, వజ్జ సురేష్, సుజాత, సంతోష, వెంకన్న, కమల, వీరభద్రం, సత్యనారాయణ కోరి తదితరులు పాల్గొన్నారు.



జర్నలిస్టులకు స్థలాలు ఇచ్చేంతవరకూ అండగా ఉంటాం



- బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు

నవతెలంగాణ-కొత్తగూడెం
కొత్తగూడెంలో జర్నలిస్టులకు ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని వారికి ఇచ్చేంతవరకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని పినపాక మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ భద్రాది కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు స్పష్టం చేశారు. సోమవారం ఇండ్ల స్థలాల కోసం గత ఐదు రోజులుగా కొత్తగూడెంలో జర్నలిస్టుల చేస్తున్న నిరసన శిబిరాన్ని ఆయన సోమవారం ఆయన సందర్శించి జర్నలిస్టులకు మద్దతు పలికి సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు జర్నలిస్టుల సంక్షేమం కోసం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇండ్ల స్థలాలు ఇవ్వాలని ఆదేశించగా కొత్తగూడెంలోని గంగాభిషాన్ బస్తీలో (సింగరేణి మ్యాగ్జిన్) 10 ఎకరాల 18 గుంటల స్థలాన్ని కేటాయించడం జరిగిందని గుర్తుచేశారు. ఎన్నికలు రావడంతో కాంగ్రెస్ పార్టీ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తామని వాగ్దానంతో గద్దెనెక్కడం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరమైనప్పటికీ జర్నలిస్టులకు ఇవ్వాల్సిన స్థలాన్ని ఇవ్వకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మభ్యపెడుతున్నారన్నారు. జర్నలిస్టుల కోసం కేటాయించిన స్థలాన్ని ఎటువంటి షరతులు లేకుండా అప్పగించాలని బీఆర్ఎస్ పార్టీ తరపున డిమాండ్ చేశారు. లేనిచో స్థలాన్ని వాళ్ళకి అప్పగించేంతవరకు బీఆర్ఎస్ పార్టీ జిల్లా వ్యాప్త ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్పర్సన్ కాపు సీతాలక్ష్మి, చుంచుపల్లి మాజీ ఎంపీపీ బాదావత్ శాంతి, లక్ష్మీదేవి పల్లి బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కొట్టి వెంకటేశ్వర్లు, నాయకులు లావుడియా సత్యనారాయణ, అనుదీప్, హుస్సేన్, తొగరు రాజశేఖర్ పాల్గొన్నారు. అదేవిధంగా బిజెపి జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి నిరసన శిబిరాన్ని సందర్శించి జర్నలిస్టులకు అండగా ఉంటామని ప్రకటించారు. బీసీ సంక్షేమ సంఘం, ఎల్ హెచ్ పి ఎస్ వివిధ సంఘాల నాయకులు జర్నలిస్టులకు తమ మద్దతును తెలిపారు.

మంగళబోడులో వైద్యశిబిరం



నవతెలంగాణ-చండ్రుగొండ
మద్దుకూరు శివారు వలస ఆదివాసీల నివాస గ్రామం మంగళబోడులో ప్రత్యేక ఆరోగ్య శిబిరం, ఫీవర్ సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా మలేరియా ప్రోగ్రాం అధికారిణి డాక్టర్ స్పందన, అసిస్టెంట్ మలేరియా అధికారి కుమారస్వామి ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎర్రగుంట వైద్యురాలు డాక్టర్ ప్రియాంక సిబ్బంది బృందంగా వెళ్లి శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో జ్వర పీడితులకు రక్తనమునాలు సేకరించి అవసరమైన వారికి చికిత్సలు అందించారు. గర్భిణీలకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు ఇచ్చారు. జిల్లా మలేరియా ప్రోగ్రామ్ అధికారిణి డాక్టర్ స్పందన మాట్లాడుతూ వలస ఆదివాసీలు గ్రామంలోనికి ఎప్పుడు వస్తున్నారు తిరిగి ఎప్పుడు వెళుతున్నారో పూర్తి సమాచారాన్ని ఆరోగ్య సిబ్బంది రిజిస్టర్‌లో నమోదు చేయాలని తెలియజేశారు. వేరే ప్రాంతాల నుండి వచ్చిన ఆదివాసీలకు రక్త పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి చికిత్సలు అందించవలసిందిగా తెలియజేశారు. స్థానిక ఆరోగ్య కార్యకర్త, ఆశా కార్యకర్తలు వారిపై నిఘా ఉంచి రోజువారిగా పరిశీలించి నివేదికలు సమర్పించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కుమార్ స్వామి, జయలక్ష్మి, ప్రకాష్ రావు, రామదాసు, భవాని, హారిక, విజయలక్ష్మి, శంకర్, నాగరాజు పాల్గొన్నారు.



వసతి గృహాలను తనిఖీ చేసిన న్యాయమూర్తి జి.భానుమతి

నవతెలంగాణ-కొత్తగూడెం లీగల్
జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి సోమవారం పడమటి నర్సాపురంలోని ఆశ్రమ గర్ల్స్ హై స్కూల్, పోస్టుమెట్రిక్ గిరిజన బాలికల వసతిగృహం, జూలూరుపాడులో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల వసతి గృహాలను ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన సదుపాయాలు కల్పించాలని వార్డెన్స్‌కు ఆదేశించారు. ఈ సందర్భంగా వసతి గృహంలోని తరగతి గదులు, కిచెన్ రూం, స్టోర్ రూమ్ లను న్యాయమూర్తి పరిశీలించారు. హాస్టల్ పరిసరాల పట్ల ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, సౌచాలయాలు శుభ్రంగా ఉంచుకోవాలని హాస్టల్, ప్రిన్సిపాల్, వార్డెన్‌ను ఆదేశించారు.



టైంనార్‌లో వెలిగిన విద్యుత్ బల్బు

- 77 సంవత్సరాల స్వాతంత్ర్య భారతావనిలో తొలిసారిగా వెలుగులు

నవతెలంగాణ-చర్ల
సరిహద్దు చత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా మారుమూల గ్రామమైన టైంనార్‌లో 77 సంవత్సరాల స్వాతంత్ర్య భారతావనిలో విద్యుత్ లైట్లు వెలిగాయి. ముఖ్యమంత్రి మజ్రా తోలా విద్యుదీకరణ పథకం కింద విద్యుదీకరణ చేయబడింది. ఈ అద్భుతమైన విజయం మావోయిస్టులు అంతం కావడానికి ఈ ప్రాంతంలో అభివృద్ధి, శాంతి శ్రేయస్సుకు సంకేతం అని పలువురు విశ్వసిస్తున్నారు. మొత్తం 53 గృహాలకు 100 శాతం విద్యుదీకరణతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. టైంనార్ గ్రామస్తులు తరతరాలుగా విద్యుత్ వెలుగును చూడలేదు. ఇప్పుడు రావడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. "మా గ్రామానికి మొదటిసారిగా విద్యుత్ సరఫరా అందుబాటులోకి వచ్చింది మేము ఇకపై రాత్రి చీకటికి భయపడము అడవి జంతువులు, పాములు, తేళ్ల బెదిరింపుల నుండి విముక్తి పొందామని స్థానికులు చెబుతున్నారు. మా పిల్లలు ఇప్పుడు సులభంగా చదువుకోవచ్చు, చివరకు మేము అభివృద్ధి మార్గంలో భాగమైనట్లు భావిస్తున్నాము." అని ఆనందాన్ని వ్యక్తపరుస్తున్నారు.

చెల్లని చెక్కు కేసులో 6 నెలలు జైలు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాచలం జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మ్యాజిస్ట్రేట్ కోర్టు జడ్జి వి.శివనాయక్ చెక్కు కేసులో ఆరు నెలలు జైలు శిక్ష, రూ.2,60,000 జరిమానా సోమవారం విధించారు. సారపాకకు చెందిన జాదవుల కనకయ్య వద్ద బయ్యారానికి చెందిన నాగారపు వెంకటేశ్వర్లు చెక్ హామీగా పెట్టి రూ.2,60,000 తీసుకున్నాడు. ఆ చెక్ బ్యాంకులో వేయగా చెక్ బౌన్స్ అయింది. సదరు జాదువుల కనకయ్య కోర్టులో కేసు వేశారు. సదరుకోర్టులో వాదపవాదములు అనంతరం ముద్దాయి నగరపు వెంకటేశ్వర్లుకు శిక్ష విధించారు. ఫిర్యాదు దారుడు తరుపున ప్రముఖ న్యాయవాది ముత్యాల కిషోర్ కేసు వాదించారు.



భద్రాద్రి రామయ్యను దర్శించుకున్న మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి

భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని మద్రాస్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి వి.శివజ్ఞానం సోమవారం దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి రామాలయానికి విచ్చేసిన మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తికి ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. గర్భాలయం జుట్టు గిరి ప్రదర్శన నిర్వహించిన న్యాయమూర్తి మూలమూర్తుల ముందు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం లక్ష్మీ తయారు కోవెలలో న్యాయమూర్తి కుటుంబ సభ్యులకు సహస్రనామ గోత్రనామ పూజ నిర్వహించిన అర్చక స్వాములు స్వామివారి తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ శివ నాయక్ పాల్గొనగా భద్రత ఏర్పాట్లను పట్టణ సీఐ రమేష్ పర్యవేక్షించారు.

నేడు వారాంతపు సంత వేలం పాట

నవతెలంగాణ-టేకులపల్లి

మండల కేంద్రమైన టేకులపల్లి, గోల్యా తండా గ్రామ పంచాయతీల పరిధిలో గల శ్రీ కోదండరామలయం ఆవరణలో ప్రతి శనివారం నిర్వహించే సంత బహిరంగ వేలం పాట ఈ నెల 25న ఉదయం 11 గంటలకు టేకులపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు రెండు గ్రామపంచాయతీల కార్యదర్శులు ఉప్పు దీప్తి, వాసం ప్రశాంత్‌లు సోమవారం తెలిపారు. సంత వేలంపాట నియమనిభందనలు, వేలంలో పాల్గొనువారు గ్రామపంచాయతీకి ఎటువంటి బాకీ ఉండరాదని, ఉన్నచో పాటలో పాల్గొనుటకు అనర్హులని తెలిపారు. వేలంలో పాల్గొనువారు నేడు ఉదయం 10.30 గంటల లోపు ముందుగా రూ.50000 డిపాజిట్ చేయవలెనని, పాట రానియెడల డిపాజిట్ తిరిగి ఇవ్వబడునని తెలిపారు. పాట పాడిన వారు సంత స్థలమును, సంత జరిగిన మరుసటి రోజు తప్పనిసరిగా శుభ్రం చేయించాలన్నారు.

ఉచితంగా కళ్ళజోళ్ళ పంపిణీ

నవతెలంగాణ-మణుగూరు



ఏరియా ఆసుపత్రి మణుగూరు నందు కంటి ఆపరేషన్లు చేయించుకున్న వారికి కళ్ళజోళ్ళ పంపిణీ చేసినట్టు నేత్ర వైద్యాధికారి జి.సంజీవరావు తెలిపారు. సోమవారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ భద్రాచలం, పుష్పగిరి కంటి ఆసుపత్రి సికింద్రాబాద్ వారి సంయుక్త సహకారంతో జనవరి 5వ తారీఖున కంటి ఆపరేషన్లు చేయించుకున్న పగిడేరు గ్రామ వాసులకు మణుగూరు ఏరియా హాస్పిటల్ నందు ఉచిత కళ్ళజోళ్ళ పంపిణీ చేశారు. కంటి వైద్య శిబిరంలో సుమారు వందమందికి కంటి పరీక్షలు నిర్వహించి 30 మందిని కంటి ఆపరేషన్ల కొరకు సిద్ధం చేసినట్లు మణుగూరు ఏరియా ఆసుపత్రి ఆప్తాల్మిక్ ఆఫీసర్ జి.సంజీవరావు తెలియజేశారు. ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్ వేసవికాలంలో పాటించవలసిన ఆరోగ్య సూత్రాలు, నియమాలు తెలియజేసినారు. ఆపరేషన్ చేయించుకున్న వారందరికీ కళ్ళజోళ్ళు పంపిణీ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆప్తమిక్ ఆఫీసర్ జి.సంజీవరావుతో పాటు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల అక్రమ అరెస్టులను ఖండించండి : సీఐటీయూ

నవతెలంగాణ-ఇల్లందు




తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం హైదారాబాద్ కమిషనరేట్‌కు వెళ్లిన ఆశా వర్కర్‌ల పట్ల రాష్ట్ర ప్రభుత్వం పోలీసులను ప్రయోగించి ఎక్కడి కక్కడ దొరికిన వారిని దొరికినట్లు మహిళలు అని చూడకుండా ప్రభుత్వం నిర్బంధించడం సరి కాదని సీఐటీయూ జిల్లా నాయకులు తాళ్లూరి కృష్ణ, మండల నాయకురాలు కళ్లేపల్లి మరియా అన్నారు. తాము అధికారంలోకి వచ్చాక స్కీమ్ వర్కర్ల వేతనాలు పెంపుదల చేస్తామని, మాది ప్రజా ప్రభుత్వం అని గొప్పలు చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని అడిగినందుకు నిర్బంధం విధించడం సరి కాదని వారు అన్నారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ మినీ నుండి మెయిన్ టీచర్లగా అప్ గ్రేడ్ అయిన టీచర్ల కు సగం జీతమే ఇవ్వడం ఎంతవరకు సమంజసం కాదన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో షేక్ ఫాతిమా, అరుణ, పార్వతి, సుజాత, సమత, సరిత సునీత, అరుణ తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక విద్యతోనే భవిష్యత్తుకు పునాది

నవతెలంగాణ-టేకులపల్లి



ప్రాథమిక స్థాయిలోనే పిల్లల్లో విద్యా భోధనపునాదిగా మారుతుందని ఎంఈఓ ఎ.జగన్ అన్నారు. సోమవారం బొమ్మనపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి విద్యార్థులకు ఫేర్వెల్ ఫంక్షన్ కార్యక్రమంలో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని ఉచితంగా ఇస్తున్నారని, గతంలో కంటే ఎన్నో మార్పులు వచ్చాయని, వచ్చే విద్యా సంవత్సరం నుంచి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్(ఏఐ) ద్వారా విద్యాబోధన జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశం ద్వారా విద్యార్థులు సర్వతో ముఖాభివృద్ధికి అవకాశం ఏర్పడుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బహుమతులను, సర్టిఫికెట్లను అందజేశారు. స్కూల్ హెచ్ఎం ఎం.జ్యోతిరాణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో టీచర్లు జర్పల పద్మ, నీరజ షారోన్, సీఆర్పీ అబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి

- సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ప్రదర్శన

నవతెలంగాణ-దమ్మపేట

దమ్మపేట పట్టణంలో సీపీఐ(ఎం) మండల కమిటీ ఆధ్వర్యంలో భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 94వ వర్ధంతి సందర్భంగా కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ముందుగా పార్టీ కార్యాలయం సుందరయ్య భవన్‌లో పార్టీ మండల కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు అధ్యక్షతన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ సుఖదేవ్‌ల చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ మాజీ సభ్యులు దొడ్డ లక్ష్మీనారాయణ, మొరంపూడి శ్రీనివాస్‌రావులు మాట్లాడుతూ తెల్లదొరలను గడగడలాడించిన భగత్‌సింగ్ స్ఫూర్తితో భవిష్యత్తు ఉద్యమాలు నిర్వహించాలని అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు రావుల శోభన్ బాబు, కొప్పుల శ్రీనివాసరావు, భోగ్యం నరసింహారావు, కొలికిపోగు శ్రీనివాసరావు, మోటేపల్లి ధర్మయ్య, బ్రహ్మయ్య, దాట్ల అశోక్ కుమార్, అనిల్ కుమార్, ప్రశాంత్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో విద్యుత్ కోతలు ఉండొద్దు

- ఎస్ఈ ఇ.మహేందర్

నవతెలంగాణ-చర్ల



వేసవికాలం దృశ్య ఎటువంటి విద్యుత్ కోతలు లేకుండా వినియోగదారునికి నాణ్యమైన విద్యుత్ని అందించాలని ఎస్ఈ ఇ.మహేందర్ సూచించారు. విద్యుత్ అంతరాయం కలగకుండా చూడ్డంతో పాటు విద్యుత్ ప్రమాదాలు నివారించడానికి విద్యుత్ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. రానున్న గాలి దుమారం రోజులలో చాలా అలర్ట్‌గా ఉంటూ విద్యుత్ అంతరాయాలు లేకుండా వినియోగదారులకు ప్రత్యేకమైన సర్వీస్ అందించాలని ఆయన విద్యుత్ అధికారులకు తెలిపారు. సోమవారం సమ్మర్ ఆక్షన్ ప్లాన్‌లో భాగంగా ఆయన డివిజనల్ ఇంజినీర్ భద్రాచలం జీవన్ కుమార్, అసిస్టెంట్ డివిజన్ల ఇంజినీర్ ప్రభాకర్ రావులతో కలిసి లో వోల్టేజి నియంత్రణ కొరకు చర్ల మండలంలో ఒక 100 కేవీఏ, 63 కెవిఎ, ఐదు 25 కెవిఎ సామర్థ్యం గల నూతన ట్రాన్స్ఫార్మర్లను ప్రారంభించి ఆయన మాట్లాడారు. నిర్మాణపరమైన అతి సాధారణమైన విద్యుత్తు కోతలు తప్ప విద్యుత్ కోతలు ఏమీ ఉండవని నిరంతరాయంగా విద్యుత్ అందించడానికి టీఎస్ పిడీసీఎల్ నిరంతరాయంగా శ్రమిస్తుందని ఆయన తెలిపారు. ఎస్ఈతో విద్యుత్ శాఖ ఏఈ వెంకటేశ్వర్లు, లైన్మెన్లు విజయ్, సిబ్బంది ఉన్నారు.

పది పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- మల్లెల మడుగు పరీక్షా కేంద్రం పరిశీలన
- మునగ తోట, తుమ్మల చెరువును సందర్శించిన కలెక్టర్

నవతెలంగాణ-అశ్వాపురం



పది పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. సోమవారం మండలంలో విస్తృతంగా పర్యటించిన ఆయన తొలుత మల్లెలమడుగులోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని సందర్శించి పరీక్షలు జరుగుతున్న తీరుతెన్నులను పరిశీలించారు. పరీక్షలు జరుగుతున్న అన్ని గదులను కలియ తిరిగారు. విద్యుత్, తాగునీరు తదితర మౌలిక వసతులను క్షుణ్ణంగా పరిశీలించారు. అదేవిధంగా చీఫ్ సూపరింటెండెంట్‌కి పలు సూచనలు చేశారు. పరీక్షలు ముగిసేంత వరకు అప్రమత్తతతో విధులు నిర్వర్తించాలన్నారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ అధికారులకు తెలిపారు. అనంతరం నెల్లిపాక బంజరులోని రైతు మన్రు రామకృష్ణ సాగు చేస్తున్న మునగ తోటను సందర్శించి పరిశీలించారు. రైతుతో మాట్లాడి పలు విషయాలు తెలుసుకున్నారు. అక్కడి నుండి తుమ్మలచెరువు కెళ్ళిన ఆయన అక్కడ జరుగుతున్న బోట్ షికారులను పరిశీలించి నిర్వాహకులతో మాట్లాడారు. అదేవిధంగా మిట్టగూడెం పాయం మంగయ్య గుంపును సందర్శించి కొరస సోనీ, దుర్గారావు పెంచుతున్న కొర్రమీను చేపల పెంపకాన్ని పరిశీలించారు. కొర్రమేను చాపలను పెంచే వారిని డ్వాక్రా సంఘాల ద్వారా ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు. అలాగే మణుగూరు భారజల కర్మాగారాన్ని సందర్శించిన ఆయన కర్మాగారం నుండి వధాగా పోతున్న నీరును యాష్ ప్లాంట్‌ను పరిశీలించారు. వధా నీటిని వినియోగంలోకి తెచ్చే విధంగా చూడాలన్నారు. నిర్వహణ బాధ్యత డ్వాక్రా సంఘాలకు అప్పగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అశ్వాపురం తహశీల్దార్ స్వర్ణ, ఎండిఓ వరప్రసాద్, ఐకెపి ఎపిఎం శ్రీరాం సత్యనారాయణ, ఎంపీఓ ముత్యాలరావు, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో సీతారామయ్య పాల్గొన్నారు.

టీబీని తరిమికొట్టాలి

నవతెలంగాణ-కొత్తగూడెం



టీబీని తరమికొట్టాలంటే వ్యాధి గ్రస్తులు మందు క్రమం తప్పకుండా వాడాలని కొత్తగూడెం అడిషనల్ కలెక్టర్ డి.వేణుగోపాల్ అన్నారు. సోమవారం "వరల్డ్ టీబీ డే" సందర్భంగా కొత్తగూడెంలో ఆయన జండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి డాక్టర్ భాస్కర్ నాయక్ క్షయ వ్యాధి లక్షణాలు, ఎవరికైనా రెండు వారాల నుంచి దగ్గు, జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గటం, దగ్గినప్పుడు తేమడ పడటం, తెమడలో రక్తం పడటం, గడ్డలు వంటివి ఉన్నట్లయితే దగ్గరలోని హాస్పిటల్‌కి వెళ్లి తేమడ పరీక్షలు చేయించుకొని వ్యాధి నిర్ధారణ జరిగిన తర్వాత ఆరు నెలలు క్రమం తప్పకుండా మందులు వాడితే వ్యాధిని పూర్తిగా నివారించవచ్చునని తెలిపారు. మందులు వాడుతున్నంతకాలం ప్రతినెల రూ.1000 పోషణ భత్యం నిమిత్తం నిక్షయ పోషణ యోజన పథకం ద్వారా నేరుగా పేషెంట్ ఎకౌంట్‌లో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బాలాజీ, డాక్టర్స్, నర్సింగ్ కాలేజ్ విద్యార్థులు, ఏఎన్ఎం, ఆశ వర్కర్స్, టీబి ఎలార్ట్ ఇండియా ఎన్‌జిఓ ఎన్‌టిఇపీ సిబ్బంది పాల్గొన్నారు.

విలేకరులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలి : బీఆర్ఎస్

నవతెలంగాణ-చర్ల



అర్హులైన విలేకర్లందరికీ వెంటనే ఇండ్ల స్థలాలు ఇవ్వాలని బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు, కో కన్వీనర్ ఐనవోలు పవన్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో కన్వీనర్ మాట్లాడారు. ఇండ్ల స్థలాల కోసం కొత్తగూడెంలో విలేకరులు నిరాహార దీక్షలు చేస్తున్నారని, వారికి చర్ల మండల బీఆర్‌యస్ పార్టీ మండల కమిటీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామని ఆయన తెలిపారు. కాంగ్రెసు ప్రభుత్వం ఎలక్షన్‌లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తున్నామని ఆయన అన్నారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు ఎస్‌డీ అజీజ్, గోరంట్ల వెంకటేశ్వరావు, కాకి అనిల్, పంజా రాజు, తడికల బుల్లేబ్బాయి, అంబోజి సతీష్, సృజన కుమార్, కుక్కడపు సాయి, కిషోర్ కుమార్ పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతంగా పగిడేరు

- కలెక్టర్ జితేష్ వి.పాటిల్

నవతెలంగాణ-మణుగూరు

పగిడేరు గ్రామాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతానని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు సోమవారం మణుగూరు మండలం పగిడేరు గ్రామపంచాయతీలో వేడి నీటి బుగ్గల ప్రదేశాలను, జియో థర్మల్ ప్లాంట్‌ను కలెక్టర్ సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పగిడేరు జియోధర్మల్ కేంద్రం వద్ద వెల్ నెస్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సింగరేణి, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. రథం గుట్ట అర్బన్ పార్క్, పీవీ కాలనీ అంబేద్కర్ పార్క్, సింగరేణి మైన్స్ కొండాయిగూడెం గోదావరి, పగిడేరు వేడి నీటి బుగ్గలను ఒక ప్యాకేజీ రూపంలో మణుగూరు మండలాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఆ దిశగా ముందడుగు అధికారులను ఆదేశించారు. అనంతరం సాంబాయిగూడెం ఇసుకరాంపుల రికార్డులను పరిశీలించారు. నియమ నిబంధనలు ప్రకారం ఇసుక రవాణా జరగాలని ఆదేశించారు. ఓవర్ లోడ్ జీరో ఇసుక రవాణాకు తావు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాఘవరెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీఓ పల్నాటి వెంకటేశ్వరరావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



మతోన్మాదం నుంచి దేశాన్ని కాపాడటమే అమరులకు ఇచ్చే నివాళి : సీపీఐ(ఎం)

నవతెలంగాణ-ఖమ్మంరూరల్



మతోన్మాదం నుండి దేశాన్ని కాపాడడమే అమరవీరులకు ఇచ్చే నిజమైన నివాళని సీపీఐ(ఎం) సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ పిట్టల రవి అన్నారు. మండలంలోని వరంగల్ క్రాస్ రోడ్, మద్దులపల్లి గ్రామాల్లో భగత్ సింగ్, రాజగురు, సుఖ్ దేవ్ 94వ వర్ధంతిని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పిట్టల రవి మాట్లాడారు. దేశ సమగ్రత, మత సామరస్యం, ఆర్థిక స్వాతంత్ర్యం కోసం ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని, తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన వీరులను నేటి యువత పట్టించుకోకపోవడం చాలా బాధాకరమన్నారు. ప్రతి ఒక్కరూ నిజమైన వీరుల చరిత్రను తెలుసుకోవాలన్నారు. ఫేక్ వార్తలతో పబ్బం గడుపుతున్న మతోన్మాదుల చర్యలను తిప్పి కొట్టాలన్నారు. వాట్సప్, ఫేస్‌బుక్‌లలో వచ్చే ఫేక్ వార్తలు నమ్మవద్దని, పుస్తకాలు చదివి నిజమైన చరిత్రను తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం ఖమ్మం రూరల్ మండల కార్యదర్శి ఉరడీ సుదర్శన్‌రెడ్డి, నంద్ర ప్రసాద్, నాయకులు పొన్నెకంటి సంగయ్య, పెరుమళ్ళపల్లి మోహన్ రావు, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, ఉదయ్, వీర బ్రహ్మచారి, సతీష్, నరసింహారావు, బుచ్చి రాములు, వీరబాబు, లాలయ్య, వెంకటరెడ్డి, రమణ, సుధాకర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిని అరికట్టడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలి

జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కళావతి బాయి

నవతెలంగాణ-ఖమ్మం



క్షయ వ్యాధిని అరికట్టడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కళావతి బాయి పిలుపునిచ్చారు. సోమవారం నగరంలో జిల్లా ప్రధాన ఆసుపత్రిలో క్షయ నిర్మూలన గురించి జిల్లా క్షయ నిర్మూలన అధికారి డాక్టర్ వరికుటి సుబ్బారావు ఆధ్వర్యంలో జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షయ వ్యాధిని అరికట్టడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని, టీబీ వ్యాధి లక్షణాలు చికిత్స విధానం గురించి వివరించారు. జిల్లా పంచాయతీ అధికారి ఆశలత మాట్లాడుతూ క్షయ వ్యాధిని అరికట్టడంలో వారు కూడా తమ వంతు బాధ్యతను నిర్వహిస్తామని, ప్రతి నెల టిబి వ్యాధి పైన సమీక్ష కూడా చేస్తామని తెలిపారు. జిల్లా క్షయ నిర్మూలన అధికారి డాక్టర్ వరికుటి సుబ్బారావు మాట్లాడుతూ 2 వారాలకు మించి దగ్గు ఉన్న, రాత్రి పూట చమటలు పట్టిన, ఆకలి మందగించటం వంటివి క్షయ వ్యాధి లక్షణాలని సూచించారు. పైన తెలిపిన లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ఆరోగ్య కేంద్రం వద్ద ఉచితంగా తేమాడ పరీక్ష చేయించుకోవాలి అన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరావు, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్, చిన్నపిల్లల విభాగం డాక్టర్ బాబు రత్నాకర్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్, డాక్టర్లు రామారావు, వెంకటరమణ, మోహన్ రావు, మమత కళాశాల నర్సింగ్ విద్యార్థులు, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థులు, అభ్యుదయ నర్సింగ్ కాలేజీ విద్యార్థులు, పులిపాటి నర్సింగ్ విద్యార్థులు, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల, సత్తుపల్లి విద్యార్థులు వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

జర్నలిస్టు కుటుంబ సభ్యులందరికీ హెల్త్ కార్డులు

నవతెలంగాణ-ఖమ్మం



జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్) పనిచేస్తోందని, జర్నలిస్టు కుటుంబ సభ్యులందరూ తప్పకుండా హెల్త్ కార్డులు తీసుకోవాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టిజెఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్రా రవి కోరారు. సోమవారం ఖమ్మం ప్రెస్ క్లబ్‌లో మూడు రోజుల పాటు ఈనెల 24 నుండి 26 వరకు కొనసాగనున్న జర్నలిస్టుల హెల్త్ కార్డు జారీ ప్రక్రియ క్యాంప్ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్రా రవి మాట్లాడుతూ... రాత్రింబవళ్లు విధి నిర్వహణలో ఉంటూ, ఉరుకుల పరుగుల జీవితంలో కంటికి నిద్ర లేకుండా పని జర్నలిస్టులకు తప్పకుండా హెల్త్ కార్డు కలిగి ఉండాలని సూచించారు. ఎవరో వస్తారు.. మరెవరో ఆదుకుంటారని వారికోసం ఎదురు చూస్తే ప్రయోజనం ఉండదని, మనకున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, ఐదు లక్షలు విలువైన వైద్యాన్ని ఉచితంగా ఈ కార్డు ద్వారా పొందవచ్చని, జర్నలిస్టులు వారి కుటుంబ సభ్యులు తప్పకుండా హెల్త్ కార్డులు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీజెఎఫ్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు టిఎస్ చక్రవర్తి, ప్రెస్‌క్లబ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శి గుద్దేటి రమేష్ బాబు, కొరకొప్పుల రాంబాబు, కోశాధికారి బిక్కీ గోపి, యూనియన్ నాయకులు అంతోటి శ్రీనివాస్, కె.గోవింద్, ఉల్లోజి రమేష్, రోషి రెడ్డి, ఎస్‌డి న్యూస్ యాదగిరి, పిసి డబ్ల్యు నరేష్, జీకే న్యూస్ నరేష్, కంప్యూటర్ టెక్నికల్ ఇంచార్జ్ వెంకట్, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయిలో మెరిసిన త్రివేణి విద్యార్థులు

నవతెలంగాణ-ఖమ్మం



ఖమ్మం నగరంలోని త్రివేణి పాఠశాలకు చెందిన 4వ తరగతి చదువుతున్న కె.సాయి శ్రీగిత్ అండర్-12 లెవెల్లో మొదటి బహుమతి 3వ తరగతి చదువుతున్న వై.దేవ్యైష్ణశ్రీ అండర్-10 లెవెల్లో మూడోవ బహుమతి సాధించారని పాఠశాల డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి తెలిపారు. ఎస్ఎస్ రోలర్ స్కేటింగ్ అకాడమీ వారు నిర్వహించిన పోటీల్లో, అదేవిధంగా ఇస్కాన్ వారు నిర్వహించిన వాల్యూ ఎడ్యుకేషన్ కాంటెస్ట్ బేస్డ్ ఆన్ భగవద్గీత కాంపిటీషన్‌లో బి. తన్విక 5 తరగతి, జిల్లా 4 స్థానం, సిహెచ్.పూజిత 4 తరగతి, ఎం.కృష్ణతేజ 6 తరగతి ఐబిటి స్కూల్ టాపర్స్‌గా బహుమతులు సాధించారని తెలిపారు. అనంతరం విజేతలైన విద్యార్థులకు మేమెంటోతో పాటుగా సర్టిఫికెట్ అందజేశారు. విజేతలైన విద్యార్థులను ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్, కృష్ణవేణి త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, పాఠశాల సిఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, పాఠశాల వైస్ ప్రిన్సిపల్ స్వప్న, ముస్తఫా, అశోక్, క్యాంపస్ ఇంచార్జ్ చార్లెస్ సందీప్, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు అభినందించారు.

నల్లమలకు ఉగాది పురస్కారం

నవతెలంగాణ- ఖమ్మం

వరంగల్ జిల్లా గుడెప్పాడులోని ఎస్ఎస్ఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో గోఆధారిత, సేంద్రీయ వ్యవసాయంపై ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నల్గొండ జిల్లాల రైతులతో అవగాహన సదస్సు జయశంకర్ భూపాలపల్లి జిల్లా వ్యవసాయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ జలపతి రావు, భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ, వరంగల్ జిల్లా జిల్లాపరిషత్ మాజీ చైర్మన్ సమ్మారావు, సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లమల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజలు అనారోగ్యానికి గురి కాకుండా ఉండేందుకు పర్యావరణం పరిరక్షణ కోసం, నేలలో సారాన్ని తగ్గకుండా కాపాడాలంటే రసాయనిక ఎరువులు పురుగుమందులు వాడకాన్ని తగ్గించి సేంద్రియ సాగుకు రైతులు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం వ్యవసాయ అభివృద్ధికి రైతుల సంక్షేమానికి ప్రత్యక్షంగా పరోక్షంగా కృషి చేస్తున్న రైతు బాంధవులకు ఉగాది పురస్కారాలు అందజేశారు. సేంద్రియ వ్యవసాయం వైపు రైతులను మళ్లించేందుకు కృషి చేస్తున్న నల్లమల వెంకటేశ్వరరావును ఘనంగా సన్మానించి ఉగాది పురస్కారాన్ని ప్రదానం అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ ఉద్యానవన శాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రి సందర్శన

నవతెలంగాణ-నేలకొండపల్లి

నేలకొండపల్లి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ కాయకల్ప పీర్ అసెస్మెంట్ చర్ల బృందం సందర్శించింది. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవలపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి పరిసరాలను వార్డులను పరిశీలించారు. ఆసుపత్రి సిబ్బంది, రోగులతో మాట్లాడారు. ఈ సందర్భంగా సిహెచ్సి వైద్యాధికారి డాక్టర్ రాజేష్ ఆసుపత్రి నిర్వహణ, వైద్య సదుపాయాలు తదితర వివరాలను బృందం సభ్యులకు వివరించారు. ఆసుపత్రిలో సౌకర్యాలు, నిర్వహణ, ఉన్నత ప్రమాణాల పట్ల బందం సభ్యులు సంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బృందం సీనియర్ నర్సింగ్ అధికారి శైలజ, సాయివర్ధన్, ఆసుపత్రి ప్రధాన వైద్యులు మంగళ, రాగసుధా, పిహెచ్సి వైద్యాధికారి డాక్టర్ ఆర్.శ్రావణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు భూమి ఇవ్వటానికి ముందుకు వచ్చిన రైతులు

కృతజ్ఞతలు తెలిపిన మట్టా దయానంద్

నవతెలంగాణ-కల్లూరు

సత్తుపల్లి నియోజకవర్గంకు మంజూరైన ఇంటిగ్రేటెడ్ పాఠశాలను నిర్మించడం కోసం చెన్నూరు రైతులు 25 ఎకరాలు పొలాన్ని ఇవ్వటానికి ముందుకు వచ్చినందుకు రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద విజయ్ కుమార్ రైతులకు కృతజ్ఞతలు తెలిపారు. సత్తుపల్లి నియోజకవర్గానికి 200 కోట్ల రూపాయలతో అందించిన ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను కల్లూరు మండలంలోని చెన్నూరు గ్రామంలో నిర్మించడానికి సుమారు 25 ఎకరాలు భూమిని చెన్నూరు గ్రామ రైతులు అందిస్తున్నందుకు వారిని కలుసుకొని పేరుపేరునా చెన్నూరు గ్రామ రైతులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తహసిల్దార్ పులి సాంబశివుడు, ఏఎంసీ చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్ చౌదరి, సత్తుపల్లి ఏఎంసి చైర్మన్ దోమ ఆనంద్, నాయకులు పసుమర్తి చంద్రరావు, పసుమర్తి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టకు భంగం కలిగిస్తే సహించం

- అక్రమార్కులకు అండగా ఉండటం సరికాదు
- కాంగ్రెస్ జిల్లా నాయకుడు భూక్య సురేష్ నాయక్

నవతెలంగాణ-ఖమ్మంరూరల్



భూ కబ్జాదారులకు కొమ్ముకాస్తూ కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టకు భంగం కలిగిస్తే సహించేది లేదని, అలాంటి వారిపై అధిష్టానంకు ఫిర్యాదు చేయనున్నట్లు ఆ పార్టీ జిల్లా నాయకుడు భూక్యా సురేష్ నాయక్ అన్నారు. మండలంలోని ఏదులాపురం బైపాస్ రోడ్‌లో మెట్టు అరుణకు చెందిన ఫ్లాట్‌ను కొంతమంది ఆక్రమించేందుకు ప్రయత్నం చేస్తే అట్టి వారిపై బాధితురాలు రూరల్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పలు పార్టీలు మారి ఇటీవల కాంగ్రెస్‌లోకి వచ్చిన వరంగల్ క్రాస్‌రోడ్‌కు చెందిన ఓ నాయకుడు అక్రమార్కులపై కేసు నమోదు కాకుండా అండగా ఉంటూ...పోలీసులను తప్పుదోవ పట్టించి పలు విమర్శలు మూటగట్టుకున్నాడు. ఈ ఘటనపై కాంగ్రెస్ జిల్లా నాయకుడు భూక్య సురేష్‌నాయక్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బ్లాక్‌మెయిలింగ్‌లకు పాల్పడుతూ పార్టీ ప్రతిష్టను దెబ్బతీస్తే సహించేది లేదన్నాడు. సామాన్యులు కష్టపడి కొనుక్కున్న ఫ్లాట్‌ను ఎవరో అక్రమార్కులు వచ్చి కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తే బాధితులకు అండగా ఉండాల్సిందిపోయి అసాంఘిక శక్తులను ప్రోత్సహించి వారి వద్ద నుంచి లబ్ధి పొందేందుకు ప్రయత్నించడం మంచి పద్ధతి కాదన్నారు. అక్రమార్కుల తరపున వకల్తా పుచ్చుకొని పోలీసులను ఇటు మీడియాను తప్పుదోవ పట్టించేలా మాట్లాడటం సరికాదన్నారు. కాంగ్రెస్ పార్టీ పేరు చెప్పుకొని తప్పుడు పనులకు పాల్పడితే తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు. ఇప్పటికే ఈ విషయం అధిష్టానం దృష్టికి వెళ్లిందని, తాను కూడా పార్టీ జిల్లా అధ్యక్షులు పువాళ్ళ దుర్గాప్రసాద్, మంత్రి పొంగులేటి దృష్టికి తీసుకెళ్తానని సురేష్‌నాయక్ పేర్కొన్నారు.

పంట నష్టాలపై సర్వే చేయాలి

- వరి ఎకరాకు రూ.25వేల నష్టపరిహారం ఇవ్వాలి : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.సాగర్
- హన్వాడ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా



నవతెలంగాణ- హన్వాడ

గ్రామాల్లో సాగునీరందక పంటలు పూర్తిగా ఎండిపోతున్నాయని, అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి నష్టపరిహారం అందించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.సాగర్ కోరారు. మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండల కేంద్రంలో సోమవారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పార్టీ మండల కార్యదర్శి ఏ.లక్ష్మయ్య అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో సాగర్ మాట్లాడుతూ.. గ్రామాల్లో తమ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక సమస్యలపై సర్వే చేసినట్టు చెప్పారు. సాగునీరందక పంటలు ఎండిపోయాయని చెప్పారు. ఎండిపోయిన వరి పంటలకు ఎకరానికి రూ.25 వేల చొప్పున పంట నష్టపరిహారం చెల్లించాలన్నారు. అధికారులు గ్రామాలకు వెళ్లి సర్వే చేయాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను కూడా ఆదుకోవాలని కోరారు. ప్రభుత్వం చెప్పినట్టు అందరికీ రుణమాఫీ కాలేదని, గ్రామాల్లో 40శాతం మంది రైతులకు ఇంకా అందలేదని తెలిపారు. ధరణిలో లోపాల వల్ల రైతుల భూములు అందులో నమోదు కాలేదని, లోపాలను సరిచేసి రైతులు సాగు చేసుకుంటున్న భూములను పాస్‌బుక్‌లో ఎక్కించాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా ఎకరాకు రూ.7500 చొప్పున వెంటనే రైతుల ఖాతాల్లో వేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆవాస్ యోజన కిందన ఇవ్వాల్సిన ఇండ్లను తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అనంతరం తహసీల్దార్ కిష్టనాయక్‌కు వినతిపత్రం అందజేశారు. తహసీల్దార్ స్పందిస్తూ.. కొత్త రేషన్ కార్డులు వచ్చాయని, పంచాయతీ కార్యదర్శులకు పంపించామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ఏ.లక్ష్మయ్య, నాయకులు రమణయ్య, టి.రాములు, శ్రీకాంత్, వెంకటమ్మ, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

కొడుకులు పోషణకు డబ్బులిస్తలేరు

- తన భూమి తనకే ఇప్పించాలని తండ్రి ఫిర్యాదు
- జనగామ జిల్లా పాలకుర్తి మండలం బమ్మెరలో ఘటన



నవతెలంగాణ-పాలకుర్తి

'నేను సంపాదించిన భూమిని నా కొడుకులు తలా ఎకరం రిజిస్ట్రేషన్ చేయించుకుని పోషణకు డబ్బులు ఇస్తలేరు. మేము ఇరువురు భార్యాభర్తలం జీవించడం ఇబ్బందిగా ఉంది. నా భూమి నాకు ఇప్పించండి.' అంటూ జనగామ జిల్లా పాలకుర్తి మండలం బమ్మెర గ్రామానికి చెందిన దుంప సొమ్మల్లు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో గ్రీవెన్స్‌సెల్‌లో తహసీల్దార్ పొట్టబత్తుల శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం సొమ్మల్లు మాట్లాడుతూ.. తనకు ముగ్గురు కుమారులు ఉన్నారని, తనకున్న మూడెకరాల భూమిని తనకు విషయం చెప్పకుండానే తెల్ల కాగితాలపై సంతకాలు చేయించుకుని ముగ్గురూ ఎకరం చొప్పున రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తెలిపారు. తాము భార్యాభర్తల పోషణ నిమిత్తం ఒక్కొక్కరు రూ.3లక్షల చొప్పున రూ.9 లక్షలు ఇవ్వాలని అంగీకారం జరిగిందని అన్నారు. భూమి రిజిస్ట్రేషన్ చేయించుకొని ఏడాది గడుస్తున్నప్పటికీ ముగ్గురు కుమారుల్లో ఏ ఒక్కరూ ఒక్క పైసా ఇవ్వలేదని బోరున విలపించారు. పోషణకు డబ్బులు ఇవ్వకుండానే తన కుమారుల్లో ఒకరు వేరొకరికి భూమిని అమ్ముకునేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. అమ్ముకున్న భూమిని వేరొకరి పేరున రిజిస్ట్రేషన్ చేయకుండా ఆపాలని వేడుకున్నాడు. పోషణకు డబ్బులు ఇవ్వడం లేదని, వారి పేరున ఉన్న రిజిస్ట్రేషన్ రద్దుచేసి తన భూమి తనకు ఇప్పించాలని వేడుకున్నారు. స్పందించిన తహసీల్ధార్ చర్యలు చేపడతామని తెలిపారు.

ధాన్యం రాకను బట్టి కొనుగోలు కేంద్రాల పెంపు

- ధాన్యం కొనుగోళ్లలో జిల్లాను మొదటి స్థానంలో ఉంచుతాం..: మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి
- నల్లగొండ జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



నవతెలంగాణ- నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

ధాన్యం కొనుగోళ్లలో నల్లగొండ జిల్లాను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉంచుతామని, ధాన్యం రాకను బట్టి కొనుగోలు కేంద్రాల సంఖ్యను పెంచుతామని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. సోమవారం నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలో ఉన్న ఆర్జాలభావి వద్ద పానగల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రబీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ రబీలో జిల్లాలో 375 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నామని, అవసరమైతే ధాన్యం రాకను బట్టి కేంద్రాలు పెంచుతామని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన అన్ని సౌకర్యాలూ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం సన్నబియ్యానికి ప్రోత్సాహం ఇవ్వడంలో భాగంగా 500 రూపాయల బోనస్ ఇస్తున్నదని, ఉగాది నుంచి హుజూర్‌నగర్‌లో రేషన్ కార్డుదారులకు సన్నబియ్యాన్ని ఇచ్చే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారని తెలిపారు. ఏఎమ్ఆర్పీ ఉదయ సముద్రం ద్వారా సాగు నీరు అందించామని, దీనివల్ల ఈ సంవత్సరం లక్ష ఎకరాల ఆయకట్టు పెరిగిందని, ఎల్లారెడ్డిగూడెం వరకు సాగునీరు అందిస్తున్నామని చెప్పారు. శ్రీశైలం హైడెల్ ప్రాజెక్టు ద్వారా ఏఎమ్ఆర్పీ నుంచి నీరు తీసుకురానున్నామని తెలిపారు. బ్రాహ్మణ వెల్లెములను పూర్తి చేయడం ద్వారా మర్రిగూడెం చెరువుకు నీళ్లు ఇస్తామని, కాలువల ద్వారా నీరు అందించేందుకు భూసేకరణ పూర్తయిందని చెప్పారు. కట్టంగూరు, నార్కట్‌పల్లి, మునుగోడులో రానున్న మూడు, నాలుగు నెలల్లో కాలువలు పూర్తయితే మరో లక్ష ఎకరాలకు నీరు అందుతుందని వివరించారు. ఎస్ఎల్బీసీ సొరంగం పనులను పూర్తి చేస్తామని, ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుందని చెప్పారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ.. రైతులు నాణ్యత ప్రమాణాలతో కూడిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. గత సంవత్సరం సన్న రకం ధాన్యం 45 వేల మెట్రిక్ టన్నులు పండించిన రైతులకు 22 కోట్ల రూపాయల బోనస్ చెల్లించినట్టు చెప్పారు. వచ్చే సంవత్సరం ఇంకా ఎక్కువమంది సన్న ధాన్యం పండించడంపై దృష్టి సారించాలన్నారు. అనంతరం తిప్పర్తి మండలంలోని మార్కెట్ యార్డులో కొనుగోలు కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మెన్ కుంభం శ్రీనివాస రెడ్డి, పీఏసీఎస్ చైర్మెన్ నాగరత్నం రాజు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ జూపూడి రమేష్, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి హరీష్, తదితరులు పాల్గొన్నారు.

'మధ్యాహ్న' బకాయిలు విడుదల చేయాలి

ఎన్నికల హామీ రూ.10,000 వేతనం ఇవ్వాలి : సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

- తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయూ) మహాధర్నా



నవతెలంగాణ - ముషీరాబాద్

మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని, కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం వారికి రూ.10,000 వేతనం ఇవ్వాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద రాష్ట్ర అధ్యక్షులు వై.స్వప్న అధ్యక్షతన మహాధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సందర్భంగా తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మధ్యాహ్న భోజన కార్మికులకు పది వేల రూపాయల వేతనం అమలు చేస్తామని కాంగ్రెస్ హామీనిచ్చిందని గుర్తు చేశారు. కానీ అధికారంలోకి వచ్చి 15 నెలలు కావస్తున్నా నేటికీ అమలు చేయకపోగా.. అరకొరగా ఇచ్చే వేతనం కూడా పెండింగ్‌లో పెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణలో పనిచేస్తున్న మహిళలంతా అట్టడుగు సామాజిక తరగతులకు చెందిన వారేనని, వారికి ఇచ్చే వేతనం చాలా తక్కువ అని, అది కూడా నెలల తరబడి పెండింగ్‌లో ఉంటోందని తెలిపారు. ప్రభుత్వం గుడ్డుకిచ్చే బడ్జెట్‌తో రెండు గుడ్లు కూడా రావు.. మూడు ఎక్కడి నుంచి తెచ్చి పెట్టాలని ప్రశ్నించారు. ఇప్పటికే బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, కార్మికులు ఎంతకాలం అప్పులు చేసి పెడతారని ప్రశ్నించారు. గుడ్లను అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్నట్టు ప్రభుత్వం నేరుగా పాఠశాలలకు కూడా సరఫరా చేయాలని కోరారు.

యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ రమ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యా రంగానికి తగిన నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. కేంద్ర స్కీమ్‌లకు కేంద్ర ప్రభుత్వం తన వాటా చెల్లించడం లేదు. దీని ప్రభావం మధ్యాహ్న భోజన కార్మికులపై కూడా పడుతోందని అన్నారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వై.స్వప్న మాట్లాడుతూ.. పెరిగిన ధరలకు అనుగుణంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో మధ్యాహ్న భోజన పథకానికి అవసరమైన బడ్జెట్ కేటాయించి అమలు చేస్తే మంచి ఫలితాలు పొందొచ్చన్నారు. గుడ్లకు అదనంగా బడ్జెట్ కేటాయించాలని, అక్రమ తొలగింపులు, రాజకీయ వేధింపులు అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శులు జె.వెంకటేష్, కూరపాటి రమేష్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి.సుధాకర్, యూనియన్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ జి.పద్మ, మాయ, ఉన్ని కృష్ణ, చిన్నన్న, కృష్ణమాచారి, చామంతి లక్ష్మి, పద్మ, సుల్తాన్, హంస తదితరులు పాల్గొన్నారు.

స్టాండప్ కమెడియన్ షోపై రేగిన వివాదం

(మొదటిపేజీ తరువాయి)

రోజుల్లో షిండేకు క్షమాపణ చెప్పకపోతే క్రమాను వీధుల్లో తిరగనిచ్చేది లేదని శివసేన ఎమ్మెల్యే ముర్జి పటేల్ హెచ్చరించారు. ఈ నేపథ్యంలో క్రమా ప్రకటన వెలువడింది. శిండేపై అప్రతిష్టాకరమైన వ్యాఖ్యలు చేసినందుకు క్రమాపై ముంబయి పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అలాగే హేబిటేట్ స్టూడియోను ధ్వంసం చేసినందుకు 40మంది శివసేన కార్యకర్తలపై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు. స్టూడియోపై, హోటల్ ఆవరణపై వారు దాడికి దిగారని పోలీసులు తెలిపారు.

శివసేన కార్యకర్తలు తమ వేదికను ధ్వంసం చేసినందున హేబిటేట్ స్టూడియోను మూసివేస్తున్నట్టు అంతకుముందు స్టూడియో యాజమాన్యం ప్రకటించింది. "మేం దిగ్భ్రాంతి చెందాం, ఆందోళన చెందుతున్నాం. మమ్మల్ని లక్ష్యంగా చేసుకుని విధ్వంసానికి దిగిన చర్యలతో మా హృదయాలు చెదిరిపోయాయి." అని ఇన్‌స్టాగ్రామ్‌లో సోమవారం స్టూడియో యాజమాన్యం పేర్కొంది. "కళాకారులు తమ అభిప్రాయాలకు, సృజనాత్మక ఎంపికలకు మాత్రమే బాధ్యత వహిస్తారు. తాము ప్రదర్శించిన కంటెంట్‌లో ఎన్నడూ జోక్యం చేసుకోరు." అని స్టూడియో పేర్కొంది. "కానీ దాదాపుగా ప్రదర్శనకారుడికి ప్రాక్సీగా వున్న ప్రతిసారీ తమని ఎలా నిందిస్తున్నారో, లక్ష్యంగా చేసుకుంటున్నారో ఇటీవలి సంఘటనలతో తాము పునరాలోచించుకోవాల్సి వస్తోందని పేర్కొంది.

మేం కానీ, మా ఆస్తులు గానీ ఇబ్బందుల్లో పడకుండా వుండేలా భావ ప్రకటనా స్వేచ్ఛకు ఒక వేదికను అందించేందుకు ఉత్తమ మార్గాన్ని రూపొందించుకునేవరకు స్టూడియోను మూసివేస్తున్నట్లు ప్రకటించింది. ఇందుకోసం కళాకారులు, ప్రేక్షకులు, దీనితో ప్రమేయమున్న ఇతర పక్షాల వారినందరినీ వారి అభిప్రాయాలు తెలియచేయాల్సిందిగా కోరుతున్నామని, ప్రదర్శనకారుల హక్కులను కూడా తాము గౌరవిస్తామని స్టూడియో నోట్ పేర్కొంది. ఈ వీడియో వల్ల మనోభావాలు దెబ్బతిన్న వారందరికీ స్టూడియో క్షమాపణ చెబుతూ అంతకుమందు ఒక పోస్టు పెట్టింది. కునాల్ క్రమా ఇటీవల చేసిన వీడియో తయారీలో హేబిటేట్ స్టూడియో ప్రమేయం లేదని, ఆ వీడియో వ్యక్తం చేసిన అభిప్రాయాలను కూడా సమర్ధించడం లేదని పేర్కొంది. క్రమా షో నిర్వహించిన హేబిటేట్ స్టూడియోలోనే గత నెల్లో పెద్ద ఎత్తున వివాదానికి దారి తీసిన వివాదాస్పద ఇండియాస్ గాట్ లాటెంట్ షో చిత్రీకరించబడింది.

సీపీఐ(ఎం) ఖండన

స్టాండప్ కమెడియన్ కునాల్ క్రమాను లక్ష్యంగా చేసుకుని ఆయన షోను ప్రదర్శించిన స్టూడియోను పాలక గూండాలు ధ్వంసం చేయడాన్ని సీపీఐ(ఎం) తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఒక ప్రకటన జారీ చేసింది. ఇదే స్టూడియోలోని పలు భాగాలను మున్సిపల్ అధికారులు సోమవారం కూల్చివేశారు. క్రమాను బెదిరించడం, అడ్డగించడంతో సహా ఆయనపై అనేక కేసులను ప్రభుత్వం నమోదు చేసింది. ఈ పరిస్థితి చూస్తుంటే బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వాలకు మూక హింస ఒక్కటే చట్టమని స్పష్టమవుతోందని సీపీఐ(ఎం) విమర్శించింది. ఈ తరుణంలో కునాల్ క్రమాకు ఆయన భావ వ్యక్తీకరణ స్వేచ్ఛకు సీపీఐ(ఎం) బాసటగా వుంటుందని ఆ ప్రకటన పేర్కొంది.

ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు చెల్లించాలి

- పీఆర్టీయూ తెలంగాణ డిమాండ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను ఈనెల 31లోపు చెల్లించాలని పీఆర్టీయూ తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం చెన్నయ్య ప్రధాన కార్యదర్శి ఎండీ అబ్దుల్లా సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉపాధ్యాయులకు రావాల్సిన అన్ని రకాల బిల్లులు సుమారు రెండేండ్ల నుంచి పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఉపాధ్యాయుల వేతనంలో నుంచి మినహాయించిన డబ్బులు అవసరానికి ఉపయోగించుకోవడానికి కూడా వీల్లేని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. పిల్లల పెండ్లికిగాని తల్లిదండ్రుల ఆస్పత్రి ఖర్చులుగాని చెల్లించాలంటే తాము జమ చేసిన డబ్బులు అవసరానికి కూడా వాడుకునే పరిస్థితి లేదని తెలిపారు. సరెండర్ బిల్లులు, మెడికల్ బిల్లులు, ఇన్సూరెన్స్ డబ్బులు, జీపీఎఫ్ డబ్బులు కూడా ఏండ్ల తరబడి ఈ-కుబేర్‌లో ఉన్నాయని వివరించారు. బిల్లులు రాక ఉపాధ్యాయులు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. డీఏలు ఇవ్వడం లేదనీ, పీఆర్సీ ఊసేలేదని పేర్కొన్నారు. డీఏలు అడిగితే జీతాలిచ్చేది కష్టమని స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారని తెలిపారు. పైసా పైసా జీపీఎఫ్‌లో జమ చేసుకుంటే అవసరానికి అందడం లేదని పేర్కొన్నారు. పిల్లల పెండ్లి ఎలా చేయాలనీ, ఆస్పత్రి ఖర్చులు ఎలా భరించాలని ప్రశ్నించారు. కేవలం జీతం తప్ప ఏమీ ఇవ్వకుండా ప్రభుత్వం వ్యవహరించడం సరైంది కాదని తెలిపారు. ఆ నెలాఖరు వరకు పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల బిల్లులను ప్రత్యేక బడ్జెట్ కేటాయించి చెల్లించాలని కోరారు. లేకుంటే ఉద్యమ కార్యాచరణ చేపట్టాల్సి వస్తుందని ప్రభుత్వాన్ని వారు హెచ్చరించారు.

వడగండ్ల వాన ఊడ్చేసింది

(మొదటిపేజీ తరువాయి)

రైతులు ఉద్యమించారని తెలిపారు. వారిపై పెట్టిన కేసులను ఎత్తేయాలని కోరారు. కామారెడ్డి శాసనసభ్యులు వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ చాలాకాలంగా ఉద్యోగులకు, పోలీసు సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న బెనిఫిట్స్ వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. షాద్‌నగర్ శాసనసభ్యులు వీరపల్లి శంకర్ మాట్లాడుతూ చటాన్‌పల్లి ఆర్‌వోబీని పూర్తి చేయాలన్నారు. తన నియోజకవర్గంలో ఎమ్ఎన్‌సీ కంపెనీల్లో స్థానికులకు ఉపాధి కల్పించా లని డిమాండ్ చేశారు. జేపీ దర్గాకు అభివృద్ధి నిధులు విడుదల చేయాలని కోరారు. ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య మాట్లాడుతూ తాపస్‌పల్లి, రాజాపేట, గుండాల గ్రామాల్లోని చెరువుల్లో తుంగను తొలగించాలన్నారు. ఆ కాల్వను పునరుద్ధరించాలని కోరారు. తాండూరు శాసనసభ్యులు మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ స్థానిక మున్సిపాల్టీలో తాగునీటి కొరత లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. మెట్‌పల్లి శాసనసభ్యులు డాక్టర్ సంజయ్‌కుమార్ మాట్లాడుతూ తన నియోజకవర్గంలోని పాఠశాలలు, ఆస్పత్రులు, మార్కెట్ల నిర్మాణ పనులను పూర్తి చేయాలని కోరారు. ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ బెట్టింగ్ యాప్స్‌లో ఓ మాజీ మంత్రికి సంబంధం ఉన్నట్టు ప్రచారం జరుగుతున్నదనీ, సమగ్ర విచారణ జరిపి ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పంట నష్టపోయిన రైతులకు
పరిహారం ఇవ్వాలి

- తెలంగాణ రైతు సంఘం డిమాండ్

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం 1.5 లక్షల ఎకరాలకు రూ.15.80 కోట్లు మాత్రమే సహాయం చేసిందని పేర్కొన్నారు. రైతులు పెట్టిన పెట్టుబడితో పోల్చితే అది నామమాత్రమేనని తెలిపారు. ఇప్పుడు ఉమ్మడి మహబూబ్‌నగర్, ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాల్లో రైతులకు బాగా నష్టం వాటిల్లిందని తెలిపారు. ప్రాథమిక అంచనా ప్రకారం రూ.11వేల కోట్ల నష్టం జరిగిందని ప్రభుత్వం ప్రకటించిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పంటల బీమా పథకాన్ని ప్రారంభించలేదని పేర్కొన్నారు. కేంద్రం ప్రవేశ పెట్టిన 'పీఎమ్ ఫసల్ బీమా స్కీమ్'లో గత ప్రభుత్వం చేరినప్పటికీ ప్రీమియం చెల్లించక పోవడంతో రైతులకు పరిహారం అందలేదని తెలిపారు. అందువల్ల యాసంగిలో జరిగిన పంట నష్టాన్ని సేకరించి, పూర్తి పరిహారాన్ని రైతులకు చెల్లించాలని కోరారు

'చలో పార్లమెంట్'

మే 20 నుంచి సమ్మెలోకి రవాణా రంగ కార్మికులు



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

రోడ్డు రవాణా రంగాన్ని ఏకస్వామ్యంగా మార్చాలనే కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలనే డిమాండ్లతో సహా వివిధ డిమాండ్లను లేవనెత్తుతూ ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్) 'చలో పార్లమెంట్' మార్చ్‌ను నిర్వహించింది. మణిపూర్, జమ్మూ కాశ్మీర్ సహా 23 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి వేలాది మంది రోడ్డు రవాణా కార్మికులు ఈ మార్చ్‌లో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా మే 20న కార్మిక సంఘాలు నిర్వహించనున్న జాతీయ సమ్మెలో భారీ విజయం సాధించాలని పార్లమెంట్ మార్చ్ పిలుపునిచ్చింది. రవాణా కార్మికులు సమ్మెలో పూర్తిగా పాల్గొంటారని ప్రకటించింది.

ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాలి : సీఐటీయూ

ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాన్ని తీవ్రతరం చేయాలని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి తపన్ సేన్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 20న నాలుగు కార్మిక కోడ్‌లకు వ్యతిరేకంగా జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. సీఐటీయూ జాతీయ కార్యదర్శి కరుమలయన్ మాట్లాడుతూ రోడ్డు రవాణా రంగ కార్మికులు చేపట్టే పోరాటాలకు సీఐటీయూ పూర్తి మద్దతుగా ఉంటుందని అన్నారు. డీఎంకే ఎంపీ షణ్ముగం, సీపీఐ(ఎం) ఎంపీలు అమ్రారామ్, సచ్చిదానందం, సీపీఐ(ఎంఎల్) ఎంపీ సుధామ ప్రసాద్ మాట్లాడుతూ రవాణా కార్మికుల పోరాటానికి తమ మద్దతును ప్రకటించనున్నట్టు తెలిపారు. పార్లమెంటులో సమస్యలను లేవనెత్తడానికి ప్రయత్నిస్తా మని హామీ ఇచ్చారు.

ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ ప్రధాన కార్యదర్శి ఆర్. లక్ష్మయ్య మాట్లాడుతూ కార్మికుల డిమాండ్లను వివరించారు. కార్మికులు "మే 20 సమ్మెను విజయవంతం చేయాలనే" నినాదంతో ఆమోదించారు. 2024 డిసెంబర్‌లో కేంద్ర రోడ్డు రవాణా మంత్రి నితిన్ గడ్కరీని కలిసి తమ డిమాండ్లను లేవనెత్తినప్పటికీ, పరిష్కారం లేని నేపథ్యంలో పార్లమెంట్ మార్చ్ జరుగుతోందని అన్నారు. రోడ్డు రవాణాకు సంబంధించిన ఇతర సంఘాలతో చర్చలు జరుగుతున్నాయని, మరికొన్ని మే 20 సార్వత్రిక సమ్మెలో చేరడానికి ఐక్యంగా పోరాడటానికి అంగీకరించాయని ఆయన అన్నారు.

అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరల తగ్గుదలకు అనుగుణంగా డీజిల్ ధరలను తగ్గించడం, థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ ప్రీమియం పెంపును నివారించడం, టోల్ రేట్లను తగ్గించడం, ఏకస్వామ్య చర్యను తిప్పికొట్టడం, ఓలా, ఉబర్ వంటి గుత్తాధిపత్య సంస్థల రవాణా రంగంలో శ్రమ దోపిడీని అంతం చేయడం, రోడ్డు రవాణా కార్మికులకు సామాజిక భద్రత కల్పించడం, కార్మిక చట్టాలకు అనుగుణంగా ఉండేలా చూసుకోవడం వంటి డిమాండ్లను పార్లమెంట్ మార్చ్ లేవనెత్తింది. డిమాండ్లను వివరించే వినతిపత్రాన్ని ప్రధానమంత్రికి పంపించింది. పార్లమెంట్ మార్చ్‌లో కెకె దివాకరన్, నేపాల్‌దేవ్ భట్టాచార్య, కడకంపల్లి సురేంద్రన్, జిబన్ సాహా తదితరులు పాల్గొన్నారు.

త్వరలో మంత్రి వర్గ విస్తరణ

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్ర మంత్రి వర్గ విస్తరణకు చర్చ జరిగింది. ప్రస్తుతం ఆరు పదవులు ఖాళీగా ఉండగా... ఇందులో నాలుగింటికి కాంగ్రెస్ అధిష్టానం పచ్చజెండా ఊపినట్టు తెలిసింది. ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో సోమవారం ఢిల్లీలోని ఇందిరా భవన్ లో కీలక భేటీ జరిగింది. ఈ భేటీలో కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, పార్టీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) కేసీ వేణుగోపాల్, రాష్ట్ర ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, రాష్ట్ర నుంచి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ లు హాజరయ్యారు. హైకమాండ్ ఆదేశాల మేరకు సోమవారం సాయంత్రం ఢిల్లీకి వచ్చిన సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి ఉత్తమ్, పీసీసీ చీఫ్‌లు నేరుగా ఇందిరా భవన్‌కు చేరుకున్నారు. ఈ సమావేశం రాత్రి 7 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు రెండు గంటల పాటు సాగింది. అయితే మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి 7:45 నిమిషాలకు ఈ మీటింగ్ లో పాల్గొన్నారు.

త్వరలోనే మంత్రి వర్గ విస్తరణ: పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్

త్వరలోనే క్యాబినేట్ విస్తరణపై హైకమాండ్ నిర్ణయం తీసుకుంటుందని పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ వెల్లడించారు. సమావేశ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. మంత్రి వర్గ కూర్పు, పీసీసీ కార్యవర్గం, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న సంక్షేమ పథకాలు, ఇతర అంశాలపై పార్టీ పెద్దలతో చర్చించినట్టు తెలిపారు. అలాగే రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిస్థితులు, ఇటీవల అసెంబ్లీలో ఆమోదం పొందిన బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ విషయాలను వారి దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు. అయితే మంత్రివర్గ కూర్పు, పీసీసీ కార్యవర్గం, తదితర అంశాలపై అధిష్టానంతో ఇదే చివరి సమావేశమని స్పష్టత ఇచ్చారు. మరోసారి చర్చ ఉండదని పేర్కొన్నారు. "రాష్ట్రంలో జరుగుతోన్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల గురించి ఖర్గే, రాహుల్ గాంధీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య విద్య అమలు తీరుపై రాహుల్ గాంధీ ప్రత్యేకంగా అడిగారు. ప్రధానంగా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు గురించి పలు అంశాలను తెలుసుకున్నారు. వాటివల్ల ఎంతమంది ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ వర్గాలకు లాభం జరుగుతుంది? ఎంతమందికి ప్రవేశాలు లభిస్తాయి? అని అడిగారు." అని తెలిపారు. వీటితో పాటు... క్యాబినెట్ విస్తరణ, పీసీసీ కొత్త కార్యవర్గం, వివిధ కార్పొరేషన్ చైర్మెన్లు, బోర్డుల నియామకం చర్చించినట్టు మీడియాకు తెలిపారు. వీటిపై తమ అభిప్రాయాలను తీసుకున్నారన్నారు. అన్ని విషయాలపై త్వరలో అధిష్టానం ఒక నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు.

ఆశాలను అరెస్టులు చేసి అగౌరవ పరుస్తున్న ప్రభుత్వం

- మాజీ మంత్రి హరీశ్‌రావు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆశా వర్కర్లను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అరెస్టు చేసి వారిని అగౌరవ పరిచిందని మాజీ మంత్రి టి హరీశ్‌రావు సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఈ అరెస్టులను బీఆర్ఎస్ ఖండిస్తున్నదని తెలిపారు. అరెస్టు చేసిన వారిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం తమకు వేతనాలు పెంచాలని అడగడమే ఆశాలు చేసిన నేరమా? అని ప్రశ్నించారు. వందల సంఖ్యలో పోలీసులను మోహరించి, బలవంతంగా వాహనాల్లో ఎక్కించి స్టేషన్లకు తరలించడం దుర్మార్గమని పేర్కొన్నారు. హక్కుల సాధన కోసం శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ఆశాల పట్ల ఎందుకింత నిరంకుశత్వం? అని ప్రశ్నించారు. ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు దక్కుతున్న గౌరవం ఇదేనా?అని నిలదీశారు. ఆశా సేవలను గుర్తించిన కేసీఆర్ ప్రభుత్వం మూడు సార్లు వారి పారితోషికాలను పెంచిందని గుర్తు చేశారు. రాష్ట్ర ఏర్పాటుకు ముందు రూ.1,500లు మాత్రమే ఉన్న వేతనాన్ని, రూ.9,750లకు పెంచిందని తెలిపారు. విధులు మరింత సమర్ధవంతంగా నిర్వహించేందుకు మొబైల్ ఫోన్లు ఉచితంగా అందించి, ఆ బిల్లులను ప్రభుత్వమే చెల్లించిందని పేర్కొన్నారు. ఆశాల గౌరవాన్ని పెంచింది కేసిఆర్ అయితే, నేడు అరెస్టులు చేసి అగౌరవ పరుస్తున్నది రేవంత్ ప్రభుత్వం అని విమర్శించారు.

కేటీఆర్‌ను కలిసిన హెచ్‌సీయూ ఐక్య కార్యాచరణ బృందం

- తమ ఉద్యమానికి మద్దతివ్వాలని కోరిన విద్యార్థులు
- భూముల పరిరక్షణకు అండగా ఉంటామని కేటీఆర్ హామీ
- ఆందోళనను కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని సూచన



నవతెలంగాణ-మియాపూర్

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల వేలాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ గత కొద్ది రోజులుగా విద్యార్థులు ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తమ ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని కోరుతూ సోమవారం యూనివర్సిటీ విద్యార్థులు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను తెలంగాణ భవన్‌లో కలిశారు. తమ ఆందోళనలకు సంబంధించిన వివరాలను కేటీఆర్‌కు విద్యార్థులు వివరించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన భూములను కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మకానికి పెట్టడం పట్ల విద్యార్థులు చేస్తున్న ఆందోళనకు తమ మద్దతు ఉంటుందని కేటీఆర్ హామీ ఇచ్చారు. ఈ యూనివర్సిటీ కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న నేపథ్యంలో, ఈ అంశాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లేందుకు కూడా మద్దతు అందిస్తామని కేటీఆర్ తెలిపారు. భూముల పరిరక్షణ కోసం కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కలిసేందుకు సహకారం అందిస్తామని చెప్పారు. అలాగే, బ్యాకరి కంచె భూములను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తే అక్కడి వైవిధ్యమైన జీవవైవిధ్యం, వృక్షజాలం నశించి పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో కేంద్ర పర్యావరణ శాఖ జోక్యం చేసుకోవాలని, ఆ శాఖ మంత్రిని కలవాలని కేటీఆర్ విద్యార్థులకు సూచించారు. ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్‌తో పాటు విద్యార్థి విభాగం అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్‌తో సమన్వయం చేసుకోవాలని కేటీఆర్ తెలియజేశారు. తమ ఆందోళనను అర్థం చేసుకొని, న్యాయమైన డిమాండ్‌కు సానుకూలంగా స్పందించిన కేటీఆర్‌కు విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు. తమ ఆందోళనను దేశంలోని అన్ని యూనివర్సిటీలకు విస్తరిస్తామని, హైదరాబాద్ యూనివర్సిటీ భూములతో పాటు పర్యావరణ పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని విద్యార్థులు ప్రకటించారు.



మానసిక ఒత్తిడితో శారీరక మార్పులు

మానసిక ఒత్తిడి మన శారీరక, మానసిక, భావోద్వేగ స్థితిని ప్రభావితం చేసే ఒక ప్రధాన అంశం. దీర్ఘకాలిక ఒత్తిడి స్త్రీల లైంగిక ఆరోగ్యాన్ని తీవ్రంగా దెబ్బతీసే అవకాశం ఉంది. ఈ సమస్యలను అధిగమించేందుకు సరైన అవగాహన, జీవనశైలి మార్పులు, చికిత్స కీలకం.

మానసిక ఒత్తిడి వల్ల శరీరంలో కొన్ని హార్మోన్ల అసమతుల్యత ఏర్పడుతుంది. ముఖ్యంగా ఒత్తిడి హార్మోన్‌లు పెరిగినప్పుడు ఈస్ట్రోజెన్, ప్రొజెస్టిరాన్, టెస్టో స్టీరోన్ స్థాయిలు తగ్గుతాయి. ఇది లైంగిక ఆసక్తిని తగ్గించడమే కాకుండా, రిప్రొడక్టివ్ వ్యవస్థపై ప్రభావం చూపుతుంది.

ముఖ్యమైన సమస్యలు

హైపోయాక్టివ్ సెక్స్యువల్ డిజైర్ డిజార్డర్: ఇది స్త్రీలలో అత్యంత సాధారణమైన లైంగిక సమస్య. దీని కారణంగా లైంగిక ఆకర్షణ పూర్తిగా తగ్గిపోతుంది. ఒత్తిడి, ఆందోళన, సంబంధాల్లో ఉద్రిక్తత దీని ప్రధాన కారణాలు.

అనారోగ్యకరమైన యోని మార్పులు: మానసిక ఒత్తిడితో యోని పొడిబారుతుంది. ఇది శరీర సంబంధ సమయంలో అసౌకర్యం, నొప్పి, చికాకు కలిగించవచ్చు.

లైంగిక స్పందనలో తక్కువతనం: ఒత్తిడి వల్ల రక్తప్రసరణ మందగించడం వల్ల జననాంగాల్లో స్పందన తగ్గుతుంది. దీని ప్రభావంగా శరీర సంబంధంలో ఆనందం తగ్గిపోతుంది.

ఆర్గాజమ్ పొందడంలో సమస్యలు: మానసిక ఒత్తిడి మెదడులోని ఆనందాన్ని నియంత్రించే కెమికల్స్ డోపమైన్, సెరాటోనిన్ స్థాయిని తగ్గిస్తుంది. ఈ మార్పులు శృంగార సమయంలో సంతృప్తి పొందడంలో ఆటంకంగా మారతాయి.



వాజినిజ్మస్: ఒత్తిడి, భయం, లేదా ట్రామా వల్ల యోని కండరాలు స్వచ్ఛందంగా గట్టిగా సంకోచించటం వల్ల శారీరక సంబంధ సమయంలో తీవ్రమైన నొప్పి సంభవిస్తుంది.

పీరియడ్‌లలో అవకతవకలు: ఒత్తిడి వల్ల పీరియడ్స్ ఆలస్యం లేదా ముందుగానే రావడం జరుగుతుంది. కొన్నిసార్లు తీవ్ర ఒత్తిడితో పీరియడ్స్ పూర్తిగా ఆగిపోవచ్చు.

సంతానోత్పత్తిలో ఆటంకం: మానసిక ఒత్తిడి వల్ల గర్భసంచి, కండరాల సంకోచం ఏర్పడి గర్భధారణలో సమస్యలు వస్తాయి.



ముఖ్యమైన సూచనలు

- మానసిక ఒత్తిడిని గమనించి తొందరగా చికిత్స తీసుకోవడం అవసరం.
- మహిళల్లో మానసిక ఒత్తిడి వల్ల ఏర్పడే లైంగిక సమస్యలు సాధారణమే కానీ లైంగిక సమస్యలను చిన్నగా భావించకుండా నిపుణుల సలహా తీసుకోవడం మంచిది.
- సరైన జీవనశైలి మార్పులు, ధ్యానం, మానసిక ఆరోగ్య సంరక్షణ ద్వారా ఒత్తిడి, లైంగిక సమస్యలను అధిగమించవచ్చు.
- జబ్బు తీవ్రతను బట్టి సైకో థెరపీ, మెడిటేషన్, లేదా మందుల ద్వారా చికిత్స పొందవచ్చు

తగ్గించడానికి ఏంచేయాలి

వ్యాయామం: నిత్య జీవితంలో ధ్యానం, ప్రాణాయామం వంటి వాటిని భాగం చేసుకుంటే ఒత్తిడిని తగ్గించుకోవచ్చు.

ఆరోగ్యకరమైన ఆహారం: విటమిన్ బి, మెగ్నీషియం, ఒమెగా-3 ఫ్యాటీ ఆమ్లాలు లాంటి పోషకాలు ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడతాయి.

నిజాయితీగా ఆలోచన చేసుకోవడం: ఒత్తిడికి మూలకారణాలను గుర్తించి వాటిని అధిగమించేందుకు చిత్తశుద్ధిగా ఆలోచించడం అవసరం.

ఆరోగ్యకరమైన జీవనశైలి: పోషకాహారం, నిద్ర, సమయపాలన వంటివి శారీరక ఆరోగ్యాన్ని సమతుల్యం చేస్తాయి.

శారీరక వ్యాయామం: నడక, జాగింగ్, లేదా ఏరోబిక్స్ వంటి శారీరక వ్యాయామాలు ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడతాయి.

కౌన్సిలింగ్ లేదా థెరపీ: ప్రత్యేకంగా సి.బి.టి., సెక్స్ థెరపీ ఒత్తిడిని తగ్గించడంలో సమర్థంగా పనిచేస్తాయి.

భాగస్వామితో చర్చ: భాగస్వామితో స్వేచ్ఛగా తన భావాలను పంచుకోవడం ద్వారా ఒత్తిడిని తగ్గించుకోవచ్చు.

సమయ నిర్వహణ: ఒత్తిడిని తగ్గించేందుకు సమయాన్ని సమర్థవంతంగా నియంత్రించడం అవసరం.

- డా.అట్ల శ్రీనివాస్ రెడ్డి,
9703935321



జాగ్వార్‌ను నడిపిన మొదటి మహిళా పైలట్

తనుష్క సింగ్... తాత, తండ్రి నుండి ప్రేరణ పొందింది. భారత సైన్యంలో చేరాలని కలలు కన్నది. భారత వైమానిక దళ చరిత్రలో ఒక గొప్ప అధ్యాయాన్ని లిఖించింది. ఉన్నత శిఖరాలకు ఎగబాకింది. తనుష్క సాధించిన విజయం గురించి తెలుసుకొని అభినందించేందుకు ఆ రోజు ఉదయం నుండి బంధువులు, శ్రేయోభిలాషులు ఆమె తాతకు ఫోన్లు చేస్తూనే ఉన్నారు. తనుష్క వీడియో కాల్ ద్వారా తాతతో తన ఆనందాన్ని పంచుకుంది. అయితే భద్రతా కారణాల దృష్ట్యా ఆమె గురించిన పరిమితమైన సమాచారాన్ని మాత్రమే ఆయన బయటి ప్రపంచంతో పంచుకోగలిగారు. అయితే ఆయన ఎంత దాచేందుకు ప్రయత్నించినా ఈ ఆనందకర సమయంలో కొన్ని ముఖ్యమైన విషయాలు పంచుకోకుండా ఉండలేకపోయారు. ఈరోజు తనుష్క సాధించిన ఈ ఘనతకు తన భార్య ఊర్మిళ సింగ్ కారణం. ఆమెనే మనవరాలి అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని గోండా నుండి రాజధానికి మార్చాలని బలవంతం చేసింది. ఈ నిర్ణయం ఫలితంగానే ఇప్పుడు వారి కుటుంబం మైలురాయిని చేరుకుందని ఆయన చెప్పారు.



తాత ప్రేరణతో

లక్నోలో పుట్టిన తనుష్క 2007 నుండి తన తండ్రి రిటైర్డ్ లెఫ్టినెంట్ కల్నల్ అజయ్ ప్రతాప్ సింగ్‌తో కలిసి మంగళూరులో నివసిస్తుంది. అక్కడే ఆమె DPS MRPLలో పాఠశాల విద్యను పూర్తి చేసింది. 2022లో మణిపాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుండి ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్‌లో బిటెక్ డిగ్రీని పొందింది. తర్వాత ఐఏఎఫ్‌లో చేరింది. తనుష్క సైనిక కుటుంబం నుండి వచ్చింది. ఆమె తండ్రి, తాత ఇద్దరూ మంచి పేరున్న సైనిక సిబ్బంది. తనుష్క మొదట్లో భారత సైన్యంలో చేరాలనుకుంది. కానీ భారత వైమానిక దళంలో మహిళలకు ఉన్న అవకాశాల గురించి తెలుసుకుంది. తను దీని గురించి తన తాతతో మాట్లాడింది. తర్వాత తన నిర్ణయాన్ని మార్చుకుని వైమానిక దళంలో చేరాలని నిర్ణయించుకుంది. 'నేను ఆమెను ప్రోత్సహించాను. ఇప్పుడు ఆమె దేశం మొత్తం గర్వపడేలా చేసింది' అంటూ ఆయన పంచుకున్నారు.

తొలి పైలట్ అని తెలియగానే

తెలంగాణలోని దుండిగల్‌లోని వైమానిక దళ అకాడమీలో శిక్షణ పూర్తి చేసిన తర్వాత ఆమె హాక్ ఎంకె 132 విమానంలో ప్రత్యేక శిక్షణ పొందింది. తనుష్క తొలి పైలట్ అయ్యారనే వార్త తెలియగానే ఆమెను అభినందించడానికి ఇందిరానగర్‌లోని పటేల్ నగర్‌లోని ఆమె నివాసానికి శ్రేయోభిలాషులు గుమిగూడారు. ఆమె తాతా, మామ విజయ్ ప్రతాప్ సింగ్‌కు ప్రజలు పుష్పగుచ్ఛాలు, స్వీట్లు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థులకు యూఎస్ షాక్

వాషింగ్టన్ : యూఎస్‌లో విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులకు గడ్డు పరిస్థితులు ఎదురవుతున్నాయి. అమెరికాలో ఫుల్ టైమ్ విద్యను అభ్యసించేందుకు అనుమతించే ఎఫ్-1 వీసాలను ఆ దేశం గత కొన్నేండ్లుగా భారీగా తిరస్కరిస్తోంది. గత ఆర్థిక సంవత్సరం (అక్టోబర్ 2023 నుంచి సెప్టెంబర్ 2024 వరకు)లో అన్ని దేశాల నుంచి వచ్చిన 41 శాతం దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. అంటే, వీసా తిరస్కరణల సంఖ్య పదేండ్ల గరిష్ఠానికి పెరిగాయి. దాదాపు రెట్టింపునకు ఎగబాకాయి. అమెరికా విదేశాంగ శాఖ ఈ గణాంకాలను వెల్లడిస్తున్నది. దీని ప్రకారం.. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఎఫ్-1 వీసాల కోసం 6.79 లక్షల దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 2.79 లక్షల (41 శాతం) అప్లికేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం 2022-23తో పోలిస్తే ఈ తిరస్కరణల సంఖ్య ఎక్కువే. మొత్తం 6.99 లక్షల దరఖాస్తులు రాగా.. 2.53 లక్షలు (36శాతం) రిజక్ట్ అయ్యాయి. 2013-14 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 7.69 లక్షల మంది విద్యార్థులు ఎఫ్-1 వీసాల కోసం అప్లై చేసుకున్నారు. వీటిలో 1.73 లక్షల (23 శాతం) దరఖాస్తులు ఆమోదం పొందలేదు. అయితే, దీనితో పోలిస్తే.. గతేడాది తిరస్కరణకు గురైన ఎఫ్-1 వీసాల సంఖ్య దాదాపు రెట్టింపు కావటం గమనార్హం. ఇక 2014-15లో ఆమోదం పొందని దరఖాస్తుల సంఖ్య 25 శాతంగా ఉన్నది. ఆ తర్వాత ఏడాదుల్లో (2021లో తప్పితే) ఈ తిరస్కరణల సంఖ్య క్రమంగా పెరిగింది. అయితే, దేశాలవారీగా తిరస్కరణకు గురైన విద్యార్థి వీసా దరఖాస్తుల సంఖ్య గురించి మాత్రం అమెరికా విదేశాంగ శాఖ వెల్లడించలేదు.

భారత విద్యార్థులకు 38 శాతం తగ్గిన ఎఫ్-1 వీసాలు

గతేడాది డిసెంబర్ 9 నాటి వరకు ఉన్న గణాంకాల ప్రకారం.. 2024 సంవత్సరం తొలి తొమ్మిది నెలల్లో 2023 ఇదే సమయంతో పోలిస్తే భారతీయ విద్యార్థులకు ఎఫ్-1 వీసాలు 38 శాతం తగ్గినట్టు సమాచారం. కరోనా మహమ్మారి తర్వాత భారతీయ విద్యార్థులకు వీసాలు ఈ స్థాయిలో తగ్గటం ఇదే తొలిసారి కావటం గమనార్హం. బ్యూరో ఆఫ్ కాన్సులర్ అఫైర్స్ నెలవారీ నివేదికల సమాచారం ప్రకారం.. 2024 జనవరి నుంచి సెప్టెంబర్ మధ్య 64 వేల మంది భారతీయ విద్యార్థులకు ఎఫ్-1 వీసాలను జారీ చేశారు. అంతకుముందు 2023 ఇదే సమయంలో ఈ సంఖ్య 1.03 లక్షలుగా ఉండటం గమనార్హం.

దశాబ్ద కాలంలో వీసా దరఖాస్తులు

ఏడాది	ఆమోదం	తిరస్కరణ	మొత్తం	తిరస్కరణ రేటు
2024	4.01 లక్షలు	2.79 లక్షలు	6.79 లక్షలు	41శాతం
2023	4.45 లక్షలు	2.53 లక్షలు	6.99 లక్షలు	36 శాతం
2022	4.11 లక్షలు	2.21 లక్షలు	6.32 లక్షలు	35 శాతం
2021	3.58 లక్షలు	88,583	4.46 లక్షలు	20 శాతం
2020	1.11 లక్షలు	50,490	1.62 లక్షలు	31 శాతం
2019	3.64 లక్షలు	1.24 లక్షలు	4.88 లక్షలు	25 శాతం
2018	3.63 లక్షలు	1.95 లక్షలు	5.58 లక్షలు	35 శాతం
2017	3.94 లక్షలు	2.15 లక్షలు	6.09 లక్షలు	35 శాతం
2016	4.72 లక్షలు	2.47 లక్షలు	7.18 లక్షలు	34 శాతం
2015	6.44 లక్షలు	2.12 లక్షలు	8.56 లక్షలు	25 శాతం
2014	5.96 లక్షలు	1.73 లక్షలు	7.69 లక్షలు	23 శాతం

ఎంపీల జీతాలు 24 శాతం పెంపు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఎంపీల జీతాలు 24 శాతం పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సోమవారం కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పెంపు 2023 ఏప్రిల్ 1 నుంచి అమలు చేస్తారు. పార్లమెంట్ సభ్యుల జీతాలు, డైలీ అలవెన్సెస్, పెన్షన్, అదనపు పెన్షన్‌లలో కేంద్ర ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. వాటిని పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం పార్లమెంట్ సభ్యుల జీతం రూ. లక్షగా ఉంది. దాన్ని ఏకంగా 1.24 లక్షకు పెంచింది. డైలీ అలవెన్సెస్‌ను రూ.2 వేల నుంచి రూ.2,500కు పెంచింది. మాజీ సభ్యులకు ప్రతి నెలా రూ.25 వేల పెన్షన్ అందుతోంది. దాన్ని రూ.31 వేలకు పెంచింది. మాజీ సభ్యుల అదనపు పెన్షన్‌లోనూ మార్పులు చేసింది. దాన్ని రూ. 2 వేల నుంచి రూ.2,500కు పెంచింది. ఈ పెంపు 2023 ఏప్రిల్ 1 నుంచి వర్తిస్తుందని తెలిపింది.

చలో హైదరాబాద్ ఉద్రిక్తం

(మొదటిపేజీ తరువాయి)

వద్ద రోడ్డుపై యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పి.జయలక్ష్మి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీలాదేవి, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, హైదరాబాద్ సౌత్ అధ్యక్షులు మీనా, నాయకులు హేమలత, గంగామణి, సావిత్రి, మేడ్చల్ జిల్లా నాయకులు రుక్మిన్, నిజామాబాద్ జిల్లా నాయకులు నూర్జహాన్, సీఐటీయూ హైదరాబాద్ జిల్లా నాయకులు మహేందర్‌తోపాటు వందలాది మంది బైటాయించారు. వారిని పోలీసులు అరెస్టు చేసి ఓయూ, కాచిగూడ, నారాయణగూడ, సుల్తాన్ బజార్, అంబర్‌పేట్ పోలీస్ స్టేషన్లకు తరలించారు. అదే సమయంలో వందలాది మంది ఆశా వర్కర్లు ఉమెన్స్ కళాశాల చౌరస్తా నడిరోడ్డుపై బైటాయించారు. పోలీసులతో వాగ్వివాదం అనంతరం వారిని కూడా వ్యాన్లలోకి ఎత్తిపడేశారు. ఈ క్రమంలో పలువురు ఆశా వర్కర్లకు గాయాలయ్యాయి. అక్రమ అరెస్టులను నిరసిస్తూ పోలీస్ స్టేషన్‌ల ముందు ఆశా వర్కర్లు నిరసన వ్యక్తం చేశారు. పోలీసుల తోపులాటలో జయమ్మ అనే ఆశా వర్కర్ స్పృహ కోల్పోయింది. అంతకుముందు ధర్నాలో పి.జయలక్ష్మి మాట్లాడుతూ.. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.18,000 ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలని కోరారు. ప్రమోషన్, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత తదితర సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఏఎన్ఎం ట్రెనింగ్ పూర్తి చేసిన ఆశాలకు, ఏఎన్ఎం పోస్టుల్లో ప్రమోషన్ సౌకర్యం కల్పించాలని, వెయిటేజీ మార్కులు వెంటనే నిర్ణయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కోశాధికారి పి.గంగామణి, వర్కింగ్ ప్రెసిడెంట్ కాసు మాధవి, వివిధ జిల్లాల నుంచి పెద్దఎత్తున ఆశాలు తరలివచ్చారు.

అరెస్టులపై నిరసన కార్యక్రమాలకు పిలుపు

ఆశాల పోరాటంపై రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధం, అక్రమ అరెస్టులకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం అన్ని మండల కేంద్రాల్లో కార్యక్రమాలు చేపట్టాలని యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పిలుపునిచ్చారు.

అరెస్టులను ఖండిస్తున్నాం
సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

ఆశా వర్కర్లపై పోలీసులు దాడి చేయడం, అమానుషంగా అరెస్టు చేయడాన్ని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నదని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ తెలిపారు. వెంటనే ఆశా వర్కర్లతో చర్చలు జరిపి వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అరెస్టయిన ఆశావర్కర్లను ఓయూ, అంబర్‌పేట పోలీస్‌స్టేషన్లలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్, ఆశయ్య, రాష్ట్ర నాయకులు డిజి.నర్సింహారావు, కె.రమేష్, కోట రమేష్ తదితర రాష్ట్ర నాయకులు, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పరామర్శించారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. పోలీసులతో ఉద్యమాన్ని ఆపాలనుకుంటే మరింత ఉధృతంగా ముందుకొస్తుందని హెచ్చరించారు. ఆశాలకు అంతకంతకూ పని భారం పెరుగుతున్నది కానీ వేతనం రూ. 9700 మాత్రమే ఇస్తున్నారన్నారు. ఈ మేరకు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వేలాదిగా వచ్చిన ఆశాలతో మాట్లాడి, ముఖ్యమంత్రి అధికారులతో చర్చించి సమస్యలు పరిష్కరించకుండా, మహిళలని చూడకుండా బట్టలు చినిగి పోయేటట్టు లాగేసి, వ్యాన్లల్లో పడేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పలువురికి తీవ్ర గాయాలయ్యాయని చెప్పారు. మహిళలను నడి రోడ్డుమీద ఈడ్చి, ఈ విధంగా అవమానించినందుకు ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అరెస్టు చేసిన మహిళలందరినీ బేషరతుగా విడుదల చేయాలని, ప్రభుత్వం చర్చించి సమస్యలు పరిష్కరించకపోతే సీపీఐ(ఎం) ఆందోళనకు పూనుకుంటుందని హెచ్చరించారు.

అక్రమ అరెస్టులను ఖండిస్తున్నాం : సీఐటీయూ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం తమకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు ఇవ్వడంతో పాటు బీమాసౌకర్యం కల్పించాలనీ, ప్రభుత్వోద్యోగులుగా గుర్తించి పని భారం తగ్గించాలని డిమాండ్ చేస్తూ చలో హైదరాబాద్‌కు బయలుదేరిన ఆశావర్కర్లను అక్రమంగా అరెస్టు చేయడాన్ని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్కరాములు, పాలడుగు భాస్కర్ ఖండించారు. ఇండ్లలో నిద్రిస్తున్న ఆశాలను మహిళలని కూడా చూడకుండా అర్ధరాత్రి, తెల్లవారుఝామున బలవంతంగా పోలీస్ స్టేషన్లకు తరలించడాన్ని తప్పుబట్టారు. దుశ్చర్యలన్నింటినీ అధిగమించి కోఠి, హైదరాబాద్‌కు చేరుకున్న ఆశాలు శాంతియుతంగా ధర్నాకు సిద్ధపడుతుంటే పోలీసులు ఆశాలను బూటుకాళ్ళతో తన్నడం దుర్మార్గమన్నారు. తలకు, చేతులకు, కాళ్ళకు తీవ్ర గాయాలైన వారిని కూడా పట్టించుకోకుండా రోడ్డుపైన ఈడ్చుకుంటూ పోలీస్ వాహనాల్లో నిర్బంధించడాన్ని తప్పుబట్టారు. హైదరాబాద్‌లోని అంబర్‌పేట్, ఉస్మానియా యూనివర్సిటీ, కాచిగూడ, నారాయణగూడ, చంద్రాయణగుట్ట తదితర పోలీస్ స్టేషన్లలో నిర్బంధించిన ఆశాలను సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, సిఐటియు రాష్ట్ర కార్యదర్శులు జె. వెంకటేష్, కూరపాటి రమేష్ పరామర్శించారు. తీవ్ర గాయాలతో ఉన్న ఆశా వర్కర్లను ఉస్మానియా, సీజన్స్ ఆసుపత్రుల్లో పరామర్శించి ఓదార్చారు.

అలహాబాద్ హైకోర్టుకే యశ్వంత్ వర్మ

(మొదటిపేజీ తరువాయి)

ట్రాన్స్‌ఫర్ చేయాలని సుప్రీంకోర్టు కొలీజియం ఇప్పటికే ప్రతిపాదించింది. దీనిని ఇప్పుడు ధృవీకరించింది. కాగా, ప్రతిపాదిత బదిలీ సిఫారసును కేంద్రం ఆమోదించిన తర్వాత ఆయన ట్రాన్స్‌ఫర్ అమలులోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. కేంద్రానికి చేసిన ఈ బదిలీ సిఫారసును సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిన తీర్మానంలో బహిరంగంగా ప్రకటించింది. "సుప్రీంకోర్టు కొలీజియం మార్చి 20, 24 తేదీలలో జరిగిన సమావేశాలలో ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మను అలహాబాద్ హైకోర్టుకు పంపాలని సిఫారసు చేసింది" అని తీర్మానం వివరించింది. ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి డి.కె ఉపాధ్యాయ.. జస్టిస్ వర్మపై అంతర్గత విచారణ ప్రారంభించారనీ, ఆయనను బదిలీ చేసే ప్రత్యేక ప్రతిపాదన ఉన్నదని సుప్రీంకోర్టు ఈనెల 21న తెలిపింది. జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో జరిగిన సంఘటనకు సంబంధించి తప్పుడు సమాచారం, పుకార్లు వ్యాప్తి చెందుతున్నాయని వివరించింది. సమాచారం అందిన తర్వాత ప్రధాన న్యాయమూర్తి ఉపాధ్యాయ అంతర్గత విచారణ ప్రక్రియ ప్రారంభించారనీ, ఆధారాలు, సమాచారాన్ని సేకరించారని సుప్రీంకోర్టు తెలిపింది. మార్చి 20న సుప్రీంకోర్టు కొలీజియం సమావేశానికి ముందే జస్టిస్ ఉపాధ్యాయ విచారణ ప్రారంభించారని చెప్పింది.

కొలీజియం నిర్ణయంపై దుమారం

అలహాబాద్ హైకోర్టుకు జస్టిస్ వర్మను బదిలీ చేస్తూ సుప్రీంకోర్టు కొలీజియం తీసుకున్న నిర్ణయంపై ఇప్పటికే దుమారం చెలరేగింది. అలహాబాద్ హైకోర్టు బార్ అసోసియేషన్.. దీనిపై తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. అవినీతి ఆరోపణలున్న యశ్వంత్‌ను ఇక్కడకు ఎలా బదిలీ చేస్తారని నేరుగా సీజేఐకి లేఖ రాసింది. ఆ 'చెత్త' మాకొద్దంటూ తీవ్ర పదజాలాన్ని వినియోగించింది.

ఈనెల 14న రాత్రి 11.35 గంటల ప్రాంతంలో లుటియన్స్ ఢిల్లీలోని జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో జరిగిన అగ్నిప్రమాదం తర్వాత కాలిన నోట్ల కట్టలు పెద్ద ఎత్తున బయటపడ్డాయని ఆరోపణలు వచ్చిన విషయం విదితమే. సీజేఐ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని సుప్రీంకోర్టు కొలీజియం, ఢిల్లీ హైకోర్టు.. జస్టిస్ వర్మకు న్యాయపరమైన విధులు కేటాయించకుండా వరుస ఆదేశాలు జారీ చేశాయి.

విచారణ కోసం సీజేఐ అంతర్గత కమిటీని ఏర్పాటు చేశారు. జస్టిస్ యశ్వంత్ వర్మకు ఎలాంటి న్యాయపరమైన విధులనూ అప్పగించవద్దని ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి డి.కె ఉపాధ్యాయను ఆయన కోరారు. జస్టిస్ వర్మ నివాసంలో భారీగా నగదు దొరికిందని ఆరోపిస్తూ ఫొటోలు, వీడియోలతో సహా అంతర్గత విచారణ నివేదికను ఈనెల 22న సుప్రీంకోర్టు తన వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసింది. ఈనెల 14న అగ్ని ప్రమాదంలో జస్టిస్ వర్మ ఇంటిలోని స్టోర్‌రూమ్‌లో దొరికినట్టుగా చెప్పబడుతున్న నగదు ఫోటోలు, వీడియోలు ఈ నివేదికలో ఉన్నాయి. కాగా, నగదు దొరికిన విషయాన్ని జస్టిస్ వర్మ, ఆయన కుటుంబ సభ్యులు ఖండించిన విషయం తెలిసిందే. ఆ నగదు తమదేనన్న ఆరోపణలనూ వారు బలంగా తోసిపుచ్చారు. దీనిని కుట్రగా జస్టిస్ వర్మ అభివర్ణించారు.

జస్టిస్ యశ్వంత్ వర్మకు షాక్
న్యాయపరమైన విధులు అప్పగించని ఢిల్లీ హైకోర్టు

జస్టిస్ యశ్వంత్ వర్మకు మరొక షాక్ తగిలింది. ఆయనను న్యాయపరమైన విధులకు దూరంగా ఉంచుతూ ఢిల్లీ హైకోర్టు నిర్ణయం తీసుకున్నది. ఆయన జ్యుడీషియల్ వర్క్‌ను తక్షణమే ఉపసంహరించుకున్నది. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకూ ఈ నిర్ణయం అమలులో ఉంటుందని వివరించింది. అలాగే, యశ్వంత్ వర్మ నేతృత్వంలోని డివిజన్ బెంచ్-3 కోర్ట్ మాస్టర్.. ఆ రోజు చేపట్టాల్సిన విషయాలలో తేదీలను ఇస్తారని పేర్కొన్నది.

ఎన్నికల్లో మనీ గేమ్

(మొదటిపేజీ తరువాయి)

స్థాయిలో విచ్చలవిడిగా డబ్బును ఖర్చు చేస్తాయో ఈ అధ్యయనం బయట పెట్టింది. ఆదాయంలోనే కాదు..ఖర్చులోనూ అధికార బీజేపీదే పైచేయి. అధికార గణాంకాల అధ్యయనం ప్రకారం కేవలం 22 పార్టీలు రూ.18,742.31 కోట్లు ఖర్చు చేశాయి. వీటిలో ఆమ్‌ఆద్మీ, అసోం గణపరిషత్, అన్నా డీఎంకే, మజ్లిస్, తృణమూల్ కాంగ్రెస్, ఆల్ ఇండియా యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్, బీజేడీ, బీజేపీ, బీఎస్పీ, సీపీఐ (ఎం), డీఎంకే, కాంగ్రెస్, జేడీఎస్, జేడీయూ, ఎల్జేపీ (రాం విలాస్), ఆర్జేడీ, సమాజ్‌వాదీ, సిక్కిం డెమొక్రటిక్ ఫ్రంట్, సిక్కిం క్రాంతికారి మోర్చ, టీడీపీ, వైసీపీ ఉన్నాయి. ఇవన్నీ ఎన్నికల కోసం రూ.3,861.57 కోట్లు ఖర్చు చేయగా ఒక్క బీజేపీయే రూ.1,737.68 కోట్లు...అంటే మొత్తం వ్యయంలో 45 శాతం ఖర్చు చేసింది. అన్ని పార్టీలకూ కలిపి రూ.7,416.31 కోట్లు విరాళాల రూపంలో అందగా అందులో 84.5 శాతం ఒక్క బీజేపీ ఖాతాకే చేరాయి. కేవలం ఏడు పార్టీలు అందజేసిన వివరాల ప్రకారం ప్రింట్, టీవీ, డిజిటల్ వేదికల ద్వారా మీడియా ప్రకటనల కోసం రూ.992.48 కోట్లు, సోషల్ మీడియా, వర్చువల్ ప్రచారం కోసం రూ.196.23 కోట్లు ఖర్చు చేశారని సీహెచ్‌ఆర్ఐ డైరెక్టర్ వెంకటేష్ నాయక్ తెలిపారు. స్టార్ క్యాంపెయినర్ల హెలికాప్టర్, ప్రయివేటు జెట్ల ప్రయాణాలకు రూ.830.15 కోట్లు ఖర్చయ్యాయి.

ఇక బ్యానర్లు, హోర్డింగులు, పోస్టర్లు, ఇతర ప్రచార సామగ్రి నిమిత్తం రూ.398.49 కోట్లు ఖర్చు చేశారు. వివిధ రాజకీయ పార్టీలకు నగదు ఎలా లభించింది అని అడిగిన ప్రశ్నకు వెంకటేష్ నాయక్ సమాధానమిస్తూ 'జవాబు దొరకని ప్రశ్నలు అనేకం ఉన్నాయి. ఎన్నికలు ముగిసిన తర్వాత పార్టీల ఖాతాలలో రూ.14.848.46 కోట్లు నిల్వ ఉన్నాయి. ఈ అదనపు సొమ్ము ఎక్కడికి పోతుంది? బీజేపీ సహా ఆరు పార్టీల వద్ద ఎన్నికల ప్రారంభంలో కంటే ముగిసిన తర్వాతే ఎక్కువ సొమ్ము ఉంది. ఇది ఎలా సాధ్యం? సీపీఐ, జేఎంఎం, శివసేన, శిరోమణి అకాలీదళ్ సహా అనేక పార్టీలు తమ ఖర్చుల వివరాలే ఇవ్వలేదు' అని చెప్పారు.

జస్టిస్ వర్మ ఇంట్లో నోట్ల కట్టలపై చర్చకు బీజేపీ అడ్డగింత

(మొదటిపేజీ తరువాయి)



బీజేపీ లోక్‌సభలో తీవ్ర గందరగోళం సృష్టించింది. న్యాయమూర్తి ఇంటి నుంచి 'కరెన్సీ నోట్ల' ను కనుగొనడం సహా ముఖ్యమైన అంశాలపై చర్చ జరగకుండా నిరోధించడానికి బీజేపీ ఉనికిలో లేని అంశాలను రెచ్చగొడుతోందని ప్రతిపక్షం విమర్శించింది. ప్రతిపక్ష సభ్యులు పాలకపక్షమే పార్లమెంటు కార్యకలాపాలను స్తంభింపజేయడాన్ని కొత్త ధోరణిగా విమర్శించారు. ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి నివాసంలో నోట్ల కట్టలు దొరికిన ఘటనపై చర్చ జరపాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం) ఎంపీ వి. శివదాసన్ తో సహా ఇతర ప్రతిపక్ష ఎంపీలు నోటీసు జారీ చేశారు. రాజ్యసభ చైర్మెన్ జగదీప్ ధన్కర్, సభా నాయకుడు జేపీ నడ్డా, ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గేలతో దీనిపై చర్చించారు. సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం కొట్టివేసిన జాతీయ న్యాయ నియామకాల కమిషన్ (ఎన్‌జేఏసీ) చట్టం, న్యాయమూర్తుల నియామక ప్రక్రియపై ఈ సమావేశంలో చర్చించారు. ఉత్తరప్రదేశ్‌లో యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వ హయాంలో నేరాలు పెరుగుతున్నాయని నిరసిస్తూ సమాజ్‌వాదీ పార్టీ సభ్యులు ఈ ఉదయం లోక్‌సభకు పోస్టర్లతో రావడంతో స్పీకర్ ఓం బిర్లా ఆగ్రహం వ్యక్తం చేశారు. "మీరు సభకు పోస్టర్లను తీసుకురావద్దు. దయచేసి సహకరించండి. సభలో పోస్టర్లను చూపిస్తే..నేను మీపై చర్యలు తీసుకోవలసి వస్తుంది" అని ఆయన అన్నారు. పార్లమెంటును వాయిదా వేసేందుకు బీజేపీ "పూర్తిగా తప్పుడు" అంశాన్నీ ముందుకు తెచ్చిందని కాంగ్రెస్ కమ్యూనికేషన్ ప్రతినిధి జైరాం రమేశ్ దుయ్యబట్టారు. " బీజేపీ సభ్యులు సభను నడపకూడదని నిర్ణయించుకున్నట్లు కనిపిస్తోంది. చాలా రోజులుగా ఏదో ఒక సాకును వెతుక్కుంటూ (గందరగోళం సృష్టించడానికి) తిరుగుతున్నారు " అని వాయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ ఎద్దేవా చేశారు. సభ వాయిదా పడిన అనంతరం ఆమె పార్లమెంట్ ఎదుట మీడియాతో మాట్లాడారు.



26 నుంచి జాతీయ కరాటే పోటీలు

హైదరాబాద్ : జాతీయ కరాటే చాంపియన్‌షిప్ 2025 పోటీలు ఈ నెల 26 నుంచి గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ఆరంభం కానున్నాయి. 28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాలతో పాటు పారా మిలటరీ జట్లు 49 విభాగాల్లో నేషనల్ చాంపియన్‌షిప్ టైటిల్ కోసం పోటీపడనున్నాయి. అథ్లెట్లు, కోచ్‌లు, టెక్నికల్ సిబ్బంది సహా 1500 మంది ఈ మెగా ఈవెంట్‌లో పాల్గొననున్నారు. బుధవారం నుంచి పోటీలు షురూ అవనుండగా.. గురువారం జరిగే ఆరంభ వేడుకలకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హాజరు కానున్నారు. శనివారం జరిగే ముగింపు వేడుకలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై బహుమతులు ప్రదానం చేస్తారని నిర్వాహక కమిటీ చైర్మెన్, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (శాట్) నుంచి పూర్తి సహకారం అందిస్తామని శాట్ చైర్మెన్ కే. శివసేనారెడ్డి తెలిపారు.

ఐపీఎల్ హంగామా విశాఖ తీరానికి చేరింది. ఢిల్లీ క్యాపిటల్స్, లక్నో సూపర్ జెయింట్స్ మ్యాచ్‌తో తీరం పరుగులతో పోటెత్తింది. లక్నో బ్యాటర్లు మిచెల్ మార్ష్ (72), నికోలస్ పూరన్ (75) అర్థ సెంచరీలతో కదం తొక్కారు. 20 ఓవర్లలో 8 వికెట్లకు లక్నో సూపర్‌జెయింట్స్ 209 పరుగులు చేసింది.

మెరిసిన మార్ష్, పూరన్

- రిషబ్ పంత్, మార్‌క్రామ్ విఫలం
- లక్నో సూపర్‌జెయింట్స్ 209/8

నవతెలంగాణ-విశాఖపట్నం

మిచెల్ మార్ష్ (72, 36 బంతుల్లో 6 ఫోర్లు, 6 సిక్స్‌లు), నికోలస్ పూరన్ (75, 30 బంతుల్లో 6 ఫోర్లు, 7 సిక్స్‌లు) అర్థ సెంచరీలతో చెలరేగారు. విశాఖపట్నంలో సోమవారం జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్లను ఆడుకున్న మార్ష్, పూరన్‌లు లక్నో సూపర్‌జెయింట్స్‌కు భారీ స్కోరు అందించారు. మిడిల్ ఆర్డర్‌లో కెప్టెన్ రిషబ్ పంత్ (0), ఆయుశ్ బదాని (4) నిరాశపరిచినా ఆఖర్లో డెవిడ్ మిల్లర్ (27 నాటౌట్, 19 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్స్‌లు) మెరుపులతో తొలుత బ్యాటింగ్ చేసిన లక్నో సూపర్‌జెయింట్స్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 209 పరుగులు చేసింది. ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్లలో మిచెల్ స్టార్క్ (3/42), కుల్దీప్ యాదవ్ (2/20) వికెట్లు పడగొట్టారు.

దంచికొట్టారు :

ఐపీఎల్18లో రెండో సొంత మైదానం విశాఖలో టాస్ నెగ్గిన ఢిల్లీ క్యాపిటల్స్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. లక్నో ఓపెనర్లు ఎడెన్ మార్‌క్రామ్ (15, 13 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్), మిచెల్ మార్ష్ (72) మంచి ఆరంభాన్ని అందించారు. తొలి వికెట్‌కు 28 బంతుల్లో 46 పరుగులు జోడించారు. ఓ సిక్సర్, ఫోర్‌తో ఊపందుకున్న మార్‌క్రామ్ పవర్‌ప్లేలోనే వికెట్ కోల్పోయాడు. నికోలస్ పూరన్ (75)తో జతకలిసిన మిచెల్ మార్ష్.. ఢిల్లీ బౌలర్లకు చుక్కలు చూపించాడు. ఈ జోడీ రెండో వికెట్‌కు 42 బంతుల్లోనే 87 పరుగులు పిండుకుంది. ఓవర్‌కు పదికి పైగా రన్‌రేట్‌తో దంచికొట్టిన మార్ష్, పూరన్‌లు లక్నోను 250ప్లస్ స్కోరు దిశగా నడిపించారు. మార్ష్ ఐదు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో 21 బంతుల్లో అర్థ సెంచరీ సాధించగా.. నాలుగు ఫోర్లు, ఐదు సిక్సర్లతో 24 బంతుల్లో పూరన్ ఫిఫ్టీ నమోదు చేశాడు.

ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్లు డెత్ ఓవర్ల ముంగిట బలంగా పుంజుకున్నారు. 38 బంతుల వ్యవధిలో 6 వికెట్లు పడగొట్టి సూపర్‌జెయింట్స్ జోరుకు కళ్లెం వేశారు. స్పిన్నర్ కుల్దీప్ యాదవ్, పేసర్ మిచెల్ స్టార్క్‌లు వికెట్ల వేటలో సఫలం అయ్యారు. మిడిల్ ఆర్డర్‌లో ప్రమాదకర బ్యాటర్ రిషబ్ పంత్ (0) లక్నో తరఫున తొలి ఇన్నింగ్స్‌లో పరుగుల ఖాతా తెరువలేదు. ఆరు బంతులు ఆడిన పంత్.. కుల్దీప్ ఓవర్లో నిష్క్రమించాడు. ఆయుశ్ బదాని (4), శార్దుల్ ఠాకూర్ (0), షాబాజ్ అహ్మద్ (9) నిరాశపరిచారు. డెవిడ్ మిల్లర్ (27 నాటౌట్) మరో ఎండ్‌లో ధనాధన్ జోరు చూపించాడు. ఇన్నింగ్స్ ఆఖరు రెండు బంతులను సిక్సర్లుగా బాది లక్నో స్కోరు 200 మార్క్ దాటించాడు. ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్లలో మోహిత్ శర్మ, ట్రిస్టన్ స్టబ్స్, అక్షర్ పటేల్‌లకు వికెట్లు దక్కలేదు.



ముగ్గురికే గ్రేడ్-ఏ కాంట్రాక్టు

16 మందికి బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్టులు

ముంబయి : భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) 16 మంది మహిళా క్రికెటర్లకు వార్షిక సెంట్రల్ కాంట్రాక్టులు అందించింది. అందులో ముగ్గురు క్రికెటర్లకు మాత్రమే గ్రేడ్-ఏ కాంట్రాక్టు దక్కింది. బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్టు ప్రకారం గ్రేడ్-ఏ ప్లేయర్లకు రూ.50 లక్షలు, గ్రేడ్-బి ప్లేయర్లకు రూ.30 లక్షలు, గ్రేడ్-సి ప్లేయర్లకు రూ.10 లక్షల వార్షిక వేతనం అందనుంది. హర్మన్‌ప్రీత్ కౌర్, స్మృతీ మంధాన, దీప్తి శర్మలకు గ్రేడ్-ఏ కాంట్రాక్టు దక్కగా.. రేణుకా ఠాకూర్, జెమీమా, రిచా ఘోష్, షెఫాలీ వర్మలకు గ్రేడ్-సి కాంట్రాక్టు.. యస్తికా భాటియా, రాధ యాదవ్, శ్రేయాంక పాటిల్, టిటాస్ సాధు, అరుంధతి రెడ్డి, అమన్జోత్ కౌర్, ఉమా చెత్రీ, స్నేహ్ రానా, పూజ వస్త్రాకర్‌లకు గ్రేడ్-సి కాంట్రాక్టు లభించింది. శ్రేయాంక పాటిల్, టిటాస్ సాధు, అరుంధతి రెడ్డి, ఉమ, అమన్జోత్‌లకు కొత్తగా కాంట్రాక్టు ఇవ్వగా.. రాజేశ్వరి గైక్వాడ్, హర్లీన్ డియోల్, మేఘన సింగ్, దేవిక వైద్య, అంజలీ తమ కాంట్రాక్టులు కోల్పోయారు. ఈ మేరకు మహిళల సీనియర్ సెలక్షన్ కమిటీ, చీఫ్ కోచ్ అమోల్ ముజుందార్ సిఫారసు చేసిన జాబితాకు బీసీసీఐ ఆమోదం తెలిపింది. ఈ కాంట్రాక్టు అక్టోబర్ 1, 2024 నుంచి సెప్టెంబర్ 30, 2025 వరకు వర్తిస్తుంది.





ఏవైసీఏ అలవోక విజయం

టీడీసీఏ అండర్-17 క్రికెట్ టోర్నీ

హైదరాబాద్ : టీడీసీఏ అండర్-17 క్రికెట్ టోర్నీలో అమెరికన్ యూత్ క్రికెట్ అకాడమీ (ఏవైసీఏ) అలవోక విజయం సాధించింది. తెలంగాణ రూరల్ పాంథర్స్‌పై 104 పరుగుల తేడాతో గెలుపొందింది. జాంబ్ (57), తనుశ్ (41) రాణించగా తొలుత ఏవైసీఏ 50 ఓవర్లలో 9 వికెట్లకు 242 పరుగులు చేసింది. ఛేదనలో పాంథర్స్ 27 ఓవర్లలోనే కుప్పకూలింది. ఏవైసీఏ బౌలర్ రిత్విక్ (4/19), శ్రేయాన్స్ (2/12) మెరవటంతో పాంథర్స్ 138 పరుగులకే ఆలౌటైంది. పాంథర్స్ బ్యాటర్ శాండీ (70) ఒంటరి పోరాటం చేశాడు. మరో మ్యాచ్‌లో రైజర్స్ 33.5 ఓవర్లలో 167/10 పరుగులు చేయగా.. వారియర్స్ 31.2 ఓవర్లలోనే 168/6తో ఛేదించి 4 వికెట్లతో గెలుపొందింది. అంతకుముందు, రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర టోర్నమెంట్‌ను ప్రారంభించారు. టీడీసీఏ అధ్యక్షుడు వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

బ్లూ టైగర్స్‌కు సవాల్

బంగ్లాదేశ్‌తో భారత్ ఢీ నేడు



షిల్లాంగ్ (మేఘాలయ) : భారత ఫుట్‌బాల్ కొత్త సీజన్ సవాల్‌కు సిద్ధమైంది. ఏడాదిన్నరకు పైగా గెలుపు లేకుండా సాగిన భారత సాకర్ జట్టు ప్రయాణం.. సూపర్‌స్టార్ సునీల్ ఛెత్రీ రీ ఎంట్రీతో ముగిసింది. గత వారం జరిగిన మ్యాచ్‌లో మాల్దీవులపై 3-0తో గెలుపొందిన భారత్ అదే ఉత్సాహంతో నేడు ఏఎఫ్‌సీ ఆసియా కప్ క్వాలిఫయింగ్ గ్రూప్-సి పోరులో బంగ్లాదేశ్‌ను ఢీకొట్టనుంది. సునీల్ ఛెత్రి, లిస్టన్ కొలాకోలు గోల్స్ వేటలో ముందుండి నడిపిస్తున్నారు. ఫార్వర్డ్ ఛెత్రి, మిడ్ ఫీల్డర్ లిస్టన్‌లు పాదరసంలా కదులుతూ ప్రత్యర్థి డిఫెన్స్‌ను ఛేదిస్తున్నారు. కానీ బంగ్లాదేశ్ తరఫున ఇంగ్లాండ్ సాకర్ ప్రొఫెషనల్ హమ్జా చౌదరి అరంగేట్రం చేయనున్నాడు. దక్షిణాసియా జట్టు తరఫున ఓ హై ప్రొఫైల్ ఆటగాడు బరిలోకి దిగటం ఇదే తొలిసారి. ఏమాత్రం ఒత్తిడికి గురి కాని, ప్రత్యర్థి బలానికి బెదరని ఆటగాడు హమ్జా. నేడు ఛెత్రి, లిస్టన్ జంట హమ్జాను నిలువరించి భారత్‌ను విజేతగా నిలబెడతారా? చూడాలి. భారత్, బంగ్లాదేశ్ మ్యాచ్ రాత్రి 7 గంటలకు ఆరంభం కానుండగా.. స్టార్‌స్పోర్ట్స్, హాట్‌స్టార్‌లో ప్రసారం అవుతుంది.

ప్రీ క్వార్టర్స్‌లో స్వైటెక్

మియామి ఓపెన్ 2025



మియామి (యుఎస్‌ఏ) : మాజీ చాంపియన్, స్టార్ ప్లేయర్ ఇగా స్వైటెక్ (పోలాండ్) మియామి ఓపెన్ మహిళల సింగిల్స్‌లో ప్రీ క్వార్టర్‌ఫైనల్స్‌కు చేరుకుంది. బెల్జియం అమ్మాయి ఎలిసె మెర్టెన్స్‌పై 7-6(7-2), 6-1తో స్వైటెక్ వరుస సెట్లలో విజయం సాధించింది. ఆరు ఏస్‌లు, ఐదు బ్రేక్ పాయింట్లతో మెరిసిన స్వైటెక్ పాయింట్ల పరంగా 78-63తో పైచేయి సాధించింది. ఇండియన్‌వెల్స్ ఓపెన్ విజేత మిర్రా అండ్రీవ (రష్యా) 6-7(5-7), 6-2, 3-6తో అమెరికా అమ్మాయి చేతిలో ఓటమిపాలైంది. నాల్గో సీడ్ పెగులా 6-7(3-7), 6-2, 7-6(7-2)తో అనాపై గెలుపొందింది. పురుషుల సింగిల్స్‌లో నొవాక్ జకోవిచ్ 6-1, 7-6(6-1)తో అర్జెంటీనా ఆటగాడిపై అలవోక విజయం సాధించాడు. కాస్పర్ రూడ్ 6-4, 7-6(7-4)తో.. మోన్‌ఫిల్స్ 7-5, 5-7, 7-6(7-1)తో గెలుపొంది ముందంజ వేశారు.

ఆ రూల్ అవసరం లేదు!

ఇంపాక్ట్ ప్లేయర్‌పై ఎం.ఎస్ ధోని



చెన్నై : ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) చర్చనీయాంశంగా మారిన రూల్ ఇంపాక్ట్ ప్లేయర్. మ్యాచ్ గతినే మార్చివేస్తున్న ఇంపాక్ట్ ప్లేయర్ రూల్‌తో దాదాపు ప్రతి జట్టు 12 మందితో బరిలోకి దిగుతోంది. అవసరాని అనుగుణంగా బౌలర్, బ్యాటర్‌ను ఇంపాక్ట్ ప్లేయర్‌గా జట్లు ఆడిస్తున్నాయి. రెండు సీజన్లుగా ఐపీఎల్‌లో ఈ రూల్ కొనసాగుతుంది. క్రికెటర్లు, మాజీ ఆటగాళ్లు సహా విశ్లేషకుల నుంచి మిశ్రమ స్పందన వచ్చింది. చెన్నై సూపర్‌కింగ్స్ మాజీ కెప్టెన్ ఎం.ఎస్ ధోని జియోస్టార్‌తో మాట్లాడుతూ ఈ రూల్ అవసరం లేదని వ్యాఖ్యానించాడు. 'ఇంపాక్ట్ ప్లేయర్ రూల్ గురించి తొలిసారి విన్నప్పుడు.. ఐపీఎల్ మంచిగా సాగుతోంది. టీఆర్‌పీ రేటింగ్స్ ఎక్కువగా ఉన్నాయి. క్రికెట్ క్వాలిటీ సూపర్‌గా ఉంది. మంచి ఆటగాళ్లు లీగ్ నుంచి పుట్టుకొస్తున్నారు. ఇలాంటి సమయంలో ఈ రూల్ అవసరం లేదు. కానీ అమలు చేశారు. నిజానికి ఓ రకంగా ఇది ఉపయుక్తమే. కానీ నేను వికెట్ కీపింగ్ చేయాల్సి ఉంటుంది. అందుకే నేను ఇంపాక్ట్ ప్లేయర్‌గా రాలేను' అని ధోని తెలిపాడు.

తమీమ్‌కు గుండె సర్జరీ

మైదానంలో కుప్పకూలిన బంగ్లా స్టార్



ఢాకా : బంగ్లాదేశ్ మాజీ కెప్టెన్, వెటరన్ క్రికెటర్ తమీమ్ ఇక్బాల్ ఢాకా ప్రీమియర్ లీగ్ (డీపీఎల్) మ్యాచ్‌లో గుండెపోటుకు గురయ్యారు. డీపీఎల్‌లో మహ్మదన్ స్పోర్టింగ్ క్లబ్‌కు సారథ్యం వహిస్తున్న తమీమ్.. ఓ ఓవర్ ఫీల్డింగ్ చేసిన అనంతరం గుండెనొప్పితో మైదానం వీడాడు. సమీపంలోని ఆసుపత్రికి తరలించగా తమీమ్‌కు అత్యవసరంగా ఏంజియోప్లాస్టీ హృదయ శస్త్రచికిత్స చేశారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, అయినా కరోనరీ కేర్ యూనిట్ (సీసీయు) పర్యవేక్షణలో ఉంచారని... కుటుంబ సభ్యులు, సహచర క్రికెటర్లతో మాట్లాడినట్లు బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) వర్గాలు తెలిపాయి.



భిన్న కాంబినేషన్‌లో నయా సినిమా షురూ..

హీరో వరుణ్ తేజ్, దర్శకుడు మేర్లపాక గాంధీ కాంబినేషన్ ఇండో-కొరియన్ హర్రర్ -కామెడీతో సర్‌ప్రైజ్ చేయబోతున్నారు. వరుణ్ తేజ్ పుట్టినరోజున అనౌన్స్ చేసిన ఈ చిత్రం ఇప్పటికే హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. ఎగ్జైటింగ్ పోస్టర్ చాలా క్యూరియాసిటీని పెంచింది.

థ్రిల్లింగ్, హిలేరియస్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుందని హామీ ఇచ్చింది. యువి క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్టైన్మెంట్ నిర్మాణంలో తమన్ సంగీతం అందించనున్న ఈ చిత్రం వరుణ్ తేజ్ కెరీర్‌లో ఒక ల్యాండ్‌మార్క్ ప్రాజెక్ట్‌గా కాబోతోంది. సోమవారం హైదరాబాద్‌లో జరిగిన పూజా కార్యక్రమంతో ఈ సినిమా ఘనంగా ప్రారంభమైంది. పూజా కార్యక్రమంలో హీరోయిన్ రితిక నాయక్‌తో పాటు టీం సభ్యులు పాల్గొన్నారు. అలాగే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ కూడా సోమవారం నుంచే హైదరాబాద్‌లో స్టార్ట్ కానుంది.

నవ్వించడమే లక్ష్యంగా తీసిన చిత్రం



'మ్యాడ్ విజయానికి కారణం వినోదం. అదే మా బలం. దానిని దృష్టిలో పెట్టు కొని పూర్తి వినోద భరిత చిత్రంగా 'మ్యాడ్ స్క్వేర్'ను తెరకెక్కించాం. అలాగే ఈ సినిమాలో కామెడీ పూర్తిగా కొత్తగా ఉంటుంది' అని అంటున్నారు కథానాయకులు నార్నె నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్. ఈ ముగ్గురు నటించిన చిత్రం 'మ్యాడ్ స్క్వేర్'. బ్లాక్‌బస్టర్ చిత్రం 'మ్యాడ్'కి ఇది సీక్వెల్. కళ్యాణ్ శంకర్ దర్శకుడు. శ్రీకర స్టూడియోస్‌తో కలిసి సితార ఎంటర్టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై హారిక సూర్యదేవర, సాయి సౌజన్య నిర్మించారు. సూర్యదేవర నాగవంశీ సమర్పకులు. ఈ సినిమా ఈనెల 28న విడుదల కానున్న నేపథ్యంలో హీరోలు నార్నె నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్ మీడియాకి ఇచ్చిన ఇంటర్వ్యూ విశేషాలు..

ఈ చిత్రానికి మెయిన్ హీరో ఎవరు?

- వినోదమే ఈ సినిమాకి మెయిన్ హీరో. ఆ వినోదమే 'మ్యాడ్ స్క్వేర్'ని నడిపిస్తుంది. 'మ్యాడ్'తో పోలిస్తే ఇందులో కామెడీ ఎక్కువ ఉంటుంది. అలాగే పాత్రలు కూడా ఎక్కువ వినోదాన్ని పంచుతాయి.

నిర్మాత నాగవంశీ ఈ సినిమాలో కథ లేదన్నారు కదా?

- 'బాహుబలి, ఆర్‌ఆర్‌ఆర్' లాంటి సినిమాల నుంచి కథ ఆశించాలి. ఇది నవ్వించడమే లక్ష్యంగా తీసిన సినిమా. అందుకే పెద్ద కథ ఉంటుందని ఆశించకుండా, సరదాగా నవ్వుకోవడానికి రండి అని నిర్మాత నాగవంశీ చెప్పారు. అలాగే ఒక సినిమా మనం ఏ ఉద్దేశంతో చేశామనేది ముందే ప్రేక్షకులకు తెలిసేలా చేస్తే మంచిది. ఇది నవ్వించడానికి తీసిన సినిమా కాబట్టి, ఆ అంచనాలతో ప్రేక్షకులు థియేటర్లకు రావాలనే ఉద్దేశంతో అలా చెప్పారు.

సినిమాలో హీరోయిన్ పాత్రలు ఉంటాయా?

- మొదటి భాగానికి కొనసాగింపుగా వారి పాత్రలు మా జీవితాల్లో ఉంటాయి. కానీ, వారు తెర మీద కనిపించరు.

కుటుంబ ప్రేక్షకులు చూసేలా సినిమా ఉంటుందా?

- మొదటి పార్ట్ సమయంలో కూడా ఇలాంటి అనుమానాలే వ్యక్తమయ్యాయి. కానీ, సినిమా విడుదలైన తర్వాత కుటుంబ ప్రేక్షకులు ఎంతో ఆదరించారు. దీన్ని కూడా కూడా క్లీన్ కామెడీ ఫిల్మ్‌గానే రూపొందించాం.

లడ్డు పాత్ర ఎలా ఉండబోతుంది?

- 'మ్యాడ్'లో కంటే ఇందులో లడ్డు పాత్ర మరింత కామెడీగా ఉంటుంది. మేము ముగ్గురం కలిసి లడ్డుని ఫుల్‌గా ఆడుకుంటాం.

దర్శకుడు కళ్యాణ్ శంకర్ గురించి?

- చాలా హ్యూమర్ ఉన్న పర్సన్. ఈ సినిమాలోనూ పడిపడి నవ్వేలా సీన్స్ క్రియేట్ చేశారు. ఆయనకు మంచి గుర్తింపు తీసుకొచ్చే సినిమా అవుతుంది. ఆయనతో మళ్ళీ సినిమాలు చేయాలని ఉంది.

'మ్యాడ్' ఫ్రాంచైజ్ కంటిన్యూ చేస్తారా?

- చేస్తే బాగుంటుంది. కానీ, వెంటనే కాకుండా కొంత విరామం ఇచ్చి చేస్తే బాగుంటుంది అనుకుంటున్నాం.

నవచిత్రం

ఆ 20 నిమిషాల తర్వాత..



వెంకీ కుడుముల

నితిన్, శ్రీలీల జంటగా వెంకీ కుడుముల దర్శకత్వం వహించిన చిత్రం 'రాబిన్‌హుడ్'. మైత్రి మూవీ మేకర్స్ నిర్మించింది. ఈ సినిమా ఈనెల 28న థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా డైరెక్టర్ వెంకీ కుడుముల మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

- ఇందులో హీరో మాన్యుపులేటర్. ఫిజికల్ స్ట్రెంత్ కంటే మెంటల్ స్ట్రెంత్ స్ట్రాంగ్ అని నమ్మే పర్సన్. సినిమాలో ఫస్ట్ 20 మినిట్స్ క్యారెక్టర్ ఇంట్రడక్షన్ చేయడానికి చేసిన రకరకాల గెటప్స్ అలరిస్తాయి. 20 నిమిషాల తర్వాత కథ మారిపోతుంది. చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. ఈ సినిమా నితిన్ కెరీర్‌లో, నా కెరీర్‌లో బెస్ట్ మూవీ అవుతుందని నమ్మకం ఉంది. సినిమా అంతా రెగ్యులర్ ఇంట్రవెల్స్‌లో ఫన్ ఉంటుంది. ఫ్యామిలీ అంతా కలిసి చూడదగ్గ ఎంటర్టైనర్ ఇది.

- ఒక క్యామియో రోల్ ఇంటర్నేషనల్ స్టార్ చేస్తే బాగుంటుందని అనుకున్నాను. నిర్మాతలు ఎవరని అడిగినప్పుడు డేవిడ్ వార్నర్ అని చెప్పాను. నాకు క్రికెట్ చాలా ఇష్టం. అలాగే డేవిడ్ వార్నర్ ఆట కూడా ఇష్టం. అయితే ఇది సాధ్యమవుతుందని అనుకోలేదు. నిర్మాత రవి చాలా సీరియస్‌గా ట్రై చేసి, మీటింగ్ అరేంజ్ చేశారు. నేను చాలా సర్‌ప్రైజ్ అయ్యాను. వార్నర్‌ని ఢిల్లీలో కలిసి ప్రజెంటేషన్ ఇచ్చాను. ఆయన కూడా చాలా ఎగ్జైట్ అయ్యారు.

- ఈ సినిమాలో రాజేంద్ర ప్రసాద్‌ది చాలా ఇంపార్టెంట్ రోల్. ఆయన సెక్యూరిటీ ఏజెన్సీ నడుపుతుంటారు. ఆయన్ని హీరో మాన్యుపులేట్ చేసి ఓ సీరియస్ వరల్డ్‌లోకి తీసుకెళ్తాడు. ఆయన అమాయకంగా అందులో ఇరుక్కుపోతాడు. టాలెంట్ ఉండడం వేరు. టాలెంట్ ఉందని ఊహించుకోవడం వేరు. ఇందులో శ్రీలీల క్యారెక్టర్ రెండో టైపు(నవ్వుతూ). వెరీ ఇంటలెక్చువల్ అనుకునే అమ్మాయి. చాలా ఫన్నీగా ఉంటుంది. ఆ క్యారెక్టర్‌లో చాలా ఎంటర్టైన్మెంట్ ఉంటుంది.

- మ్యూజిక్ డైరెక్టర్ జీవి ప్రకాష్‌తో వర్క్ చెయ్యాలని ఎప్పటినుంచో ఉంది. ఆయన కరెక్ట్ టైంకి మ్యూజిక్ డెలివరీ చేసే కంపోజర్. ఇప్పటికే పాటలకి చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. బీజీఎం కూడా అద్భుతంగా చేశారు.

- 'భీష్మ' తర్వాత చిరంజీవితో సినిమా చేసే ఛాన్స్ మిస్సయ్యింది. అయితే - డెఫినెట్‌గా ఆయనతో సినిమా చేస్తాను (నవ్వుతూ).

అందమైన ప్రేమకథ



నవీన్ చంద్ర

'పొలిమేర' చిత్ర విజయంతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు దర్శకుడు డా.అనిల్ విశ్వనాథ్. ఆయన దర్శకత్వం వహించిన సినిమా '28^0C'. ఏప్రిల్ 4న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది.


నవీన్ చంద్ర హీరోగా నటించగా, షాలినీ వడ్నికట్టి హీరోయిన్‌గా కనిపించనుంది. వీరాంజనేయ ప్రొడక్షన్స్ బ్యానర్ పై ప్రొడ్యూసర్ సాయి అభిషేక్ నిర్మించారు. సోమవారం ఈ చిత్ర ట్రైలర్ రిలీజ్ ఈవెంట్‌ని మేకర్స్ ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా నిర్మాత సాయి అభిషేక్ మాట్లాడుతూ, 'మా సినిమాను ఓటీటీ కంటే బిగ్ స్క్రీన్ మీదకు తీసుకురావాలనే పట్టుదలగా ఉన్నాం. నా కో ప్రొడ్యూసర్స్ కూడా సపోర్ట్ చేశారు. మేమంతా వెయిట్ చేసి ఎట్టకేలకు థియేట్రికల్ రిలీజ్‌కు తీసుకొస్తున్నాం. సినిమాను థియేటర్స్‌లో చూసిన ఫీల్ వేరుగా ఉంటుంది. ఈ సినిమా మీ అందరికీ నచ్చి, మా ఎఫర్ట్స్‌కు మంచి రిజల్ట్స్ ఇస్తుందని ఆశిస్తున్నాం' అని తెలిపారు.

'దర్శకుడిగా నేను చేసిన తొలి సినిమా ఇది. ఇదొక బ్యూటీఫుల్ లవ్ స్టోరీ. థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ ఉంటాయి. హీరో హీరోయిన్స్ జంట మధ్య అనుకోని ఓ సమస్య వస్తే, దానిని వారు ఎలా ఫేస్ చేశారు అనేది ఆసక్తికరంగా ఉంటుంది. సినిమా చివరి 20 నిమిషాలు మీరు ఎక్స్‌పెక్ట్ చేయలేరు. అంత కొత్తగా ఉంటుంది. ఈ సినిమాను చూసిన నా ఫ్రెండ్ వంశీ నందిపాటి ఇంతమంచి మూవీని రిలీజ్ చేయకుండా ఎలా ఉన్నారని అడిగి, తనే రిలీజ్ చేసేందుకు ముందుకొచ్చారు' అని డైరెక్టర్ డా.అనిల్ విశ్వనాథ్ చెప్పారు.

హీరో నవీన్ చంద్ర మాట్లాడుతూ,'డాక్టర్స్ అయిన ఓ జంట ప్రేమ కథ ఇది. 28^0C లోనే హీరోయిన్ క్యారెక్టర్‌ను ఉంచాలి లేకుంటే తనకు ప్రాబ్లెమ్ అవుతుంది. ఈ పాయింట్ విన్నప్పుడు ఎగ్జైటింగ్‌గా అనిపించింది' అని అన్నారు.

డ్రగ్స్ రహిత సమాజం కోసం..



భీమగాని సుధాకర్ గౌడ్

'ఆదిత్య', 'విక్కీస్ డ్రీమ్', 'డాక్టర్ గౌతమ్' వంటి సందేశాత్మక బాలల చిత్రాలతో ప్రశంసలతో పాటు జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు అందుకున్నారు దర్శక, నిర్మాత భీమగాని సుధాకర్ గౌడ్.

శ్రీలక్ష్మి ఎడ్యుకేషనల్ ఛారిటబుల్ ట్రస్ట్ సమర్పణలో సంతోష్ ఫిలిమ్స్ బ్యానర్ పై ఆయన రూపొందిస్తున్న మరో బాలల చిత్రం 'అభినవ్'.

ఈ సినిమాను చిల్డ్రన్స్ డే సందర్భంగా నవంబర్ 14న రిలీజ్ చేయబోతున్నారు. ఈ సందర్భంగా దర్శక, నిర్మాత భీమగాని సుధాకర్ గౌడ్ మాట్లాడుతూ, 'మన సమాజానికి జాఢ్యంలా పట్టుకున్న డ్రగ్స్ భూతం విద్యార్థులనూ వదలడం లేదు. డ్రగ్ మాఫియా విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని మన దేశాన్ని నిర్వీర్యం చేయాలని ప్రయత్నిస్తోంది. ఇందులో అంతర్జాతీయ కుట్ర కోణం కూడా ఉండొచ్చు. గ్రామీణ ప్రాంతాల్లో గంజాయి మాఫియా బాగా పెరిగింది. స్వాతంత్ర్య సమరయోధుడైన తన తాతయ్య నారాయణరావు స్ఫూర్తితో అభినవ్ అనే సాహస బాలుడు ఈ గంజాయి మాఫియా ఆట ఎలా కట్టించాడు అనేది ఈ చిత్రంలో చూడబోతున్నారు. తన స్నేహితులతో కలిసి అభినవ్ చేసిన సాహసాలు ఆకట్టుకుంటాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డ్రగ్స్ రహిత సమాజం కోసం సినిమా వాళ్లు చిన్న వీడియో చేయాలని కోరారు. నా వంతుగా ఈ సినిమాను నిర్మించి, దర్శకత్వం వహించాను. ఎన్‌సీసీ, స్కౌట్స్, యోగ, ధ్యానం నేర్చుకోవడం ద్వారానే పిల్లలు ఇలాంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండగలరు. మన దేశం ఆర్థికంగా వెనకబాటుకు పిల్లల్లో అక్షరాస్యత లేకపోవడం కూడా కారణం. పిల్లలను బాగా చదివించడం ద్వారా మన దేశాన్ని అగ్రగామిగా నిలపవచ్చు. ఇలాంటి అంశాలన్నీ అభినవ్ చిత్రంలో చూపిస్తున్నాం' అని తెలిపారు.

'ఓ భామ అయ్యో రామ'

సుహాస్ తాజాగా నటిస్తున్న రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ 'ఓ భామ అయ్యో రామ'. మలయాళ కథానాయిక మాళవిక మనోజ్ ఈ చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అవుతున్నారు.

రామ్ గోదాల దర్శకుడు. వీ ఆర్ట్స్ పతాకంపై హరీష్ నల్ల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా ఈ చిత్రాన్ని విడుదల చేయనుంది. వేసవిలో ఎంటర్‌టైన్‌చేయనున్న ఈ చిత్ర టీజర్‌ను సోమవారం మేకర్స్ విడుదల చేశారు మేకర్స్.

ఈ సందర్భంగా నిర్మాత హరీష్ మాట్లాడుతూ, 'పూర్తి ఎంటర్‌టైనింగ్‌గా రాబోతున్న ఈ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ మీ హృదయాలను దోచుకుంటుంది. నిర్మాతగా ఓ మంచి సినిమాను ఇవ్వబోతున్నాం అనే నమ్మకం ఉంది' అని అన్నారు.



సుహాస్, మాళవిక మనోజ్

'తెలుగులో ఓ మంచి సినిమాతో అడుగుపెడుతున్నందుకు ఆనందంగా ఉంది' అని హీరోయిన్ మాళవిక చెప్పారు.

దర్శకుడా రామ్ గోదాల మాట్లాడుతూ, 'మణికందన్ తన ఫోటోగ్రఫీతో ఈ సినిమాను చాలా కలర్‌ఫుల్‌గా మలిచాడు. రథన్ ఈ లవ్‌స్టోరీకి చాలా మంచి సంగీతాన్ని అందించాడు. ఈ సినిమాలో ఉన్న ఆరు పాటలు వేటికవే అనే విధంగా బ్యూటిఫుల్‌గా ఉంటాయి' అని తెలిపారు.

హీరో సుహాస్ మాట్లాడుతూ, 'సాంగ్స్ చాలా బాగుంటాయి. నిర్మాత ఎక్కడా రాజీపడకుండా చాలా క్వాలిటీగా తీశారు. సినిమాలో ప్రతి సన్నివేశం కొత్తగా ఉంటుంది. లవ్‌స్టోరీ కొత్తగా ఉంటుంది. దర్శకుడు ఈ సినిమాని అందరికి నచ్చేలా తెరకెక్కించారు' అని చెప్పారు.

ఈ కార్యక్రమంలో స్పిరిట్ మీడియా ప్రవీణ్, ఆర్ట్ డైరెక్టర్ బ్రహ్మ కడలి, ఆదిత్య మ్యూజిక్ నిరంజన్, మణికందన్, మోహిత్ తదితరులు పాల్గొన్నారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886